అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 30-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 88 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల: 8.00

గాజాపై మరోసారి దాడి

21 మంది మృతి



గాజా : గాజాపై తాజా దాడుల్లో 21మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో దక్షిణ గాజాలో 13మంది చనిపోగా, బెయిట్‌లాహియాలో ఆరుగురు మృతిచెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. సహాయక చర్యలు చేపట్టేందుకు వెళ్లి అదృశ్యమైన 14మంది వారం రోజుల తర్వాత మృతులుగా తేలారు. దక్షిణ రాఫా నగరంలో ఆ 14మందిని చంపేసి వారి అంబులెన్సులతో సహా దహనం చేశారని సాక్షులు తెలిపారు. చారిటీ కిచెన్‌ల ముందు ఆహారం కోసం బారులు తీరి నిలుచున్న వారిపై ఇజ్రాయిల్ డ్రోన్లతో దాడులకు దిగుతోంది. ఇప్పటికే డజన్ల సంఖ్యలో చారిటీ కిచెన్‌లను నాశనం చేసిన ఇజ్రాయిల్ మిలటరీ ఆహార పంపిణీ కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తోంది. ఒక పద్ధతి ప్రకారం కృత్రిమంగా కరువును సృష్టించి ప్రజలను ఆకలి బాధలతో చనిపోయేలా చూస్తోందని హమాస్ విమర్శిస్తోంది. ఈ నెల 18న కాల్పుల విరమణ ఒప్పం దాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన తర్వాత 921మంది చనిపోయారు. గత నవంబరులో హిజ్బుల్లాతో కాల్పుల విరమణకు అంగీరించిన తర్వాత మొదటిసారిగా బీరుట్ నగరంపై ఇజ్రాయిల్ బాంబు దాడు లకు తెగబడింది. ఇప్పటికి మూడు వారాలకు పైగా ఆహార సాయాన్ని నిలిపివేయడంతో గాజాలో వందలు వేల సంఖ్యలో పాలస్తీనియన్లు తీవ్రమైన క్షుద్బాధను ఎదుర్కొంటున్నారు.

ఆచూకీ లేదు

- దజనుకు పైగా సహాయ కార్మికులు మరణం.. అదృశ్యం
- పౌర సంఘాల ఆందోళన

గాజా : గత కొన్ని రోజులుగా గాజాలో డజనుకు పైగా సహాయ కార్మికులు మరణిం చటం లేదా కనిపించకుండా పోయారని అనేక పౌర సంఘాలు చెప్తున్నాయి. పాలస్తీనా ఎన్‌క్లేవ్‌పై ఇజ్రాయెల్ తన సైనిక దాడిని పునరుద్ధరించిన నేపథ్యంలో.. మానవతా సహా యాన్ని పూర్తిగా అడ్డుకోవడం ఒక నెల మార్కుకు చేరుకున్నది. పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ యూఎన్ ఆర్‌డబ్ల్యూఏ.. గత వారంలో గాజాలో తన సిబ్బందిలో ఎనిమిది మంది మరణించారని తెలిపింది. అయితే ఇజ్రాయెల్ దళాలు రఫాలోని దక్షిణ గాజా గవర్నరేట్‌లో అంబులెన్స్‌లు మరియు అగ్నిమాపక వాహనాలపై కాల్పులు జరిపిన సంఘటన తర్వాత పాలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ (పీఆర్‌సీఎస్) తన తొమ్మిది మంది అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు (ఈఎంటీలు) ఆదివారం నుంచి కనిపించకుండా పోయారని తెలిపింది.

నిదురపోరా తమ్ముడా!

- భారతీయులను వేధిస్తున్న నిద్ర లేమి
- ఫోన్‌తో కాలక్షేపం...
- విశ్రాంతికి దూరం
- ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు

'నిదురపోరా తమ్ముడా!' సంతానం సినిమాలో లతా మంగేష్కర్ పాడిన పాట మనకు గుర్తుండే ఉంటుంది. నిద్రపోతే జరిగే మంచేమిటోఆ పాట తెలియజేస్తుంది. 'ఎర్లీ టు బెడ్... ఎర్లీ టు రైజ్'.... అంటే పెందలాడే నిద్రపోయి తొందరగా నిద్ర లేవాలని అర్థం. ఇది ఎప్పుడో పెద్దలు చెప్పిన మాట. కానీ మన భారతీయులలో చాలా మందికి ఈ సూత్రం రుచించడం లేదు. నిద్ర అనేది మంచి ఆరోగ్యానికి పునాది. సకాలంలో నిద్ర పోతే ఎక్కువ సమయం విశ్రాంతి దొరుకుతుంది. కానీ భారతీయులకు అదే కరువవుతోంది.



న్యూఢిల్లీ : వేక్‌ఫిట్ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం భారతీయులకు నిద్ర అనేది పెద్ద సమస్యగా మారింది. సరైన నిద్ర లేకపోవడం అనేక ప్రతికూల పరిణామాలకు దారితీస్తోంది. వేక్‌ఫిట్ సంస్థ గత సంవత్సరం మార్చి నుండి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ నాలుగున్నర వేల మంది అభిప్రాయాలను సేకరించింది. వీరిలో 58 శాతం మంది రాత్రి 11 గంటల తర్వాతే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. పది గంటలకే నిద్ర పోవాలని వైద్యులు చేస్తున్న సూచనలను వీరు పట్టించుకోవడం లేదు. కొల్‌కతా నగరం నిశాచరులకు కేంద్రంగా మారుతోంది. అక్కడ రాత్రి 11 గంటలు దాటిన తర్వాతే 72.8 శాతం మంది నిద్రపోతున్నారట. చెన్నై, హైదరాబాదులో ఇది 55 శాతంగా మాత్రమే ఉంది. అంటే కొంతలో కొంత నయమన్న మాట. సర్వేలో భాగస్వాములైన 84 శాతం మంది రాత్రి పడుకోబోయే ముందు సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తూ సమయాన్నే మరచిపోతున్నారని వేక్‌ఫిట్ తెలిపింది. కొందరేమో టీవీలో వివిధ ఎపిసోడ్లు చేస్తూ కాలం గడిపేస్తున్నారు.

ఫోన్ వినియోగం యువతలో ఎక్కువగా కన్పిస్తోంది. 25-30 సంవత్సరాల మధ్య వయస్కులలో 90 శాతం మందికి ఫోన్ లేనిదే కాలం గడవదు. వీరు నిద్ర పోవడానికి ముందు ఎక్కువగా ఫోన్ చూస్తుంటారు. నిద్రపోయే ముందు ఫోన్‌ను ఉపయోగించే వారు గురుగ్రామ్ (94 శాతం), బెంగళూరు (90 శాతం) నగరాలలో అధిక సంఖ్యలో ఉన్నారు. పాతిక ముప్పై సంవత్సరాల వయసు వారు నిద్రకు ముందు ఎక్కువగా ఫోన్‌ను వాడుతున్నారు. బాగా పొద్దుపోయాక ఫోన్ కట్టేసి నిద్రకు ఉపక్రమిస్తున్నారు. ఫలితంగా వారికి చాలినంత నిద్ర, విశ్రాంతి లభించడం లేదు. విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి ఉద్యోగాలలో చేరిన వారు, పగలంతా కష్టపడి పనిచేసే వారు ఎక్కువగా రాత్రి సమయంలో ఫోన్‌ను వాడుతున్నారు. రోజంతా క్షణం తీరిక లేకుండా గడిపిన వారు కొంత వినోదం కోసం రాత్రి పడుకునే ముందు ఫోన్ చూస్తూ ఉపశమనం పొందుతుంటారు. భవిష్యత్తుపై ఆందోళనలతో నిద్ర లేని రాత్రులు గడిపే వారు కూడా ఉంటారు. వీరు తరచుగా ఒత్తిడికి గురై మానసిక ప్రశాంతత కోల్పోతుంటారు. రాత్రి సమయంలో సరిగా నిద్ర పోని వారికి తెల్లవారగానే అనేక సమస్యలు ఎదురవుతాయి. వీరిలో 44 శాతం మంది అశాంతికి గురవుతున్నారు. 59 శాతం మంది మరునాడు పని ప్రదేశంలో నిద్రావస్థలో జోగుతుంటారు.

రాత్రి పూట లేటుగా పడుకునే వారిలో మొండితనం, బద్ధకం వంటి లక్షణాలు కన్పిస్తుంటాయి. వారు అప్రమత్తంగా ఉండలేరు.

రోజువారీ పనులను సమర్థవంతంగా చేయలేరు. ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు నిద్రలేమితో బాధపడుతున్నారని సర్వే తెలిపింది. ఫోన్ ఉపయోగిస్తూ రాత్రి పూట ఆలస్యంగా నిద్రించే పిల్లలు, యువతలో ఆరోగ్య సమస్యలు అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌లో చూసే దృశ్యాలు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఉత్సు కతను, భావోద్వేగాలను కలిగించే దృశ్యాలను ఫోన్‌లో చూసే వారికి నిద్ర సరిగా పట్టదు. సరైన విశ్రాంతి లభించకపోతే ఊబకాయం, నిరాశా నిస్పృహలు, గుండె సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరించారు.

మోడీ తీరుతో బ్యాంకింగ్ రంగంలో సంక్షోభం!

- మిత్రులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు

బిజినెస్



బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లను 5జిగా మారుస్తాం

- జూన్ నుంచి ప్రక్రియ ప్రారంభం
- ప్రయివేటు టెల్కోలకు శాటిలైట్ ఇంటర్నెట్ అనుమతులు: కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్ దేశ వ్యాప్తంగా ఒక్క లక్ష 4జి మొబైల్ టవర్లను స్వదేశీ పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిందని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. వీటిని వచ్చే జూన్ నుంచి 5జిగా మార్చే ప్రక్రియను చేపట్టనున్నామని చెప్పారు. సెప్టెంబర్ 2023 నుంచి 2025 మార్చి 5 మధ్య 83,629 బిఎస్‌ఎన్‌ఎల్ టవర్లను 4జిగా ఆధునీకరించామని ఇటీవలే పార్లమెంట్‌కు మంత్రి తెలిపారు. మరో 74,123 సైట్లను 4జిగా మార్చనున్నామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ యోజన కింద వీటిని అప్‌గ్రేడ్ చేస్తోన్నామని చెప్పారు. ప్రభుత్వం డైరెక్ట్ టు డివైస్ ఉపగ్రహ సేవలను ప్రారంభించిందని సింధియా తాజాగా వెల్లడించారు. ఈ సాంకేతికతలో నెట్‌వర్క్‌కు కనెక్ట్ కానప్పుడు కూడా స్మార్ట్‌ఫోన్ నుంచి సందేశాలను పంపొచ్చన్నారు. అప్పుడు కనెక్టివిటీ మొబైల్ టవర్ నుంచి కాకుండా ఉపగ్రహం నుంచి నేరుగా అందుతుందన్నారు.

ఆ రెండింటికి లైసెన్స్..

భారత్‌లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీని కోసం ఇతర అనేక కంపెనీలు సైతం ఆసక్తిని చూపిస్తున్నాయన్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ కమ్యూనికేషన్ సేవల కోసం ఇప్పటికే రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్‌కు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో నాలుగు టెలికం కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ వినియోగదారులు ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 120 కోట్లకు పైగా పెరిగిందన్నారు. 97 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్‌కు శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ప్రయివేటు టెల్కోలకు స్పెక్ట్రం ఫీజులు, వేలం లేకుండానే ఈ సేవలకు అనుమతులు ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తమవుతోన్న విషయం తెలిసిందే.

సొంత కంపెనీకే 'ఎక్స్'ను అమ్మేసిన ఎలన్ మస్క్



వాషింగ్టన్ : ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)ను విక్రయించినట్లు ఎలన్ మస్క్ వెల్లడించారు. అయితే దీన్ని తన సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ అయినటువంటి 'ఎక్స్ఎఐ'కే 33 బిలియన్ల డాలర్ల (దాదాపు రూ.2.82 లక్షల కోట్లు)కు అమ్మేసినట్లు 'ఎక్స్' వేదికగా మస్క్ ప్రకటించారు. ఈ లావాదేవీ పూర్తిగా స్టాక్ రూపంలో జరిగిందన్నారు. తాజా స్వాధీనంతో ఎక్స్ఎఐ విలువను 80 బిలియన్ డాలర్లుగా నిర్ధారించారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను 44 బిలియన్ డాలర్ల (రూ.3.76 లక్షల కోట్లకు)కు ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. ఆ సంస్థలతో అనేక మార్పులు చేయడంతో పాటుగా ట్విట్టర్ పేరును కూడా ఎక్స్‌గా మార్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించి వారిని రోడ్డున పడేశారు. చాట్‌జిపిటికి పోటీగా గతేడాది మస్క్ 'ఎక్స్ఎఐ'ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎక్స్ఎఐ అధునాత ఎఐ సామర్థ్యాన్ని, ఎక్స్‌కు అనుసంధానించడం ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు.

భారత్‌లో ఇన్ కార్ ఉత్పత్తుల తయారీ

- పయనీర్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో ఇన్ కార్ ఉత్పత్తుల తయారీని ప్రారంభించనున్నట్లు జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ పయనీర్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందుకోసం 2023లో ఇక్కడ ఒక ఆర్అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపింది. కాగా.. 2026 నుంచి తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నామని పయనీర్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సిఇఒ షిరో యహరా తెలిపారు. ఇది భారత్‌లో తమ ఉనికిని మరింత బలపర్చనుందన్నారు. "ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ ఎక్స్ పీరియన్స్" అనే కార్పొరేట్ విజన్‌తో ముందుకు సాగుతున్నామన్నారు. ఇక్కడి ఆటోమొబైల్ సంస్థలతో తమ వ్యాపారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇది అద్భుతమైన అవకాశాన్ని ఇవ్వనుందన్నారు.

పసిడి ధర రూ.96వేలకు చేరొచ్చు..!

న్యూఢిల్లీ : అమెరికా టారీఫ్ యుద్ధానికి తోడు అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల 2025 ద్వితీయార్థంలో 10 గ్రాముల బంగారం ధర రూ.96,000కు చేరొచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ అంచనా వేసింది. ప్రథమార్థంలో రూ.87,000 నుంచి రూ.90,000గా నమోదుకావొచ్చని పేర్కొంది. ద్వితీయార్థంలో రూ.94,000-96,000 మధ్య ఉండొచ్చని విశ్లేషించింది. భారత్‌లో పసిడి పెట్టుబడి మాత్రమే కాదని.. పెళ్లిళ్లు, పండగలకు అంతర్గత సాంప్రదాయానికి సూచికని పేర్కొంది. ఇటీవల వరుసగా పెరుగుతోన్న బంగారం ధరలు కొనుగోళ్లను దెబ్బతీస్తున్నాయని తెలిపింది.

మొబైల్ యాప్‌తోనూ నీటి వృధాను అరికట్టొచ్చు

- లారిట్జ్ నడ్సన్ నుంచి కొత్త వ్యవసాయ ఆవిష్కరణలు

హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో ఆటోమేషన్‌ను ప్రోత్సహించేందుకు సరికొత్త కనెక్టెడ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించినట్లు లారిట్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ (గతంలో ఎల్అండ్‌టి స్విచ్‌గేర్) వెల్లడించింది. తమ స్మార్ట్‌కామ్ ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎంఎస్) మొబైల్ యాప్ ద్వారా నీరు వ్యర్థం కావడాన్ని తగ్గించి, దిగుబడులు పెంచేందుకు దోహదం చేస్తోందని ఆ కంపెనీ సిఎఫ్ఒ నరేష్ కుమార్ పేర్కొన్నారు. రైతులు వనరులను సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు, ఉత్పాదకతను, దిగుబడులను పెంచుకునేందుకు ఈ వినూత్న ఉత్పత్తులు, సొల్యూషన్స్ తోడ్పడతాయన్నారు. వచ్చే కొన్నాళ్లలో 1.20 లక్షల హెక్టార్ల స్థలంలో 25,000 మంది రైతులు తమ ఈ ఆటోమేటెడ్ వ్యవసాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వియత్నాంలో స్కోడా అసెంబుల్ యూనిట్ ఏర్పాటు

న్యూఢిల్లీ : వియత్నాంలో స్కోడా కుషాక్, స్లావియాను అసెంబుల్ చేయడానికి ప్లాంట్‌ను ప్రారంభించినట్లు లగ్జరీ కార్ల కంపెనీ స్కోడా ఆటో వెల్లడించింది. ఇందుకోసం అక్కడి ప్రాంతీయ భాగస్వామి ఇన్వెస్టర్ థాన్ కాంగ్ గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. భారత్ నుండి దిగుమతి చేసుకున్న కంప్లీట్లీ నాక్డ్ డౌన్ కిట్‌ల నుండి వాహనాలను అసెంబుల్ చేయనున్నట్లు స్కోడా వెల్లడించింది. వియత్నంలో ప్రస్తుతం 15 స్కోడా విక్రయ కేంద్రాలున్నాయని.. ఈ ఏడాది ముగింపు నాటికి 32కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్కోడా ఆటో సిఇఒ క్లాస్ జెల్మెర్ పేర్కొన్నారు.

ట్రిమెట్రోకు ఆర్‌స్టీల్ గ్రీన్ టిఎంటి బార్‌లు

హైదరాబాద్ : ఆర్‌స్టీల్‌కు ట్రిమెట్రో గ్రూప్ నుంచి భారీ ఆర్డర్ దక్కింది. భువనేశ్వర్‌లోని ఎపిక్ గ్రూప్ తయారీ యూనిట్ నిర్మాణం కోసం గ్రీన్ టిఎంటి బార్‌లను ట్రిమెట్రో గ్రూపునకు అందించినట్లు ఆర్‌స్టీల్ తెలిపింది. ఎపిక్ గ్రూప్ రూ.377 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఈ బార్‌లు అత్యల్ప ఉద్గారాలతో తయారు చేయబడుతాయని ఆ కంపెనీ తెలిపింది. ఈ గ్రీన్‌స్టీల్‌తో కార్బన ఉద్గారాలు 20 శాతం మేర తగ్గనున్నాయని ఆర్‌స్టీల్ ప్రతినిధి అశ్విని కుమార్ భాటియా పేర్కొన్నారు.

మహిళా విద్యకు పునాదులేసిన సావిత్రీబాయి ఫూలే..

ప్రొ. కంచ ఐలయ్య

ఓయూలో స్మారక ఉపన్యాసం కార్యక్రమం



నవతెలంగాణ-ఓయూ

సావిత్రీబాయి ఫూలే మహిళా విద్యకు పునాదులు వేశారని ప్రముఖ రచయిత ప్రొ.కంచ ఐలయ్య అన్నారు. హైదరాబాద్ ఓయూలోని ఫూలే-అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇంక్లూజివ్ అండ్ ఎంపవర్‌మెంట్ స్టడీస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో యూనివర్సిటీ బీసీ సెల్ ఆధ్వర్యంలో "సావిత్రీబాయి ఫూలే- భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు" అనే అంశంపై శనివారం స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. సమాజంలో ఆదర్శప్రాయులుగా నిలవడానికి సావిత్రీబాయి ఫూలే ఆలోచనలను స్వీకరించాలని సూచించారు. అంకిత భావంతో ఆమె చేసిన కృషి, సేవలపై విద్యార్థులు పరిశోధనలు జరపాలన్నారు. విద్యార్థులు, యువత ఆమెను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని, సమాజంలో విద్య ద్వారానే వివక్షను తొలగిపోతుందని చెప్పారు. సావిత్రిబాయి ఫూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ఫూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని కోరారు. సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు అంబేద్కర్, ఫూలేపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బీసీ సెల్ అండ్ మహాత్మా జ్యోతిబాఫూలే రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డా. జి.ఉపేందర్ మాట్లాడుతూ.. ఈ స్మారక ఉపన్యాసం సావిత్రీబాయి ఫూలే చేసిన త్యాగాలను అర్థం చేసుకోవడానికి యువతరానికి ప్రేరణనిస్తుందని, ఆమె త్యాగాలు ప్రతి మహిళా హృదయంలో నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ. జి.నరేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బేబీ నిమిష సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మైనారిటీస్ సెల్ డైరెక్టర్ డా. బి.హమీదా, ఎస్సీ/ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ. ఐ.డైసీ, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ డా. బి.రామ్ షెపర్డ్, డా. ఎస్.నర్సిములు, ప్రొ. శ్రీనివాస్, డా. బి.విజయ్ కుమార్, డా.కృష్ణంరాజు, డా. వంశీధర్, డా. పి.హిమబిందు, డా.ఆమంచి నాగేశ్వర్‌రావు, డా. సోమేశ్వర్, డా.నాగరాజు, డా.సమున్నత, డా. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెల్ టవర్‌తో స్థానికుల బెంబేలు

కాప్రా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు

సైనికపురి సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో ఘటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెల్ టవర్లతో చుట్టు పక్కల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టవర్ల ఏర్పాటుతో రేడియేషన్ వల్ల తరచూ మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. న్యూరోలాజికల్, మెదడు, డిమెన్షియా, సైకిక్ సమస్యలు ఉత్పన్నమ వుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా పరిధిలోని సైనిక్‌పురి సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో 21 ఏండ్ల కిందట నిర్మించిన బిల్డింగ్‌పై సెల్ టవర్ ఏర్పాటు చేశారు. టన్నుల కొద్ది బరువు ఉండే టవర్‌ను కూలడానికి సిద్ధంగా ఉన్న బిల్డింగ్‌పై ఏర్పాటు చేయడంతో భయాందోళనకు గురవుతున్నామని, అనుమతి లేకుండా టవర్‌ను ఏర్పాటు చేశారని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు, అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్‌బాబు, కాలనీవాసులు మనోహరరావు, డా.ఆశాదేవి, నిషా రాథోడ్, డా.అఖిల మిత్ర, సృజన, డా.సంఘమిత్ర తదితరులు కాప్రా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. అప్పటి ట్రాయ్ నిబంధనల ప్రకారం సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు చుట్టుపక్కల నివాసం ఉన్న నిర్వాసితుల అనుమతి తప్పనిసరి.. కానీ ఎలాంటి సర్టిఫికెట్ లేకుండా ఈ టవర్‌ను ఏర్పాటు చేశారని, కేవలం ఒక ప్రొవైడర్ కోసం అనుమతి తీసుకుని ఇప్పుడు మల్టీపుల్ సర్వీస్ ప్రొవైడర్స్‌గా అప్‌డేట్ చేయడంతో రేడియేషన్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఫిర్యాదు అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు అనుమతులు ఉన్నట్టు తెలిపారు.

రవీందర్‌రెడ్డి సేవలు వెలకట్టలేనివి

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వృత్తి జీవితంలో ఎంత నిబద్ధతతో పని చేశారో వ్యక్తిగత జీవితంలోనూ అంతే నిబద్ధతగా ఉంటూ కార్మికుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి రవిందర్‌రెడ్డి అని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తార్నాక ఆర్టీసీ ఆస్పత్రి సమావేశమందిరంలో ఆయన పదవి విరమణ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగం నుంచి రిటైర్డ్ కావడమనేది మనిషి జీవితంలో గొప్ప మలుపని పేర్కొన్నారు. ఆర్టీసీ అనే కాకుండా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు తాత్కాలిక పద్ధతిన ఉద్యోగులను నియమించుకుంటున్న తరుణంలో వారి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ రూ.700 కోట్ల లాభాల్లో ఉందని మంత్రి చెప్పడాన్ని ఆయన తప్పు పట్టారు. సంస్థ లాభాల్లో ఉంటే ఉద్యోగుల డీఏ, ఇతర బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పదవి విరమణ పొందినా కార్మికులకు, ప్రజలకు మరింతంగా సెవలందించాలని ఆకాంక్షించారు. రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ 1989లో ఆర్టీసీ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ తార్నాక ఆస్పత్రి సూపరిండెంట్ (పి)గా పదవి విరమణ పొందానని పేర్కొన్నారు. వృత్తిలో తన విధులను బాధ్యతగా నిర్వహిస్తూనే కార్మికుల హక్కుల కోసం పోరాడారని అన్నారు. ఎస్‌బీటీ ప్రయివేటీకరణను అడ్డుకుని కార్మికులకు న్యాయం చేశానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, డాక్టర్ రామకృష్ణ, పీవో.శ్రీనివాస్‌రావు, పారామెడికల్ సిబ్బంది యాదగిరి, మహేశ్, సత్యకం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

గుడిమల్కాపూర్‌లో ఘటన

నవతెలంగాణ- మెహదీపట్నం

హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. వివరాల్లోకెళ్తే.. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో రంజాన్ సందర్భంగా 'ఆనం మీర్జా' ఎక్స్‌పో జరుగుతోంది. ఎక్స్‌పోలో టాయ్స్ స్టాల్ ఫారుక్ అహ్మద్, అతని సోదరుడు సయ్యద్ హారున్ బొమ్మల షాపు నిర్వహిస్తున్నారు. వీరి పక్కనే దుబాయ్‌కి చెందిన తౌఫిక్ పెర్ఫ్యూమ్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఒక పెర్ఫ్యూమ్ ఉచితంగా ఇవ్వాలని ఫారుక్ అహ్మద్ అడగ్గా ఆందుకు తౌఫిక్ నిరాకరించాడు. దాంతో మాటా మాట పెరిగి ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. పెర్ఫ్యూమ్ అమ్మే వ్యక్తి ఈవెంట్ ఆర్గనైజర్ మీర్ హసీముద్దీన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బొమ్మల షాపు నిర్వహకులను పిలిచి హసీముద్దీన్ మందలించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరోసారి వారి మధ్య గొడవ జరగ్గా ఇంతలో ఆర్గనైజర్ తన వద్ద ఉన్న పిస్టల్ తీసుకుని గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. దాంతో ఎక్స్‌పోకు వచ్చిన సందర్శకులు భయాందోళనతో పరుగులు తీశారు.

స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురిని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పరిగి మాజీ సర్పంచ్‌గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ఈ గొడవతో సంబంధం లేకున్నా అదే పనిగా హసీముద్దీన్ కాల్పులు జరిపినట్టు చెప్పారు. హసీముద్దీన్‌కు నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గన్ లైసెన్స్ ఉందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో ఎక్స్‌పో ప్రాంతంలో భద్రత పెంచినట్టు వెల్లడించారు.

టెన్త్ పరీక్షల్లో 2,210 మంది విద్యార్థుల గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన సైన్స్ పార్ట్-2 (బయలాజికల్ సైన్స్) సబ్జెక్టు పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,97,712 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,96,442 (99.74 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 1,270 (0.26 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 7,157 మంది దరఖాస్తు చేశారనీ, 6,217 మంది పరీక్ష రాశారని తెలిపారు. 940 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు కలిపి 2,210 మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. రాష్ట్రంలో ఒక్క విద్యార్థిపై కూడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 30-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 88 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



పదేండ్లు నేనే ఉంటా

కొందరికి కుర్చీ పోయిన దు:ఖం ఉండొచ్చు

ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి
ముస్లింలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చిందే కాంగ్రెస్
అంబేద్కర్‌ను అవమానించేలా అమిత్‌షా వ్యాఖ్యలు :
కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు,
ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి 15లో


15లో

ప్రజావసరాలకే లింక్ రోడ్లు

విస్తరణతోపాటు కొత్తవి నిర్మించాలి :
హెచ్‌ఆర్‌డీసీఎల్ సమీక్షలో సీఎం రేవంత్

ప్రజలకు గవర్నర్, సీఎం

ఉగాది శుభాకాంక్షలు వివరాలు 15లో

హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదు

ఆరు గ్యారంటీలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి



స్థానిక సమస్యలపై పోరుబాట
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రనష్టం
ఇండ్ల నిర్మాణం చేపట్టకుంటే రామోజీ ఫిల్మ్‌సిటీని ముట్టడిస్తాం
ఫ్యూచర్ సిటీలో బలవంతంగా భూమి లాక్కుంటే ప్రతిఘటిస్తాం
సీసీఐ పరిశ్రమను వెంటనే తెరవాలి
అదానీకి కట్టబెట్టే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలి
సర్కార్ జోక్యంతోనే ఓయూ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ
హెచ్‌సీయూలో 400 ఎకరాల వేలం పాటను ఆపాలి
మనువాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెస్తాం :
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతితో కలిసి జాన్‌వెస్లీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు 11 రోజులే జరిగాయని చెప్పారు. బడ్జెట్ కేటాయింపులపై సమగ్ర చర్చ జరగకుండానే సమావేశాలు ముగిశాయన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని అన్నారు. వాటిని ఎలా అమలు చేస్తారో, నిధులను ఎలా కేటాయిస్తారో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదని వివరించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను కుదించారనీ, జీరో ...6లో


ఛత్తీస్‌గఢ్‌లో

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. వారిపై తూటాలతో వేట ఆగటం లేదు. భద్రతా దళాలు అడవులను జల్లెడ పట్టి.. మావోయిస్టులను మట్టుబెడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అడవుల్లో తుపాకుల మోతలే వినబడుతున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యమున్న ఈ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. భద్రతా బలగాలతో జరుగుతున్న ఎదురు కాల్పుల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవటం గమనార్హం. మావోయిస్టులకు పట్టున్న సుక్మా జిల్లాలోనూ తాజాగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. నలుగురు జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

మరోసారి పేలిన తూటా

ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు మృతి

ఇది నక్సలిజంపై మరో దెబ్బ : అమిత్ షా



రాయ్‌పూర్ : ఇటీవలి కాలంలో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా సుక్మా పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లాపాల్ ప్రాంతంలో వారు తారసపడ్డారనీ, ఈ సందర్భంగా ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డులు (డీఆర్‌జీ), కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయని ఆయన చెప్పారు. 'ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. నలుగురు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయి' అని అన్నారు.

మావోయిస్టుల ఏరివేతలో భద్రతా దళాలు సాధిస్తున్న విజయాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. "నక్సలిజంపై మరో దాడి జరిగింది. మన భద్రతా దళాలు మావోయిస్టులను మట్టు పెట్టాయి. సుక్మా ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ప్రధాని మోడీ నాయకత్వంలో 2026 మార్చి 31 లోగా నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మేము కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయుధాలు, హింసతో ఎలాంటి మార్పునూ తీసుకురాలేరనీ, కేవలం శాంతి, అభివృద్ధి మాత్రమే ...15లో

రెండ్రోజులు ఇదేమాదిరిగా ఎండలు

ఆ తర్వాత క్రమంగా 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుముఖం



పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం
2న ఈదురుగాలులతో కూడిన వర్షసూచన
పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. దానికితోడు ఉక్కపోత కూడా తీవ్రమైంది. ఫ్యాన్లు, కూలర్లు తిరుగుతున్నా వేడిగాలికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో పరిస్థితి ఇలాగే ఉండే అవకాశముంది. అయితే, ఆ తర్వాత క్రమంగా ...15లో

భూకంప మృతులు 1600 మందికి పైనే!

క్షతగాత్రులు మరో 3400 మంది
30 మంది ఆచూకీ లేదు : మయన్మార్ ప్రభుత్వం
మయన్మార్, బ్యాంకాక్‌లలో
కొనసాగుతున్న సహాయక చర్యలు
భారత్ సహా పలు దేశాల నుంచి సాయం
మరణించినవారిలో భారతీయులెవరూ లేరు : కేంద్రం



నెపిడా, బ్యాంకాక్ : మయన్మార్, థాయిలాండ్‌లలో శుక్రవారం సంభవించిన భూవిలయంలో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. మయన్మార్‌లో ఇప్పటివరకు 1600మందికి పైగా మరణించారని మయన్మార్ మిలటరీ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, 118మంది సిబ్బందితో ఆగ్రా నుంచి ఫీల్డ్ ఆస్పత్రిని మయన్మార్‌కు భారత్ పంపించింది. ఆయా ప్రాంతాల్లో మరణించిన వారిలో భారతీయులెవరూ లేరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. మయన్మార్‌లో మరో 3,400 మంది గాయపడ్డారనీ, 30మంది ఆచూకీ తెలియలేదని అక్కడి ప్రభుత్వం తెలిపింది. సమయం గడుస్తున్న కొద్దీ శిథిలాల నుంచి మృతదేహాలు బయటపడుతున్నాయనీ, సమాచారం సేకరిస్తున్నారనీ, ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని ప్రభుత్వం వివరించింది. మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధంతో అత్యవసర సర్వీసులు తీవ్రంగా బలహీనమయ్యాయి. దీంతో శక్తివంతమైన ఈ ప్రకృతి వైపరీత్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవటంలో ప్రభుత్వం పలు ఇబ్బందులు పడుతోంది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 10మంది మరణించారు. 26మంది గాయపడ్డారు. బ్యాంకాక్‌లోని చటుచక్ మార్కెట్‌కు సమీపంలో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిన ఘటనలో దాదాపు వందమంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారని తెలుస్తోంది. భారీ భూకంపంతో భవనాలు నేలమట్టమైన పరిస్థితుల్లో తమ వారి కోసం కేవలం ...6లో

మీ ఆఫీసులో సర్వర్లు ఎందుకు పెట్టుకున్నారు?

ఎంత మంది ఫోన్లను ట్యాపింగ్ చేశారు?

శ్రవణ్ రావును ఆరున్నర గంటలు విచారించిన స్పెషల్ టీం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎట్టకేలకు నిందితుడు, ఐ న్యూస్ సీఈవో శ్రవణ్ రావును జూబ్లీహిల్స్ స్పెషల్ టీం పోలీసులు శనివారం ఆరున్నర గంటలపాటు విచారించారు. ప్రధానంగా శ్రవణ్ రావుపై ఫోన్ ట్యాపింగ్ చేయడానికి గల కారణాలు, ఫోన్ ట్యాపింగ్ కోసం ఎంచుకున్న వ్యక్తులు, వీఐపీలు, దాని ద్వారా సాధించిన ఫలితాలపై దర్యాప్తు అధికారులు నిందితున్ని ప్రశ్నలతో నిగ్గదీసినట్టు తెలిసింది. అంతేగాక ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించిన సర్వర్‌ను తమ ఆఫీసులో శ్రవణ్ రావు పెట్టుకునేలా ఎవరు కోరారు? ఎవరి దిశానిర్దేశం మేరకు ఈ చట్ట వ్యతిరేక కార్యక్రమానికి పాల్పడ్డారో అనే ప్రశ్నలు కూడా అధికారులు సంధించారు. గత ఏడాది మార్చి 10న ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగు చూసి జూబ్లీహిల్స్ స్పెషల్ టీం అధికారులు, ...6లో

అందాల పోటీల పేరిట వ్యాపారం

మార్కెటింగ్ కోసం మహిళలే దొరికారా ?



శ్రమైక జీవనంలోనే అసలైన సౌందర్యం
పోరాటాలు, మట్టిమనుషుల కల్చర్‌లో అందాల పోటీలు పెట్టొద్దు
ప్రపంచ అందాల పోటీల వ్యతిరేక సదస్సులో ప్రొఫెసర్ జూపాక సుభద్ర
అందాల పోటీలతో స్త్రీల హక్కుల హరణ : మల్లు లక్ష్మి
మహిళలను వినిమయ వస్తువుగా చూడొద్దు : పీఓడబ్ల్యూ సంధ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అందాలపోటీల పేరిట వ్యాపారం, మార్కెటింగ్ చేసుకోవడానికి కార్పొరేట్లకు ఆడ మాంసమే దొరికిందా? అని ప్రొఫెసర్ జూపాక సుభద్ర ప్రశ్నించారు. మేకప్‌లు, రంగులు రుద్దుకుని తళుక్కున మెరిసేది అందం కాదనీ, శ్రమైక జీవనంలోనే అసలైన సౌందర్యం ఉందని నొక్కిచెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేకప్‌లు, రంగులు పూసుకుని షో చేసే 120 దేశాల అందెగత్తెలతో 10 నిమిషాల పాటు ఉపాధి పనులు చేయిస్తే.. తట్టెడు మన్ను ఎత్తించి కొంత దూరం నడిపిస్తే వారి అందమేంటో బయటపడుతుందన్నారు. అందాల పోటీల పేరిట పెండ్లికాకుండా 21 ఏండ్ల లోపు ఉన్న యువతులను నాలుగేండ్ల పాటు ఫారం కోళ్ల లెక్క పెంచి అంగాంగాలను ప్రదర్శించడం ...15లో

హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల జులుం



ప్రభుత్వ దిష్టిబొమ్మ తగలబెట్టకుండా అడ్డగింపు
స్పృహతప్పి పడిపోయిన విద్యార్థులు
అక్రమ వేలాన్ని ప్రశ్నించినందుకే దాడులు
దాడులను ఖండించాలని ప్రజాస్వామ్యవాదులకు
హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ పిలుపు 5లో

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి
ఎల్‌ఆర్‌ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు పెంచాలి :
విలేకర్ల సమావేశంలో జూలకంటి 7లో

అమెరికాలో విద్యాభ్యాసం చేసున్న వందలాది మంది అంతర్జాతీయ విద్యార్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ' స్వీయ బహిష్కరణ' వేటు వేస్తోంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ నుండి విద్యార్థులకు ఈ మెయిల్స్ వస్తున్నాయి. వారిలో కొందరు భారతీయ విద్యార్థులు కూడా ఉండే అవకాశం ఉందని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు తెలిపారు. 'మీ ఎఫ్-1 వీసాల (విద్యార్థి వీసాలు)ను రద్దు చేశాం.మిమ్మల్ని దేశం నుండి బహిష్కరించాం. కాబట్టి మీ అంతట మీరు దేశం విడిచి వెళ్లిపోండి' అంటూ ఆ ఈ మెయిల్ సందేశంలో బాంబు పేల్చారు. 300 మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేయడం జరిగిందని విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రకటించారు.

అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు

వీసాలు రద్దు చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం



క్యాంపస్ కార్యకలాపాల సాకుతో చర్యలు
సోషల్ మీడియా పోస్టుల పైనా నిఘా...
లైక్ కొట్టినా ఇంటికే

వాషింగ్టన్ : రాజకీయ, పర్యావరణ, ఆర్థిక, సామాజిక మార్పుల కోసం విద్యార్థులు తమ క్యాంపస్‌లలో కొన్ని కార్యక్రమాలు చేపడుతుంటారు. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు వంటి అంశాలపై ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తారు. వీటిని క్యాంపస్ యాక్టివిజం'గా వ్యవహరిస్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడడంతో పాటు సామాజిక మాధ్యమాలలో దేశ వ్యతిరేక పోస్టులు పెడుతున్నారన్న కారణంతో అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం 'స్వీయ బహిష్కరణ' వేటు వేస్తోంది. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను లైక్ చేసిన వారిపై కూడా బహిష్కరణ పిడుగు పడుతోంది.

మాకు ఆ హక్కుంది

హమాస్, ఇతర ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తున్న విద్యార్థులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవడానికి రుబియో ఇటీవలే 'క్యాచ్ అండ్ రివోక్' అనే కృత్రిమ మేధ ఆధారిత యాప్‌ను ...15లో

నవతెలంగాణ

గంధపు చెక్కలా సమాజ సేవలో అరిగిపోగాని,
ఇనుప ముక్కలా తుప్పుపట్టకు - మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ఆదివారం 30 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

ప్రాణాలతో 'యాపా'రం!



మహాభారత యుద్ధం ఎందుకు జరిగిందని మనకు మనమే ప్రశ్న వేసుకుని ఆలోచిస్తే, జూదంలో కోల్పోయిన రాజ్యాన్ని , ఆఖరికి భార్యను కూడా కోల్పోవడం, తిరిగి రాజ్యాన్ని పొందేందుకు కురుక్షేత్ర యుద్ధమే తప్పలేదు. అది భారత కథ. రాజుల నాటి కథ. రాజులు జూదం ఆడటం రివాజు ఆనాటికి. ఎప్పుడయినా జూదం ఆశతో, అత్యాశతో కూడుకుని దురాశగా పరిణామం చెందుతుంది. ఆఖరికి అందరినీ ముంచుతుంది. జూదమూ ఓ రకమైన పందెమే! బానిస సమాజంలోనైతే పందెం కాసి, ఇద్దరు బానిసలను బల ప్రయోగానికి, చంపుకోవడానికి పురికొల్పేవారు. పందాల్లో చంపడం, చావడం ఖాయంగా ఉండింది. ఇప్పటి కోడి పందేలలాంటిదన్నమాట. ఇదొక భూస్వామిక విధానపు క్రూరవినోదం. ప్రజలు దీనికి సమిధలు, ప్రజాధనం దీనికి సమర్పణం. ఇప్పుడిక ఆధునిక వ్యాపార సమాజంలో లాభాల ఆశల ఎరకు చిక్కి బలైపోతున్న సామాన్య ప్రజల దీనగాథలు కోకొల్లలు. ఈ దోపిడీ వ్యవస్థలో కునారిల్లిపోతున్న, దారిద్ర్యం ముంచెత్తుతున్న సామాన్య ప్రజల ఆశలను, ఆవేశాలను వినియోగించుకుని మరింత దోపిడీకి పాల్పడుతున్న పాచికే ఈ పందెం, బెట్టింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ మొదలైన సాధనాలు. ప్రపంచీకరణ, రియలెస్టేటు బూమ్‌లు సమాజంలో 'ఈజీమని'ని పరిచయం చేశాయి. ఆ భ్రమలో పడి అనేకమంది తమ జీవితాలను, సంసారాలను, కుటుంబాలను ధ్వంసం చేసుకుంటున్నారు.

> **2017లో ప్రమోట్ యాడ్‌లో పాల్గొన్నానని, తర్వాత అది మోసమని తెలిసి రద్దు చేసుకున్నానని ప్రకాశ్‌రాజ్ ప్రకటించాడు. మిగతా ఎవరూ ఇంకా స్పందించలేదు. కొందరు మాత్రం తెలియక చేశామంటున్నారు. ప్రభుత్వం కూడా అసెంబ్లీలో ప్రకటన చేసింది. ఈ బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రచారం కల్పించేవారినీ విచారిస్తామని తెలిపింది. ఇటీవలే మొదలైన ఐపిఎల్ క్రికెట్‌పైన కూడా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. లక్షల రూపాయలు కోల్పోయిన ఓ యువకుడు మొన్న ఆత్మహత్య చేసుకున్నాడు.**

ఇప్పుడీ డిజిటల్ యుగంలో బెట్టింగ్‌యాప్‌ల రూపంలో సైబర్ దోపిడీకి తెరలేపారు నయాజూదగాళ్లు. వేల కోట్ల రూపాయల్ని సామాన్యుల నుండి కొల్లగొట్టే సంస్థలు వేలకొలది పుట్టుకొచ్చాయి. మన రాష్ట్రంలోనే వందలమంది ప్రాణాలను ఈ బెట్టింగ్ యాప్‌లు బలితీసుకున్నాయి. భర్తలకు తెలియకుండా భార్యలు, భార్యలకు తెలియకుండా భర్తలు ఈ ఆటలకు బానిసలై కుటుంబాలనే హతమార్చుకున్నారు. డబ్బులు ఎక్కువొస్తాయని ఆశ పడుతున్న వాళ్లకు అత్యాశను కల్పిస్తూ, వారి కండ్లముందే గొప్ప కథనాలను వినిపించి, మెస్మరిజానికి గురిచేస్తూ లక్షాధికారులు కోటీశ్వరులు అయిపోయినట్లుగా భ్రమాత్మక ఊహలోకి తీసుకు వెళతారు. మొదట చిన్నచిన్నగా లాభాల ఎర చూపిస్తారు. ఆ తర్వాత పెద్ద బెట్టింగులకు పూనుకోగానే ముంచి ఊరుకుంటారు. యాప్‌లే కాదు, సోషల్ మీడియాలో స్పాన్సర్స్ ప్రకటనలు విపరీతంగా ప్రసారం అవుతున్నాయి. రాష్ట్రపతి ముర్ము, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సుధ, ముఖేష్ అంబానీలాంటి ప్రముఖులు చెబుతున్నట్టుగానే వీడియోలు ఫేక్‌వి వచ్చాయి. రూ.21వేలు ఇన్వెస్ట్‌చేస్తే నెల, రెండునెలల్లోనే పదిహేను లక్షలు సంపాదించవచ్చని దాని సారం. 'డబ్బులెవరికీ ఊరకనే రావు' అన ప్రకటన తప్పక గుర్తుకు రావాల్సిన అవసరం ఉంది. వీటిని అరికట్టడం ఎలాగో ప్రభుత్వం ఆలోచించాలి.

ఈ బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్లలో దేశంలోని ప్రముఖులతో పాటు సినీతారలు, ఆటగాళ్లూ పాల్గొంటున్నారు. భారతరత్న సచిన్ టెండూల్కర్, షారుఖ్‌ఖాన్, కోహ్లీలపైనా యాప్‌లు ప్రమోషన్ చేశారని ఫిర్యాదు చేశారు. మన తెలుగు సినీ తారలు బాలకృష్ణ, ప్రభాస్, గోపిచంద్, రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, శ్యామల, విష్ణుప్రియ ఇలా ఎన్నో పేర్లు బయటకి వచ్చాయి. ఫన్-88 యాప్ ద్వారా కోట్లాది రూపాయలు తరలించుకుపోయారని ఆరోపణలొచ్చాయి. ఈ మధ్య హైదరాబాద్ పోలీసులు సైబర్‌క్రైం విభాగం ఈ బెట్టింగ్ యాప్‌లపై తీవ్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఇప్పటిదాకా 385 కేసులు పెట్టారు. ప్రమోటర్లను ప్రశ్నిస్తున్నారు. ఇంతెందుకు మన మెట్రోరైల్లోనే ఈ బెట్టింగ్ యాడ్స్ పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. 2017లో ప్రమోట్ యాడ్‌లో పాల్గొన్నానని, తర్వాత అది మోసమని తెలిసి రద్దు చేసుకున్నానని ప్రకాశ్‌రాజ్ ప్రకటించాడు. మిగతా ఎవరూ ఇంకా స్పందించలేదు. కొందరు మాత్రం తెలియక చేశామంటున్నారు. ప్రభుత్వం కూడా అసెంబ్లీలో ప్రకటన చేసింది. ఈ బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రచారం కల్పించేవారినీ విచారిస్తామని తెలిపింది. ఇటీవలే మొదలైన ఐపిఎల్ క్రికెట్‌పైన కూడా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. లక్షల రూపాయలు కోల్పోయిన ఓ యువకుడు మొన్న ఆత్మహత్య చేసుకున్నాడు. తక్కువ సమయంలోనే భారీ లాభాలిస్తామని డెయిరీఫామ్ నిర్వహిస్తున్నామని రూ.20కోట్లతో బిచాణా ఎత్తేసింది ఓ ఫేక్ సంస్థ. మల్టీ లెవల్ మార్కెటింగ్‌లో భాగంగా మొదట కొందరి పెట్టుబడులకు లాభాలందిస్తూ క్రమంగా అందరినీ మోసానికి గురిచేస్తున్నారు. ఈ ఆర్థిక సైబర్ నేరగాండ్ల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. డబ్బులపై ప్రజలకున్న ఆశను, ఆసరా చేసుకుని ఇలాంటి మోసాలకు పాల్పడటం ఈ మధ్యకాలంలో పెరిగింది. వీటికి తారలూ, ప్రముఖులు ప్రచారం చేయడం వల్ల ప్రజలింకా నమ్మకం పెంచుకుంటున్నారు. వీటి ఉచ్చులో పడకుండా ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి.

ముందుకు దారి చూపనున్న 24వ పార్టీ మహాసభలు




ప్రకాశ్ కరత్

మధురైలో ఏప్రిల్ 2-6 తేదీల మధ్య సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు జరుగనున్నాయి. డోనాల్డ్ ట్రంప్ అమెరికా పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అంతర్జాతీయంగా తీవ్ర మార్పులు వస్తున్నాయి. భారతదేశంలో బీజేపీ పాలన హిందూత్వ కార్పొరేట్ నియంతృత్వానికి దారులు పరుస్తున్నది. ఆ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, ఇతర కష్టజీవులు సమైక్యంగా ప్రతిఘటనకు పూనుకుంటున్నారు.

గత రెండు నెలల కాలంలోనే ట్రంప్ ప్రభుత్వం అల్లకల్లోల పరిస్థితులను సృష్టించింది. ఇవి గత ముప్పయ్యేళ్లలో ఎప్పుడూ లేవు. "అమెరికాని మళ్లీ గొప్పగా చేద్దాం", "అమెరికా ఫస్ట్" వంటి నినాదాల ద్వారా తన సామ్రాజ్య ప్రతిష్టను పెంచుకోవాలనే పనిలో ఆ దేశముంది. ఇది నాటోలోని దేశాలతోపాటు, ఇతర ఐరోపాలోని మిత్ర దేశాలపైనా ప్రభావం చూపుతోంది; దక్షిణాఫ్రికా వంటి దక్షిణ భూమండల దేశాలతో శత్రుత్వం పెంచేందుకు, ఉదాహరణకు పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు సహకరించేందుకు దారితీస్తుంది.

ఈ ట్రంప్ పాలనా కాలంలో ఇప్పటివరకు నిశ్శబ్దం (మ్యూట్ చేయబడిన)గా ఉన్న సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉండే వైరుధ్యంతో సహా అన్ని సామాజిక వైరుధ్యాలూ తీవ్ర స్థాయిలో ముందుకు వస్తాయి. ఈ అంతర్జాతీయ పరిస్థితిపై పార్టీ మహాసభ తన విశ్లేషణను తాజాపరుచుకుంటుంది.



భారతదేశంపై టారిఫ్‌లు విధిస్తానని, వీసాల రద్దుపై ట్రంప్ ప్రకటనలను పట్టించుకోకుండా దాని అడుగులకు మడుగులొత్తడానికి మోడీ సర్కార్ ప్రవర్తిస్తున్నది. ఈ ప్రభుత్వం ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి నిరోధ శక్తుల్లో ఒకటిగా ఉంది. ఈ పదకొండేండ్ల మోడీ పాలన అత్యంత అభివృద్ధి నిరోధక, మతోన్మాద, నియంతృత్వ శక్తులు నయాఫాసిస్టు లక్షణాలతో సంఘటితపడేందుకు దారితీసింది. మోడీ పాలన హిందూత్వ శక్తులు బడా కార్పొరేట్లతో చెట్టపట్టాలేసుకున్నారు. ఈ విశ్లేషణపై ఆధారపడిన రాజకీయ ఎత్తుగడల పంథా హిందూత్వ కార్పొరేట్ శక్తులపై పోరాటమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుంటుంది.

రాజకీయ పంథా

24వ మహాసభ రాజకీయ తీర్మాన చిత్తుప్రతిలో కింది విధంగా ఉంది.

2.86 : బీజేపీని, హిందుత్వ శక్తులను ప్రజల నుండి వేరు చేసి ఓడించాలంటే వాటిపై నిరంతర పోరాటం అవసరం. పార్టీ ఈ హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా అన్నిరకాల లౌకిక శక్తులను ఒకతాటిపైకి తెచ్చే విశాల ఐక్యవేదికను నిర్మాణం చేయాలి.

2.87 : హిందూత్వ నయా ఉదారవాద శక్తులపై మన పోరాటం సీపీఐ(ఎం) యొక్క, ఇతర వామపక్షాల స్వతంత్ర శక్తి పెరుగుదలపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అంతర్భాగం చేయాలి.

2.88 : కార్పొరేట్ల అనుకూల, నయా ఉదారవాద విధానాలు ప్రజల జీవన పరిస్థితుల్ని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. శ్రమజీవులు తీవ్ర దోపిడీకి గురౌతున్నారు. ఇవన్నీ మోడీ ప్రభుత్వం మరియు బీజేపీ విధానాల ఫలితమే. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని, ప్రయివేటీకరణ పేరుతో జాతి సంపదను దోచుకునే ప్రయత్నాల ప్రతిఘటనలో మన పార్టీ శ్రేణులు ముందు పీఠిన ఉండాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో 'ఇండియా' బ్లాక్ వంటి సెక్యులర్ ప్రతిపక్షపార్టీల కూటమి కొనసాగేలా చూడాలి.

పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచండి

గత 23వ మహాసభలో ఆమోదించుకున్న రాజకీయ ఎత్తుగల మీద ఆధారపడి నేడు రాజకీయ సమీక్ష, నివేదికను కేంద్ర కమిటీ సిద్ధం చేసింది. ఆ నివేదిక పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడాన్ని నేటి దశలో అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశంగా గుర్తించింది. జరుగనున్న పార్టీ మహాసభ దీన్నే కీలక అంశంగా చర్చించబోతుంది. ఎందుకంటే పార్టీ స్వతంత్ర పెరగకపోతే బీజేపీ, ఆరెస్సెస్‌లను శక్తివంతంగా ఎదుర్కోలేము.

పార్టీ బలాన్ని పెంచుకోవటం అంటే పునాది వర్గాల్లో మన కృషి పెరటమే. గ్రామీణ ప్రాంతాల్లోని ధనికుల ముఠా గ్రామీణ పేదలపై సాగిస్తున్న దోపిడీని చైతన్యవంతంగా ఎదుర్కోవాలి. సంఘటిత రంగంలోని కార్మికుల్లో మరీ ముఖ్యంగా వ్యూహాత్మకమైన తయారీ రంగంలోని కార్మికుల్లోను, సంఘటిత రంగంలో కాంట్రాక్టు కార్మికుల్లోను పార్టీ తన ప్రభావాన్ని పెంచుకోవాలి.

పార్టీ రాజకీయ వేదిక నుండి స్వతంత్ర క్యాంపెయిన్‌లు చేపట్టాలి. రాజకీయ అవగాహనలు, మైత్రి పేరున మన స్వతంత్ర పోరాటాన్ని మకిల పరచరాదు. ఆరెస్సెస్, హిందూత్వ శక్తుల కార్యకలాపాల్ని ఎదుర్కోవటానికి మన స్వతంత్ర సైద్ధాంతిక ప్రచారాన్ని కొనసాగించాలి.స్థానిక సమస్యల మీద నిరంతర పోరాటాలు చేయడంపై నొక్కి చెప్పాలి.

కుల అణచివేత, లింగ వివక్ష వంటి అంశాలపై నేరుగా పార్టీగానే పోరాటాలు చేయాలి. సామాజిక అణచివేతలపై జరిగే పోరాటాలను వర్గ దోపిడీపై జరిగే పోరాటాలతో అనుసంధానం చేయాలి. యువతను పెద్ద సంఖ్యలో పార్టీ వైపు ఆకర్షించాలి. దీనికి యువతకు సంబంధించిన కీలక డిమాండ్లను రూపొందించాలి.

పోరాటాలు, ప్రతిఘటనలు

2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో బీజేపీ మెజారిటీ కోల్పోయి, లౌకిక ప్రజాస్వామ్య ప్రతిపక్షానికి పాక్షిక విజయం కలిగినప్పటికీ, మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన హిందూత్వ కార్పొరేట్ ఎజెండా అమలు చేయ టంలో ఏమాత్రం సడలింపును కనబరచటం లేదు. మోడీ ప్రభుత్వం ఆర్థిక, హిందూత్వ అనుకూల విధానాలను బలంగా, విస్తృతంగా ప్రతిఘటించటానికి ఉన్న ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తున్నది.

23వ పార్టీ కాంగ్రెస్ కాలం నుంచి కార్మికవర్గం, రైతాంగం, మహిళా, యువజన, విద్యార్థి పోరాటాలు, ఐక్య ఆందోళనలు చూస్తున్నాము. బహుళ జాతి కంపెనీకి వ్యతిరేకంగా తమిళనాడు, కాంచీపురంలో 38 రోజుల పాటు శాంసంగ్ కార్మికులు చేసిన విజయ వంతమైన పోరాటం దీనికి గొప్ప ఉదాహరణ. విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నడుస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో స్కీం కార్మికుల పోరాటాలు అసంఖ్యాకంగా జరిగాయి, వాటిలో అనేక పోరాటాలు కొన్ని విజయాలను సాధించాయి. ఉపాధి హామీ వేతనాలు, భూమి, ఇళ్లపట్టాల వంటి సమస్యలపై వివిధ ప్రాంతాల్లో పోరాటాలు జరిగాయి.

చట్టబద్ధమైన కనీస గిట్టుబాటు ధర, ఇతర డిమాండ్లపై రైతు సంఘాల ఐక్య వేదిక- ఎస్‌కెఎమ్- తన పోరాటాన్ని కొనసాగిస్తున్నది. మైనింగ్ ప్రాజెక్టుల కారణంగా నివాసిత ప్రాంతాలను వదిలివెళ్లటానికి వ్యతిరేకంగా ఆదివాసీలు, రైతులు పోరాటాలు చేస్తున్నారు. ఆహారభద్రత, మహిళలపై నేరాలు, జాతీయ విద్యావిధానం, నిరుద్యోగంలాంటి సమస్యలపై మహిళలు, విద్యార్థులు, యువజనులు పోరాడుతున్నారు.

రానున్న రోజుల్లో, నూతన ఆర్థిక విధానాల ప్రతిఘటనకు విస్తృతమైన తీవ్రమైన ప్రతిఘటన పోరాటాలు చేయాలి. ప్రభుత్వం రుద్దిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను నిరసిస్తూ మే 20న ఒకరోజు సార్వత్రిక సమ్మె చేయడానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

రాజకీయంగా వారిని తయారు చేయటంలో పార్టీ యూనిట్లు శ్రద్ధ చూపాలి. పోరాటాలనుంచి పెద్దసంఖ్యలో సమరశీల, కార్యకర్తలకు రాజకీయ విద్య గరిపి పార్టీలోకి తీసుకున్నప్పుడే పార్టీ బలం సొంతంగా పెరగగలదు.

> **పార్టీ 23వ మహాసభ కొన్ని సంస్థాగత కర్తవ్యాలను నిర్ణయించింది. పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరచడం, పార్టీకి మొదటి మెట్టయిన శాఖను చురుకుగా పని చేయించడం, శాఖ - వర్గ, ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాలకు నాయకత్వం వహించే లాగా ప్రజాపంథాను ఆమోదింపచేయటం. హిందూత్వ సిద్ధాంతానికి, దాని కార్యకలాపాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పని నిర్వహించటం గురించి నొక్కిచెప్పింది. ఈ కర్తవ్యాలపై జరిగిన పనిని సంస్థాగత నివేదికలో సమీక్షించింది. ఈ పనిలో అభివృద్ధి, లోటుపాట్లను గురించి పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఆత్మ విమర్శనాత్మకంగా పరిశీలించింది. ఇది పార్టీ సమర్థవంతంగా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించడానికి, పోరాటాలు ఉద్యమాలు అభివృద్ధి చేయడానికి, సైద్ధాంతిక పోరాటం నడపటానికి ఉపయోగపడుతుంది.**

ట్రంప్ అధ్యక్షత కింద దాని దుష్ట పన్నాగాలకు మోడీ వంత పాడటానికి ఇష్ట పడుతున్నది. ఆ కారణంగా దేశంలో సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయడం, మోడీ ప్రభుత్వం అమెరికా అనుకూల విధానాలను వ్యతిరేకించడం అవసరంగా ఉన్నది. ఈ కర్తవ్యాన్ని సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు మాత్రమే నిర్వర్తించగలవు.

కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వం

"నవ కేరళ" నిర్మాణంలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయటానికి చేస్తున్న కృషి చెప్పుకోదగినది. ప్రయత్నం అంతా కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న శత్రు పూరిత వివక్ష వైఖరిని ఎదురుకుంటూ జరుగుతున్నది. కేరళ సీపీఐ(ఎం) లౌకిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం మద్దతుకు నిరంతరం ప్రజలను సమీకరిస్తూ ఉన్నది. దేశంలోని ప్రజాస్వామ్య శక్తులన్నిటిని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి మద్దతుగా సమీకరించాలి.

శక్తివంతమైన పార్టీని నిర్మిద్దాం


పార్టీ నిర్ణయించిన రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ మహాసభ చర్చించి, పార్టీని సరిదిద్దడానికి, విస్తృతం చేయడానికి అవసరమైన చర్యలను నిర్ణయిస్తుంది.

పార్టీ 23వ మహాసభ కొన్ని సంస్థాగత కర్తవ్యాలను నిర్ణయించింది. పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరచడం, పార్టీకి మొదటి మెట్టయిన శాఖను చురుకుగా పని చేయించడం, శాఖ - వర్గ, ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాలకు నాయకత్వం వహించే లాగా ప్రజాపంథాను ఆమోదింపచేయటం. హిందూత్వ సిద్ధాంతానికి, దాని కార్యకలాపాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పని నిర్వహించటం గురించి నొక్కిచెప్పింది. ఈ కర్తవ్యాలపై జరిగిన పనిని సంస్థాగత నివేదికలో సమీక్షించింది. ఈ పనిలో అభివృద్ధి, లోటుపాట్లను గురించి పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఆత్మ విమర్శనాత్మకంగా పరిశీలించింది. ఇది పార్టీ సమర్థవంతంగా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించడానికి, పోరాటాలు ఉద్యమాలు అభివృద్ధి చేయడానికి, సైద్ధాంతిక పోరాటం నడపటానికి ఉపయోగపడుతుంది. వామపక్ష శక్తుల మధ్య మరింత ఐక్యత పెంచుకోవడంలోను, ఒక వామపక్ష ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా, వాటితో పాటే సీపీఐ(ఎం) బలం కూడా పెరుగుతోంది. అన్ని వర్గాల, తరగతుల శ్రామిక ప్రజలను, వారి ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలను కూడగట్టడంలో వామపక్ష, ప్రజాస్వామ్య వేదిక ఓపికతో నిర్మించాలి.

24వ మహాసభ అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ప్రతిఘాత చీకటి శక్తులను తిప్పికొట్టడానికి, ప్రత్యామ్నాయ అభివృద్ధికై లౌకిక, ప్రజాస్వామ్య అభ్యుదయ మార్గానికి పిలుపునిచ్చే వేదికగా తయారుకావాలి.

(స్వేచ్ఛానువాదం)

కాలిపోయింది నోట్లకట్టలా? న్యాయమా?



సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్య తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బీజేపీ హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయటపడ్డారు. సిజెఐగా ఉండగానే జస్టిస్ రంజన్‌గోగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజుల్లోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు, కాషాయ నేతలూ న్యాయవ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొవలసి ఉంటుంది.



తెలకపల్లి రవి

ఢిల్లీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కట్టలకొద్ది కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయనే కథనాలు దేశంలో సంచలనం కలిగించాయి. న్యాయవ్యవస్థలో అవినీతి పెరిగిపోతుందనే అభిప్రా యాలు అనేకసార్లు వ్యక్తమవుతున్నా, కొన్ని ఉదాహరణలు కనిపిస్తున్నా కోర్టు ధిక్కారం గురించిన సంకోచాలు, వ్యవస్థపై గౌరవం కారణంగా ఒక పరిధికి మించి అది చర్చకు రాలేదు. కానీ ఇప్పుడు మీడియాలో ఒక్కసారిగా ఈ ఉదంతం బయటకు రావడం, దానిపై నేరుగా భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ సంజీవ్‌ఖన్నా జోక్యం చేసుకుని ముగ్గురు హైకోర్టు సిజెలతో కమిటీని నియ మించి విచారణ ప్రక్రియ ప్రారంభించడం, తగలబడినట్టు చెప్పబడే నోట్ల కట్టలను అత్యున్నత న్యాయస్థానమే పోస్టు చేయడం, ఇవన్నీ సంచలనం కలిగించాయి. ఈ తరహా ఘటనలు గతంలో ఎప్పుడూ జరిగి ఉండలేదన్నది వాస్తవం. ఇది న్యాయవ్యవస్థలో, నివేదించే మీడియాలో, పార్లమెంటులో, రాజకీయ వర్గాల్లో అన్ని విధాలా చర్చ నీయమైంది. ఎప్పుడూ న్యాయవ్యవస్థపై వ్యాఖ్యల్లో ముందుండే రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ దీనిపైనా తీవ్రంగా స్పందించడమే గాక అన్ని పార్టీలతో చర్చించే బాధ్యత బీజేపీ అధ్యక్షుడైన కేంద్రమంత్రి జెపి నడ్డాకు అప్పగించారు. అయితే గమనించాల్సినదేమంటే ఇప్పటికీ ఈ విషయమై న్యాయవ్యవస్థ అంతర్గత పరిధిలో విచారణ ప్రక్రియ తప్ప మరే దర్యాప్తు మొదలు కాలేదు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని కోరుతూ మాథ్యూ జె.నెడుంపర అనే సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఓకా ధర్మాసనం కొట్టివేసింది. విచారణ గురించిన వివరాలు తెలియరాకుండా దీన్ని చేపట్టడం తొందరపాటే అవుతుందని వ్యాఖ్యానించింది. అదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక మీడియా సదస్సులో పాల్గొంటూ సిజెఐ అనుమతి లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రశ్న ఉత్పన్నం కాదని ప్రకటించారు.మరోవైపున సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు కేంద్రం జస్టిస్ వర్మను ఆయన మాతృస్థానమైన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది.కానీ వర్మకు న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని అంతకుముందు ఢిల్లీ హైకోర్టు సిజెను, ఇప్పుడు అలహాబాద్ హైకోర్టు సిజెను కూడా ఆదేశించారు. సంచలన వార్తలు వచ్చాక అత్యున్నత జోక్యం తర్వాత కూడా జరుగుతున్న దేమిటనేది గానీ, ఏం చేయబోతున్నారనేది గాని స్పష్టత లేని పరిస్థితి ఏర్పడింది.

తప్పులకు రక్షణలు

జస్టిస్ వర్మ ఉదంతంలో కోర్టుల మల్లగుల్లాలు ఒకటైతే, పాలక బీజేపీ స్పందనలు మరో కోణంలో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఎందుకంటే గతంలోనూ కొన్ని అవినీతి ఆరోపణలూ, తీవ్ర వివాదాలు వచ్చిన ఉదా హరణలు ఉన్నాయి. కానీ నేరుగా చర్య తీసుకున్న సందర్భాలు దాదాపు లేవు. ఎందుకంటే పైకి ఏమి చెప్పినా పాలకవర్గాలు ఎప్పుడూ న్యాయవ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికే పాకులాడతాయి. 'చట్టం వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది గానీ, వ్యవస్థ చట్టంపై ఆధారపడి ఉండదని' కారల్ మార్క్స్ చెప్పిన మాట ఎప్పుడూ మర్చిపోకూడదు. దీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ హయాంలో ఒక విధంగా న్యాయవ్యవస్థ ఒత్తిడికి గురైతే బీజేపీ హయాంలో అది మరింత బాహాటంగా కళ్లకు కడుతున్నది. నిబద్ధ న్యాయ వ్యవస్థ(కమిటెడ్ జ్యుడిషియరీ) ఉండాలనేది ఇందిరాగాంధీ తరచూ చెప్పినమాట. ఆఖరుకు ఆమె ప్రకటించిన ఎమర్జెన్సీ రాజ్యానికి కూడా అప్పటి సుప్రీంకోర్టు ఆమోద ముద్రవేసింది. ఎప్పుడూ ఆ విషయాన్ని వల్లించే బీజేపీ హయాంలో ఇది మరింత దారుణంగా తయారైంది. పీవీ నరసింహారావు హయాంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిని అభిశంసించేందుకు పార్లమెంటు చర్యలు తీసుకున్నా నాటి ప్రభుత్వం బయటపడేసింది. సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్య తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బీజేపీ హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయట పడ్డారు. సిజెఐగా ఉండగానే జస్టిస్ రంజన్‌గోగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజుల్లోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు, కాషాయ నేతలూ న్యాయవ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొవలసి ఉంటుంది.

కేంద్రానికి తాళాలివ్వాలా?

వివిధ పాలక పార్టీల ప్రభుత్వాధినేతలూ ఆయా సమయాల్లో తమ అనుకూలతను బట్టి న్యాయవ్యవస్థ క్రియాశీలతపైన ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు లేదా కొనియాడుతుంటారు. న్యాయమూర్తులు కూడా పరిపరివిధాలా స్పందిస్తుంటారు. నీతివంతమైన న్యాయమూర్తులు అనేకమంది ప్రజాస్వామిక స్ఫూర్తి, విశ్వసనీయత, ప్రజల పట్ల నిబద్ధత కోసం కృషి చేస్తుంటారు కూడా. అయితే పాలకవర్గ వ్యవస్థ తన వ్యూహాలకు అనుగుణంగానే అడుగులు వేస్తుంటుంది. ఇదే రాజ్యాంగ మౌలిక స్వభావం గురించిన ప్రస్తావన వచ్చినపుడు ఇదే ధంకర్ కోర్టులపై దాడి చేయడం చూశాం. ఎప్పుడు ఎలాంటి వివాదం వచ్చినా న్యాయమూర్తుల నియామకం కేంద్రం చేతుల్లోకి తీసుకోవడమే పరిష్కారమన్నట్టు మాట్లాడేవారిని చూస్తుంటాం. చూడటమే కాదు, నిజంగానే న్యాయమూర్తుల నియామకం జాప్యం చేస్తూ ముప్పుతిప్పలు పెట్టడం వాస్తవం. ఈవిషయంలో సుప్రీంకోర్టు మాజీ సిజెఐ డివై చంద్రచూడ్ ధర్మాసనం గత సెప్టెంబరులో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు కోర్టు ఆగ్రహాన్ని వెల్లడించాయి. సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను పక్కన పెట్టడానికి కారణం ఏమిటని ఆయన కేంద్రాన్ని నిలదీసింది. ఎడతెగని ఆలస్యం చేసి గుండుగుత్తగా వెనక్కు పంపితే ఏమని అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టుకు జస్టిస్ సురేష్ కుమార్, పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టుకు జస్టిస్ శాంతాబాయి అను, జమ్మూ కాశ్మీర్ అండ్ లడక్ హైకోర్టుకు జస్టిస్ దర్శి రాబిన్‌సన్‌ను పంపించాలంటూ చేసిన సిఫార్సులను వెనక్కు తీసుకోవడానికి కూడా న్యాయస్థానం సిద్ధపడింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జాన్ సత్యంను సుప్రీంకోర్టు కొలీజియం 2022 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది, 2023 జనవరిలో పునరుద్ఘాటించింది అయినప్పటికీ ఇవి జరగలేదు. జార్ఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ సారంగి పేరును ఆలస్యంగా ఖరారు చేయడంవల్ల ఆయన పదిహేను రోజులు మాత్రమే సిజెగా పనిచేసి దిగిపోవాల్సి వచ్చింది! 2024 ప్రారంభంలో కొలీజియం పిఎం మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయన్ను ప్రభుత్వ న్యాయవాదిగా నియ మించిందనీ కేంద్రం ఆ సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనే వాదన అస్పష్ట మైందని, లంకేశ్ చంద్రగౌరి బీజేపీలో ఆఫీసుబేరర్‌గా ఉన్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియ మించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తు చేసింది. న్యాయవ్యవస్థలో సంఘ పరివార్ పట్టు పెరిగిపోవడం, న్యాయమూర్తులు నిబంధనలను ఉల్లంఘించేలా వ్యాఖ్యలు చేయడం కూడా చాలాసార్లు చూశాం. కనుక న్యాయ మూర్తుల నియామక అధికారం కేంద్రానికి అప్పగించడమే పరిష్కారమన్న వాదనలోనూ వాస్తవికత లేదు.న్యాయ విషయాలన్నిటిపైనా ఒక కమిషన్ ఆధ్వర్యం వహించాలన్న మౌలిక ప్రతిపాదనను కేవలం న్యాయ మూర్తుల నియామకాలకు పరిమితం చేస్తూ ఎన్‌జాక్ (నేషనల్ కమిషన్ ఫర్ జుడిషియల్ అపాయింట్ మెంట్స్) మోడీసర్కారు తీసుకొచ్చిన బిల్లును సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయవ్యవస్థ స్వతంత్ర తనూ, ప్రజాస్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం,

> **న్యాయమూర్తుల్లో యాభైశాతం మంది అవినీతిపరులున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖట్జూ ఒకసారి వ్యాఖ్యానించారు. దానికి ఆయన విచారణకు కూడా హాజరయ్యారు. ఇదే అలహాబాదు హైకోర్టు నుంచి వచ్చిన ఖట్జూ అవినీతిపరుల జాబితా ఒకటి అప్పటి సిజెఐ లహోటీకి ఇచ్చానని కూడా చెప్పారు.వారి అవినీతిని తాను వెల్లడిస్తానంటే సిజెఐ వద్దని వారించారని ఖట్జూ పేర్కొన్నారు.తాజాగా ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా తీర్పులు చెప్పినట్టు ఆరోపణలకు గురైన ఒక న్యాయమూర్తిపై లోక్‌పాల్ విచారణకు ఆదేశాలిస్తే నిబంధనలు ఒప్పుకోవంటూ సుప్రీంకోర్టు అడ్డుపడింది. ఇక్కడ లోక్‌పాల్‌గా ఉన్నది కూడా సుప్రీం మాజీ జడ్జి ఖాన్విల్కర్ కావడం గమనించదగింది. కనుక జస్టిస్ శర్మపై ఆరోపణలు గానీ, వాటిపై విచారణ ప్రహసనం గానీ ఆశ్చర్యం కలిగించదు.**

కింకర్తవ్యం?

న్యాయమూర్తులలో యాభైశాతం మంది అవినీతిపరులున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖట్జూ ఒకసారి వ్యాఖ్యానించారు. దానికి ఆయన విచారణకు కూడా హాజరయ్యారు. ఇదే అలహాబాదు హైకోర్టు నుంచి వచ్చిన ఖట్జూ అవినీతిపరుల జాబితా ఒకటి అప్పటి సిజెఐ లహోటీకి ఇచ్చానని కూడా చెప్పారు.వారి అవినీతిని తాను వెల్లడిస్తానంటే సిజెఐ వద్దని వారించారని ఖట్జూ పేర్కొన్నారు.తాజాగా ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా తీర్పులు చెప్పినట్టు ఆరోపణలకు గురైన ఒక న్యాయమూర్తిపై లోక్‌పాల్ విచారణకు ఆదేశాలిస్తే నిబంధనలు ఒప్పుకోవంటూ సుప్రీంకోర్టు అడ్డుపడింది. ఇక్కడ లోక్‌పాల్‌గా ఉన్నది కూడా సుప్రీం మాజీ జడ్జి ఖాన్విల్కర్ కావడం గమనించదగింది. కనుక జస్టిస్ శర్మపై ఆరోపణలు గానీ, వాటిపై విచారణ ప్రహసనం గానీ ఆశ్చర్యం కలిగించదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అనేక ట్విస్టులు చోటు చేసుకున్నాయి. అసలు ప్రమాదం, అగ్నిమాపక బృందాలు వెల్లడం మార్చి 14న రాత్రి జరిగితే, వారికి కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయన్న అనధికారిక కథనాలు 21నగానీ బయటకు రాలేదు. ఆ తర్వాత అగ్నిమాపక అధికారులు నోట్లకట్టలు కని పించినట్టు తాము చెప్పలేదని తమతో చెప్పినట్టు పిటిఐ వార్త ఇచ్చింది. తర్వాత సదరు అధికారి అతుల్ గార్గ్ తాము ఆ మాట తను చెప్పింది కాదని వివరణ ఇచ్చారు. ఇక నోట్ల కట్టలు పెట్టిన గదులు అందరూ వాడుకునేలా ఉంటాయని జస్టిస్ వర్మ వివరణ ఇస్తే అందుకు భిన్నంగా దానికి ఎప్పుడూ తాళాలు వేసి ఉంటాయని భద్రతా సిబ్బంది చెప్పారు.వర్మను బదిలీ చేయడానికి ఈ విచారణకూ సంబంధం లేదని ఆగమేఘాల మీద స్పష్టత విడుదల చేసిన సుప్రీంకోర్టు కేంద్రం ఒప్పుకున్నాకే బదిలీ ఖరారు చేసి న్యాయవిధులకు దూరం పెట్టింది. మరోవైపున ఆయన్ను తమమీద మళ్లీ ఎందుకు రుద్దుతున్నారని అక్కడ బార్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. ఏమైనా విచారణ జరిపే న్యాయమూర్తుల బృందం నివేదిక అందేవరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవ కాశం కనిపించడం లేదు. ఈలోగా జస్టిస్ వర్మ న్యాయవాదుల సలహాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఆయన రాజీనామా వంటివి చేస్తారేమో తెలియదు. కనుక ఈ ఉదంతంలో చివరకు జరిగేదేమిటో వేచిచూడవలసిన అంశాలు చాలా ఉన్నాయి. న్యాయమూర్తుల మంచి చెడ్డల చర్చగా గాక వ్యవస్థలో రావలసిన మౌలిక సంస్కరణలు, మరో వైపు దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడం ఇక్కడ కీలకం. వ్యక్తిగతంగా న్యాయమూర్తుల లేదా న్యాయాధికారుల అవినీతి ఒకటైతే క్విడ్ ప్రోకో తరహాలో పాలకులు ఆ వ్యవస్థతో అనధికార అవగాహనకొచ్చే పరిస్థితిని నివారించడం మరింత ముఖ్యం. జస్టిస్ వర్మ ఉదంతం చివరకు ఎలా ముగుస్తుందో చూశాక మరింత లోతైన చర్చ చేయవలసి ఉంటుంది.

రంజాన్ పండుగ సెలవు రద్దు

ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే

ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రంజాన్ పండుగ సెలవును రద్దు చేయటం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర వస్తువులు, సేవల పన్ను (సీజీఎస్టీ) అధికారులను తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు విధులకు రావాలని హర్యానా ప్రభుత్వం ప్రకటించటం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించటమేనని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, హర్యానా ప్రభుత్వాల నిర్ణయాలను మార్చుకోవాలని కోరారు. పండుగ సెలవు రోజున తప్పనిసరిగా విధులకు రావాలనే ప్రతిపాదన ఉద్యోగులు తమ మతపరమైన ఆచారాలను అనుసరించే ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమేననీ, పండుగల సందర్భంలో మైనార్టీలను వేధించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్‌కు ముందు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించి, ఇప్పుడు శని, ఆది, సోమవారాల్లో ఉద్యోగులు విధులకు హాజరు కావాలని సూచించడం అసహజమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం లేదా సోమవారం రంజాన్ జరుపుకుంటున్నందున, సెలవు దినాన్ని పని దినంగా ప్రకటించడమే కాకుండా, ఈ రోజుల్లో ఎవరికీ 'సెలవు' ఇవ్వకూడదనే కేంద్రం సచన వింతగా ఉందన్నారు. ఇది వివక్షపూరితమైన చర్య అని విమర్శించారు. మత స్వేచ్ఛ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో ఒకటన్నారు. మతపరమైన పండుగలు నిర్వహించుకోవటానికి ఒక రోజు సెలవు నిరాకరించడం వల్ల ఉద్యోగులు, అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన సెలవుల జాబితాను కూడా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ప్రస్తుత ఉత్తర్వు గెజిటెడ్ సెలవులను పాటించాలనే సిబ్బంది శాఖ, హోం శాఖ మార్గదర్శకాలకు విరుద్ధమని తెలిపారు. ఈ ఉత్తర్వును ఉపసంహరించుకుని యథాతథంగా సెలవు కొనసాగించాలని డిమాండ్ చేశారు

బెంగాల్‌లో డీవైఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసుల దాడి

తెలంగాణ కమిటీ ఖండన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సిలిగురిలో ఉత్తరకన్య అభిజన్‌లో డీవైఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసుల క్రూరమైన దాడిని డీవైఎఫ్ఐ తెలంగాణ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరుతూ నిర్వహించిన శాంతియుత నిరసనపై పోలీసులు హింసాత్మక దాడికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ దాడి వల్ల డీవైఎఫ్ఐ నాయకులు మీనాక్షి ముఖర్జీ, ధృభజ్యోతి సాహాతో సహా చాలా మంది కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రజాస్వామ్య నిరసనలపై జరిగిన ఈ క్రూరమైన దాడి బెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వ నిరంకుశ స్వభావాన్ని మరోసారి బహిర్గతం చేసిందని విమర్శించారు. నిరుద్యోగ యువత నిజమైన ఆందోళనలను పరిష్కరించి, గౌరవప్రదమైన ఉపాధికి వారి హక్కును నిర్ధారించే బదులు, పోలీసు క్రూరత్వం ద్వారా భిన్నాభిప్రాయాలను అణిచివేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ అనాగరిక దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ బెంగాల్ కార్యకర్తలకు సంఘీభావం ప్రకటించారు. పోలీసుల అతిక్రమణలను ఎదుర్కొంటూ వేలాది మంది యువ నిరసనకారులు ప్రదర్శించిన ధైర్యం, సంకల్పం నిజంగా అభినందనీయమని తెలిపారు. ఉద్యోగాల కోసం జరుగుతున్న ఈ పోరాటం లాఠీలు, బుల్లెట్లతో అణచివేయబోరని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య విధానాల అమలులో

కేంద్రం నిర్లక్ష్యం

స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు ఎంపీ చామల లేఖ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... పార్లమెంట్ లోపల అనుసరిస్తున్న విధానాలను, స్థిరమైన ప్రజాస్వామ్య ప్రమాణాలను అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు ఆయన లేఖ రాశారు. లోక్‌సభలో ఉప సభాపతిని నియమించలేదని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అధికారపక్షం నిరాకరిస్తున్నదని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు, ఎంపీల మైక్రోఫోన్లు ఆఫ్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సభానిర్వహణ సలహా కమిటీ నిర్ణయాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

31న అందుబాటులో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మార్చి 31ని సెలవు దినంగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించింది. కాగా, 30, 31 సెలవు దినాలు కావడంతో ఆ కార్యాలయాలు పనిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు 31న కూడా అవకాశం కల్పించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. అదే రోజున బ్యాంకులు కూడా పనిచేయనున్న నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం వెల్లడించింది.

జియో ఫైబర్ టెక్నీషియన్ సహాయంతో

క్రెడిట్ కార్డుల వివరాల తస్కరణ

నిందితుడు అరెస్టు : సీసీఎస్ పోలీసులు

నవతెలంగాణ–సిటీబ్యూరో

జియో ఫైబర్ టెక్నీషియన్ సహాయంతో ఇతరుల క్రెడిట్‌కార్డులను ఉపయోగించి డబ్బులు స్వాహా చేస్తున్న నిందితున్ని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకెళ్తే.. వరంగల్‌కు చెందిన ముద్దకి బాలాజీ సులువుగా డబ్బులు సంపాదించాలని తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. జియో ఫైబర్ టెక్నీషియన్‌ను ఉపయోగించి ఇతరుల క్రెడిట్‌కార్డుల వివరాలు తస్కరిస్తున్నాడు. వాటి ఆధారాలతో షాపింగ్ చేస్తున్నాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన ఓ 78ఏండ్ల వృద్ధుని క్రెడిట్ కార్డు వివరాలు తస్కరించిన నిందితుడు షాపింగ్ చేశాడు. దాంతో క్రెడ్‌యాప్ ద్వారా తన అకౌంట్ నుంచి రూ.1,11,589 షాపింగ్ చేసినట్టు బాధితునికి మెసేజ్ రావడంతో ఆందోళన చెందాడు. బ్యాంక్ అధికారులను సంప్రదించడంతో క్రెడిట్‌కార్డును బ్లాక్ చేసిన అధికారులు.. మరో కార్డుకు అప్లయ్ చేయించారు. అయితే క్రెడ్ యాప్ సహాయంతో కొత్త కార్డు వివరాలను సైతం నిందితుడు తస్కరించాడు. విషయం తెలుసుకున్న బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో విచారించిన పోలీసులు.. నిందితున్ని అరెస్టు చేశారు. జియో ఫైబర్ టెక్నీషియన్ సహాయంతోనే మోసాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

'నల్సార్'కు రూ 6.57 కోట్ల నిర్వహణ నిధులు మంజూరు

జీవో 269 విడుదల

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

నల్సార్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6.57 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈమేరకు న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి శనివారం జీవో నెంబరు 269 విడుదల చేశారు. ఈ నిధులు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నాలుగో క్వార్టర్‌గా ఇచ్చారు. యూనివర్సిటీ నిర్వహణ కోసం ఈ నిధులు వెచ్చించనున్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై

పోలీసుల జులుం

ప్రభుత్వ దిష్టిబొమ్మ తగలబెట్టకుండా అడ్డగింపు

- స్పృహతప్పి పడిపోయిన విద్యార్థులు
- అక్రమ వేలాన్ని ప్రశ్నించినందుకే దాడులు
- దాడులను ఖండించాలని ప్రజాస్వామ్యవాదులకు హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ పిలుపు



నవతెలంగాణ–మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ శనివారం హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్, టీచింగ్ నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సెంట్రల్ యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులను పోలీసులు చుట్టుముట్టి దాడి చేశారు. విద్యార్థినులను నెట్టేశారు. మొదట మెయిన్ గేటు దగ్గర దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు నెట్టేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొంతమంది విద్యార్థులు స్పృహ తప్పి పడిపోగా.. కొంతమందికి గాయాలయ్యాయి. పోలీసులు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా.. విద్యార్థులు ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు యూనివర్సిటీ భూములపైనా, నిరసన తెలియజేసిన విద్యార్థులపైనా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాళా తీయించడమే కాకుండా, దివాళా లోటును పూడ్చుకోవడానికి హెచ్‌సీయూ భూములపై కన్ను వేసి వాటిని ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను గుంట నక్కలుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకోవాలని, వెంటనే విద్యార్థిలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రేవంత్ ఇంటిని ముట్టడించి, గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తూ అసెంబ్లీని, మీడియాను తప్పుదోవ పట్టించారని చెప్పారు. 2,300 ఎకరాల అటవీ భూమి ఉందన్నారు. యూనివర్సిటీకి వచ్చి ఫుట్‌బాల్ ఆడిన రేవంత్‌కి ఆ భూమి కనిపించలేదా అని ప్రశ్నించారు. భూముల వేలంపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై జరిగిన పోలీసు దాడులను ఖండించాలని ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు. భూముల వేలాన్ని ఉపసంహరించుకుని, యూనివర్సిటీ పేరు మీద భూములు రిజిస్ట్రేషన్ చేసే వరకూ పోరాటం కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు ఉమేష్ అంబేద్కర్, కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షులు ఆకాష్, సహాయ కార్యదర్శి త్రివేణితో పాటు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి

ఇంటిని ముట్టడిస్తాం

హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులపై పోలీసుల దాడికి పాల్పడడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి హెచ్‌సీయూ భూములపై రాష్ట్ర ప్రభుత్వం కన్నేసిందని విమర్శించారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్‌రెడ్డి విద్యార్థులను గుంటనక్కలుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన తన భాషను మార్చుకోవాలనీ, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామనీ, తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు అబద్ధాలు చెప్తూ అసెంబ్లీని, మీడియాను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. 2,300 ఎకరాల అటవీ భూమి ఉంటే యూనివర్సిటీకి వచ్చి ఫుట్‌బాల్ ఆడిన సీఎంకు కండ్లు కనిపించలేదా?అని ప్రశ్నించారు. భూముల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పేరు మీద భూములను రిజిస్ట్రేషన్ చేసే వరకు పోరాటం ఆగబోదని హెచ్చరించారు. వేలం పాటను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దక్షిణాదికి నష్టంపై చంద్రబాబు స్పందించాలి

కిషన్ రెడ్డి, బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు

బీజేపీని నమ్మలేం : డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జనాభా ప్రాతిపదికన కేంద్రం చేపట్టబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు నాయుడు స్పందించాలని 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల నాయకుల సమావేశాన్ని ఉద్దేశించి, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దొంగలముఠా అంటూ కామెంట్ చేయడంపై సమావేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దైవభక్తి, దేశభక్తి పేరుతో మతో న్మాదుల ముఠా రెచ్చిపోతున్నదని విమర్శించారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనే లేదంటూ కిషన్‌రెడ్డి అంటున్నారనీ, గతానుభవాల రీత్యా బీజేపీని నమ్మే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు, 370 ఆర్టికల్ రద్దు, రైతు వ్యతిరేక నల్లచట్టాలను కూడా ఏం లేదంటూనే ఆకస్మికంగా తెచ్చి రుద్దారని గుర్తు చేసింది. జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నియోజక వర్గాల పునర్విభజనను మరో 25 ఏండ్ల పాటు నిలిపేయాలని డిమాండ్ చేసింది. ఒక వేళ కేంద్రం ఇప్పుడే చేపట్టాలని నిర్ణయించుకుంటే రాష్ట్రం యూనిట్‌గా ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాల్లో 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలని కోరింది. మాజీ ఎంఎల్‌ఏ కె.యాదవ్ రెడ్డి ఎంపి నియోజకవర్గాల పునర్ విభజనపై వివరాలతో ఒక ముసాయిదా నివేదికను సమావేశంలో ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో యాదవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి.వినోద్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, విద్యావేత్త మధుసూదన్‌తో పాటు సమావేశంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఎం.జగన్ (ఐఫ్టూ), నారాయణ (బ్లాసమ్ విద్యా సంస్థల అధినేత), తిప్పర్తి యాదయ్య ఉపేందర్, పార్వతి (తెలంగాణ విద్యావంతుల వేదిక), మల్లంగి విజయ్, జావెద్ షరీఫ్, డాక్టర్ లక్ష్మ, మౌనిక, దర్శనం రమేష్, ధర్మేందర్ తివారి, ఖాన్, కోడంగల్ శ్రీనివాస్, అజీమ్, పవార్, షబాజ్, సత్యనారాయణ రెడ్డి(ఆప్), ఎం.వేణు (టీజేఎస్), సంఘ సేవకులు రాకేష్ తదితరులు ప్రసంగించారు.

ఏడు రూపాయల వేతన పెంపు

కూలీలను అవమానించడమే

నిత్యావసరాల ధరలు 11 శాతం పెరిగితే.. వేతన పెంపు 2 శాతమేనా

ఎంపీలు తమ వేతనాలు పెంచుకున్నట్టు మూడో వంతు పెంచాలి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి కూలీల కనీస వేతనాన్ని ఏడు రూపాయలు మాత్రమే పెంచడం గ్రామీణ పేదలను అవమానించడమే అవుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య ఆర్.వెంకట్రాములు పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసర సరుకుల ధరలు 11 శాతం, నిరుద్యోగం రేటు ఏడు శాతం పెరిగిందనే విషయాన్ని పక్కన పెట్టి కేవలం ఏడు రూపాయల వేతనం దుర్మార్గమని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు ప్రస్తుతమున్న వేతనంలో మూడో వంతు వేతనాన్ని అదనంగా పెంచుకున్నట్టుగానే ఉపాధి కూలీల వేతనాన్ని కూడా సవరించి మూడు రెట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణం 11 శాతం పెరిగితే కూలీల వేతనాలను రెండు శాతానికి పెంచడం యావత్ దేశమే సిగ్గుపడే అంశమని అభిప్రాయపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే సుప్రీం కోర్టు తీర్పును తుంగలో తొక్కడాన్ని తప్పుబట్టారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు అమలు అమలు చేస్తున్నట్టుగా రోజు కూలి ఎనిమిది వందల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. గోవాలో 10.56 శాతం, యూపీ, ఉత్తరాఖండ్‌లో 3.02 శాతం, తెలంగాణలో 2 రెండు శాతం, ఇలా రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య వ్యత్యాసాన్ని చూపెట్టడాన్ని తప్పుబట్టారు. ఈ రకమైన నిర్ణయం పెద్ద ఎత్తున ఆర్థిక అసమానతలు పెరగడానికి దారితీస్తుందని, సామాజిక ఆర్థిక అసమానతలు పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. తక్షణమే కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ పునరాలోచన చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని ఎనిమిది వందల రూపాయలకు పెంచాలనీ, పని దినాలను 200 రోజులకు పెంచి పట్టణ ప్రాంతాలకు పనిని విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు.



హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందం

గొప్ప ముందడుగు

జల విద్యుత్ నాణ్యతతో పాటు ఆర్థికంగా మేలు : డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

హిమాచల్‌ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం గొప్ప ముందడుగని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, ఇతర అధికారుల సమక్షంలో గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ప్రకారం 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. హిమాచల్‌తో భాగస్వామ్యం ఆర్థికంగా మేలైనదే కాకుండా నాణ్యమైన విద్యుత్ పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. "థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి (జల విద్యుత్) వ్యయం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతూ ఉండగా.. హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఎక్కువ జీవనదులు ఉన్న రాష్ట్రం కావడంతో ఏడాదిలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతర హైడల్ పవర్ (జల విద్యుత్) ఉత్పత్తికి అనువుగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్‌కో నామినేషన్ విధానంలో చేపడుతుంది" అని భట్టి తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ పవర్ వాటాను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. దేశ విద్యుత్ రంగంలో, అంతర్రాష్ట్ర సహకారానికి హిమాచల్ ఒప్పందం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందిప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, జెన్కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానంద, హిమాచల్ ప్రదేశ్ ఎనర్జీ డైరెక్టర్ రాకేష్ ప్రజాపతి, స్పెషల్ సెక్రటరీ ఎనర్జీ అరిందం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

6,7 తరగతుల బాలురకు ప్యాంట్లు

ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆరు, ఏడో తరగతి విద్యార్థుల్లోని బాలురకు నిక్కర్ స్థానంలో ప్యాంటు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఈవి నరసింహారెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), టైలర్లకు గతంలో ఎనిమిది నుంచి 12వ తరగతి విద్యార్థుల (బాలురు)కు ప్యాంటు కుట్టాలని ఆదేశాలిచ్చామని తెలిపారు. ఇప్పుడు ఆరు నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్యాంటు కుట్టాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ పంచాయతీరాజ్, టీజీఆర్ఈఐఎస్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ, యూఆర్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెండు జతల బట్టలు (యూనిఫారాలు) అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 19,91,986 మంది విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం (2025-26)లో యూనిఫారాలను అందిస్తామని వివరించారు. ఆరో తరగతిలో 92,448 మంది, ఏడో తరగతిలో 92,448 మంది చదువుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు (బాలుర)కు ప్యాంటు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం పట్ల టీజీహెచ్ఎంఏ మాజీ అధ్యక్షుడు పి రాజభాను చంద్రప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్ఐఎంసీ దరఖాస్తు గడువు

ఏప్రిల్ 15 వరకు పొడిగింపు

ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

డెహ్రాడూన్‌లో ఉన్న రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ)లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసేందుకు గడువును వచ్చేనెల 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ జి రమేష్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్, డిసెంబర్‌లో ఏడాదికి రెండు సార్లు ప్రవేశాలు జరుగుతాయని వివరించారు. ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం ఈ ఏడాది జూన్ ఒకటిన, వచ్చే ఏడాది జనవరిలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అయితే దరఖాస్తు గడువు ఈనెల 31 వరకు ఉండేదని పేర్కొన్నారు. దాన్ని వచ్చేనెల 15వ తేదీ వరకు పొడిగించామని తెలిపారు. పూర్తి వివరాలు, నోటిఫికేసన్ కోసం scert.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఏమైనా సమస్యలు, సందేహాలుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 8520866771 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైద్య అనుబంధ వృత్తుల రాష్ట్ర స్థాయి కమిషన్

వెంటనే ఏర్పాటు చేయాలి

మంచాల రవీందర్

జాతీయ కమిషన్ సభ్యునికి సన్మానం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వైద్య అనుబంధ వృత్తుల రాష్ట్ర స్థాయి కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మంచాల రవీందర్ కోరారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, వైద్య అనుబంధ వృత్తుల జాతీయ కమిషన్ సభ్యునిగా నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్ నియమితులైన నేపథ్యంలో ఆయనకు రవీందర్ శుభాకాంక్షలు తెలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ వైద్య అనుబంధ వృత్తుల అభివృద్ధికి, విద్య, శిక్షణ విషయంలో సంస్కరణలు తీసుకురావడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే రాష్ట్ర స్థాయి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగ నిర్ధారణ, చికిత్స, సేవలలో వైద్య అనుబంధ వృత్తుల ప్రాముఖ్యత చాలా పెరిగిందనీ, వైద్యరంగంలో సాంకేతికత అభివృద్ధి చెందడంతో ఈ విభాగపు నిపుణులకు డిమాండ్ పెరగడమే కాకుండా శిక్షణావసరాలు కూడా పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం వైద్య రంగంలో నాణ్యమైన సేవలు అందించడానికి సుశిక్షితులైన సాంకేతిక సిబ్బంది అవసరం పెరిగిందన్నారు. రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుతో ఈ వృత్తి ఉద్యోగుల నమోదు, సరైన గుర్తింపు, ఉద్యోగం, విజ్ఞానం, కోర్సుల రెగ్యులేషన్ సాధ్యపడుతుందని ఆయన వివరించారు. శిక్షణ పొందిన, అర్హులైన సాంకేతిక సిబ్బంది విధిగా రాష్ట్ర స్థాయి కౌన్సిల్, జాతీయ స్థాయిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి మౌలిక వసరులు లేకుండా, ఆస్పత్రి వసతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న విద్యాసంస్థలను నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలిపారు.. కోర్సుల నిర్వహణ, కామన్ సిలబస్ రూపొందించాల్సి ఉందని చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ రంగంలో పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, నిమ్స్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సన్న బియ్యం పంపిణీ

సాయంత్రం హుజూర్‌నగర్‌లో లాంఛనంగా ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నేటి నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కానున్నది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు సూర్యాపేట జిల్లా, హుజూరాబాద్ పట్టణంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో నియోజకవర్గాల్లో సన్నబియ్యం పంపిణీకి సంబంధించి ప్రారంభించే కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో 89.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా 2.81 కోట్ల మందికి బియ్యం పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కొత్త వారికి రేషన్ కార్డులను జారీ చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో పేర్లను చేర్చేందుకు అవకాశం కల్పించడంతో లబ్దిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరనున్నట్టు పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు రేషన్‌షాపుల ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేస్తుండంతో 70 నుంచి 80 శాతం వరకు ఆ బియ్యం ప్రజలు ఉపయోగించుకోవడం లేదనీ, దాన్ని రీసైక్లింగ్ కోసం, కోళ్ల పరిశ్రమకు, బ్రేవరేజెస్ తదితరాల వాటి కోసం మళ్లిస్తున్నట్టు పలుమార్లు అధికారుల నిఘాలో బయటపడింది. రాష్ట్రంలో లబ్దిదారులకు ఈ బియ్యం పంపిణీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏడాదికి రూ.10,665 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5,175 కోట్లు కాగా కేంద్రం వాటా రూ.5,485.5 కోట్లు ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా, సరఫరా చేస్తున్న బియ్యం ఉద్దేశించిన అవసరానికి ఉపయోగపడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.


దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సన్నబియ్యం పంపిణీ చేయబోతున్నట్టు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి లబ్ధి చేకూరనుంది. ఈ పథకం ప్రారంభించేందుకు ముందు సన్నబియ్యాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ కు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. దీంతో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో రికార్డ్ స్థాయిలో 4.41 లక్షల మంది రైతుల నుంచి 24 లక్షల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. వీరికి బోనస్ రూపంలో రూ.1,199 కోట్లను చెల్లించారు.ఇప్పటికే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని అర్హుల జాబితాలో ఉన్న వారు కూడా ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పొందేందుకు అర్హులని పౌరసరఫరాలశాఖ స్పష్టం చేసింది. ఇదొక విప్లవాత్మకమైన చర్యగా పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. బియ్యంతోనే సరిపెట్టబోమనీ, మున్ముందు నిత్యావసర సరకుల పంపిణీని కూడా మొదలు పెట్టనున్నట్టు తెలిపారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంపునకు ఆలోచిస్తున్నట్టు చెప్పారు.




క్రికెట్ లేని క్రికెట్ ఆట-ఐపీఎల్

పల్లీ-బఠానీలు

'నేతి బీరకాయలో నెయ్యి లేదు, మైసూర్ బోండంలో మైసూర్ లేదు, ఐపీఎల్ క్రికెట్‌లో క్రికెట్ లేదు' అంటే కోపగించుకోవద్దు.
అది నిజం, పచ్చి నిజం.
మన తెలుగు సినిమాల్లో హీరో విలన్ల బందాన్ని-ఎంత మందైనా ఉండనీ- వొంటి చేత్తో లేపి లేపి కొడతాడు. సినిమా సక్సెస్, బాక్సాఫీస్ బద్దలు ఖాయం.
అదే సక్సెస్ ఫార్ములా ఐపీఎల్ కిరికెటుకు కూడా. దీనితో బీసీసీఐ గదులు డబ్బు సంచులతో కిక్కిరిసిపోతున్నాయి, క్రికెట్ స్టేడియంల లాగా.
ఇప్పుడు ఐపీఎల్‌లో హీరో బ్యాటర్ మాత్రమే. బౌలరుకు పెద్ద విలువలేదు. ఎందుకంటే ఎంత గొప్ప బౌలర్ వేసిన బంతినైనా సునాయాసంగా 30 అడుగుల ఎత్తుకు కొట్టి 100 అడుగుల దూరంలో ప్రేక్షకుల మధ్య పడేట్టు చేయగల ఘనాపాటి బ్యాటర్లు ఉన్నారు. 20 బంతుల్లో 50 పరుగులు చేస్తారు. అందులో ఫోర్లు, సిక్సర్లతో వచ్చిన పరుగులే ఎక్కువ. దానితో స్టేడియం అంతా కేరింతలు, అరుపులు, టీమ్ జెండా రెపరెపలు.
ఇది చూసే పిల్లా, పెద్ద అంతా బ్యాటర్ గొప్పతనం అనుకుంటారు. బ్యాటర్‌కు గొప్పతనం కట్టబెట్టటానికి కావలసిన స్కీం అంతా ముందే తయారయి ఉంటుంది. క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లకు, టీ20 మ్యాచ్‌లకు ఉన్న రూల్స్ చూస్తే ఇది బాగా అర్థమవుతుంది.
మొదటిది, పిచ్ ని బ్యాటర్‌కు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఎంత గొప్ప బౌలర్ అయినా ఈ పిచ్‌ల మీద చెమట కార్చాల్సిందే, వికెట్ దక్కటం గగనం. టీ 20, వన్డే, టెస్ట్ మ్యాచ్‌లకు వేరువేరుగా పిచ్‌లను ఎందుకు తయారు చేస్తారు. కారణం ఒకటే బాల్ బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టకూడదు. తేలికగా బౌండరీ వైపు పరుగులు పెట్టాలి, లేక గాల్లో తేలుతూ ప్రేక్షకుల మధ్య పడాలి.
పిచ్ మార్పే కాదు, రూల్సులో మార్పులు కూడా బ్యాట్స్‌మన్‌కే అనుకూలం. మొదటి 6 ఓవర్లలో 2 ఫీల్డర్లు మాత్రమే లోపలి సర్కిల్ బయట వుండవచ్చు. మిగతా అందరూ లోపలి సర్కిల్ లోపలే ఉండాలి. ఈ రూల్ వల్ల బ్యాటర్ ధైర్యంగా బంతిని లోపలి ఫీల్డర్ నెత్తి మీదనుంచి బౌండరీకి తరలించవచ్చు.
ఈ రూలు చూడండి ఎట్లా వున్నదో? ఏ బౌలరు 4 ఓవర్లకు మించి బౌలింగ్ చేయకూడదుట. బౌలర్ వరసగా వికెట్లు తీసుకుంటున్నా 4 ఓవర్లే వేయాలి. ఆపైన ఒక్క బాలు విసరటానికి వీల్లేదు. కానీ 4 ఓవర్లే ఆడాలి అనే రూలు బ్యాట్‌మన్‌కి లేదు. అవుట్ కాకుండా మొదటి బంతి నుంచి చివరి బంతి దాకా ఆడవచ్చు. వీళ్లకి నాలుగు ఓవర్ల పరిమితి ఎందుకు లేదు. బ్యాట్ మన్‌ని హీరోను చేయాలి కనుక.
మరో రూలు, బాల్ ఏ కొద్దిగా కూడా బ్యాట్‌మన్ వెనక నుంచి వెళ్ళకూడదు. పొరపాటున వెళితే అంపైర్ వెంటనే రెండు చేతులు ఈ పొడుగున చాపి వైడ్ బాల్ అంటాడు. అంపైర్ కంటే ముందరే టీవీలో ఆట చూసే ప్రేక్షకులు చేతులు చాపి వైడ్ అంటారు. అది వేరే విషయం అనుకోండి. ఇక నోబాల్‌లో బౌలర్‌కి వేసే శిక్ష ఇంకా పెద్దది. ఎదుటి పార్టీకి రన్ ఇవ్వటమే కాక, ఫ్రీ హిట్ బాల్ కూడా ఇస్తారు. ఈ బాల్‌ను బ్యాటర్ ఎట్లాగైనా కొట్టవచ్చు. రనౌట్ తప్ప క్యాచ్‌తోనూ, స్టంపింగ్‌తోనూ ఈ బాల్‌లో అవుట్ కాడు.



ఆట మొత్తం బ్యాటింగ్ చేసే వారికి అనుకూలంగా మార్చేశారు. టెస్ట్ మ్యాచ్‌లలో ఈ రూల్స్ ఏవి లేవు. ఫీల్డింగ్ అంక్షలు లేవు, బౌలింగ్ అంక్షలు లేవు. టెస్ట్ మ్యాచ్‌లో లేని రూల్స్ ఐపీఎల్‌లో ఎందుకు?
డబ్బు... డబ్బు... డబ్బు గడించాలి. ఇప్పుడున్నది వ్యాపారయుగం కదా. దేన్నైనా వ్యాపారంగా మారిస్తేనే జనం డబ్బులు వ్యాపారావేత్తల దగ్గరికి చేరతాయి. క్రికెట్ ఆటే ఉదాహరణ. ఆట వ్యాపారంగా మారిపోయిన తరువాత, లాభం గురించి తప్ప ఇంకో ధ్యాస ఎక్కడ వుంది? లాభం కోసం క్రికెట్ ఆడని దుబాయ్‌లో క్రికెట్ స్టేడియంలు పెట్టి ఆడించి, టీవీల్లో చూపించి డబ్బులు సంపాదిస్తారు.
వ్యాపారంలో రారాజులందరికి క్రికెట్ టీమ్‌లు వున్నాయి. ఆటగాళ్ళను అక్షన్‌లో కొనుక్కున్నారు. అంబానీ, శ్రీవాసన్, గొయంకా లాంటి బిగ్ బిజినెస్‌ల చేతుల్లో, షారుఖ్ ఖాన్, ప్రీతి జింటా లాంటి సినీ సెలబ్రిటీల చేతుల్లో ఐపీఎల్ ఆట ఉంది. హైదరాబాద్ సన్‌రైజర్స్ ఓనర్ సన్ టీవీ ఛానల్ ఓనర్ కళానిధి మారన్. ఈ టీమ్‌లో ఒక్క తెలుగువాడైనా ఉన్నాడా? ఉంటే ఒకడో, అరో వుండవచ్చు. దాదావు అన్నీ టీమ్‌ల పరిస్థితీ ఇదే.
ఇలా చెప్పాలంటే చాలా వుంది. కనుక,
కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి
పడితే పట్టాలిరా డబ్బు సంచులు
అని పాడుకుందాం.



హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

అవర్‌లోనూ ప్రజా సమస్యలు ఎక్కువగా ప్రస్తావను రాలేదన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వ చర్యలున్నాయని చెప్పారు. కేటాయింపులు సరిగ్గా లేవన్నారు.

గ్యారంటీలకు గ్యారంటీ ఏదీ?

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని జాన్‌వెస్లీ గుర్తు చేశారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్నారనీ, వాటి అమలుకు విధివిధాలేవని ప్రశ్నించారు. దళితులు, గిరిజనులకు రూ.12 లక్షల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామంటూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించారని అన్నారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపుల్లేవని చెప్పారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు 30 లక్షల మంది ఉన్నారని వివరించారు. కానీ 4.50 లక్షల మంది ఇండ్లు నిర్మిస్తామంటూ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని అన్నారు. గతేడాది కూడా ఇదే విషయాన్ని చెప్పిందనీ, కానీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. ఇదే వైఖరి కొనసాగితే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, ఆరు గ్యారంటీల కోసం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వానికి తగిన పద్ధతిలో ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే నష్టం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని జాన్‌వెస్లీ చెప్పారు. దాని అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని సూచించారు. అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కేంద్రం నిర్ణయం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లను పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దానివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అఖిలభారత స్థాయిలో అన్ని పార్టీలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదించాలని డిమాండ్ చేశారు. స్పష్టత రాకుంటే ఈ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతుగా ఉంటామన్నారు.

ప్రజా సమస్యలపై కేంద్రీకరణ

ఈనెలలో ప్రజా సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తున్నామనీ, సర్వేలు చేస్తున్నామని జాన్‌వెస్లీ అన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామని చెప్పారు. ధర్నాలు, ఆందోళనలు చేపట్టామన్నారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ సమస్య కూడా ఉందన్నారు. కరెంటు సమస్య కూడా ఉందని చెప్పారు. గృహ వినియోగదారులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని అన్నారు. దాన్ని 300 యూనిట్ల వరకు పెంచాలని కోరారు. రూ.500 గ్యాస్ సిలిండర్ అందరికీ అమలు కావడం లేదని చెప్పారు. అర్హులందరికీ వర్తింపజేయాలని సూచించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చి వాటికి పట్టాలివ్వడం లేదన్నారు. వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో 700 కుటుంబాలకు ఇండ్లు నిర్మించాలి

రామోజీ ఫిల్మ్ సిటీలో 700 కుటుంబాలకు 2007లో ఇండ్ల స్థలాల నిర్మాణానికి నాటి ప్రభుత్వం పట్టాలిచ్చిందని జాన్‌వెస్లీ చెప్పారు. అక్కడ ఇండ్లు నిర్మాణం చేసుకోవడానికి అవకాశం లేకుండా రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యం చుట్టూ ప్రహరీగోడ కట్టి, గేట్లు పెట్టి, రోడ్లను ఆక్రమించి పేదలను ఆ భూముల్లోకి రానివ్వడం లేదన్నారు. పోలీసులను పెట్టి అరెస్టు చేయిస్తూ ఇబ్బంది పెడుతున్నదని అన్నారు. పట్టాలిచ్చిన 700 కుటుంబాల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం 360 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించిందని విమర్శించారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఇండ్లు లేని పేదలు చాలా మంది ఉన్నారనీ, వారిని సమీకరించి పేదలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ క్రమంలో జరిగే పరిణామాలకు రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో రైతుల భూములు తీసుకోవద్దు

ఫ్యూచర్ సిటీ పేరుతో వేల ఎకరాల భూమిని రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్నదని జాన్‌వెస్లీ చెప్పారు. ఫార్మాసిటీ పేరుతో 15 వేల ఎకరాలను సేకరించిందని అన్నారు. అక్కడ రెండువేల ఎకరాల భూమికి సంబంధించి 800 మంది రైతులు భూమిని ఇవ్వబోమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఆ రైతులకు భూమిని తిరిగి ఇవ్వాలంటూ సుప్రీం తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లను చేర్చలేదని అన్నారు. వారికి సంక్షేమ పథకాలు, రుణమాఫీ, రైతు భరోసా అమలు కావడం లేదన్నారు. ఆ భూమిని ఇతరులకు అమ్ముకునే హక్కు లేదని చెప్పారు. రైతుల భూములను బలవంతంగా తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనీ, ఇది సరైంది కాదన్నారు. సుప్రీం కోర్టు చెప్పినట్టుగా రైతుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలనీ, వారికి ఆ భూమిని అమ్ముకునే హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన ఐదువేల మందికి 120 గజాల చొప్పున ఇండ్లస్థలాలను కేటాయిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు వారికి పట్టాలివ్వలేదనీ, భూమి చూపించలేదని విమర్శించారు. వారు తక్కువ ధరకు ప్రభుత్వానికి భూములిచ్చారని చెప్పారు.

అక్కడ రూ.ఐదు కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు భూమి విలువ పెరిగిందన్నారు. కానీ ప్రభుత్వం రూ.ఎనిమిది లక్షలు, రూ.16 లక్షలు మాత్రమే వారికి ఇచ్చిందని అన్నారు. వారి ఇండ్ల నిర్మాణం కోసం భూమి చూపించాలనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ పేరుతో ఫ్యూచర్ సిటీలో రోడ్డు వేస్తున్నారని వివరించారు. రైతులతో చర్చించకుండానే బలవంతంగా భూమిని తీసుకుంటున్నారని విమర్శించారు. ఏమీ చెప్పకుండా భూమి వద్ద హద్దులను పెడుతున్నారని చెప్పారు. ఏమైనా అడిగితే పోలీసులతో బెదిరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలిసే ఇదంతా జరుగుతున్నదని చెప్పారు. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామనీ, రైతులకు తాము అండగా నిలబడతామని అన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదనీ, బలవంతంగా భూములను తీసుకుంటే ఉద్యమిస్తామని చెప్పారు.

సీసీఐ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర

ఆదిలాబాద్‌లో సీసీఐ 27 ఏండ్ల మూతపడిందని జాన్‌వెస్లీ వివరించారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపిస్తే 770 ఎకరాల్లో ఉన్న సీసీఐని తెరిపిస్తామంటూ హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని చెప్పారు. అక్కడ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే గెలిచారనీ, వెంటనే సీసీఐ పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల విలువైన ఆ భూమిని రూ.42 కోట్లకు అదానీకి కారుచౌకగా కట్టబెట్టే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. పది వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అదానీకి కట్టబెట్టే కుట్రను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐని తెరవాలంటూ చలో పార్లమెంటు కార్యక్రమానికి తాము మద్దతు ఇస్తున్నామని అన్నారు. ఓయూ ప్రజా ఉద్యమాలకు కేంద్రమన్నారు. అక్కడ ధర్నాలు, నినాదాలు, ఆందోళనలు చేయొద్దంటూ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారని విమర్శించారు. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనేక భావాలపై చర్చ జరిగే కేంద్రాలుగా వర్సిటీలుండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతోనే ఆ సర్క్యులర్ వచ్చిందని విమర్శించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బలమున్న చోట ఒంటరిగా పోటీ

స్థానిక సమస్యలపై వచ్చేనెలలోనూ క్యాంపెయిన్ చేపడతామని జాన్‌వెస్లీ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఏప్రిల్ 11న పూలే, 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందిస్తామని అన్నారు. మనువాద భావజాలాన్ని, మత ఉద్రిక్తతలను బీజేపీ రెచ్చగొడుతున్నదని విమర్శించారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని చెప్పారు. పాస్టర్ పగడాల ప్రవీణ్‌ది హత్య, ప్రమాదమా?అనేది స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం దానిపై విచారణ జరపాలని కోరారు. హత్యలు, కులదురంహకార హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అరాచకాలు, కుల దురంహకార హత్యలను ప్రభుత్వం అరికట్టాలని అన్నారు. వచ్చేనెల రెండు నుంచి ఆరు వరకు తమిళనాడు మధురైలో సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు, భవిష్యత్ కారాచరణపై చర్చలు జరుగుతాయని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము బలంగా ఉన్నచోట ఒంటరిగా పోటీ చేస్తామన్నారు. కలిసొచ్చే వామపక్ష, లౌకిక, అభ్యుదయ శక్తులతో కలిసి పనిచేస్తామని చెప్పారు. వారితో చర్చలు జరుపుతామని అన్నారు. అయితే ప్రజా సమస్యల విషయంలో సీపీఐ కలిసి రావాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డుపై 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్‌కార్డులను వెంటనే ఇవ్వాలని కోరారు. ఎల్ఆర్ఎస్ గడువు ఈనెల 31తో ముగియనుందనీ, గడువును మరో రెండు నెలలపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మూడేండ్లలో 14 ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు

- ఖమ్మం నగరానికి రింగ్ రోడ్
- భద్రాద్రి ఆలయాభివృద్ధికి రూ.34 కోట్లు
- సన్న వడ్లకు పూర్తిస్థాయిలో బోనస్ : వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉగాది సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లాలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్టు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాబోయే మూడేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 14 ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఖమ్మంలోని ఐడీవోసీలో శనివారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. సింగరేణి ఆధ్వర్యంలో గతంలో నడిచే మైన్స్ కాలేజిని ఇంజినీరింగ్ కళాశాలగా మార్చామన్నారు. జియోలజి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరగా, సీఎం నిపుణులతో చర్చించి, కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయన్నారు. అమరావతి-భద్రాచలం జాతీయ రహదారి పనులు పూర్తి చేసుకున్నామని, హైదరాబాద్ - ఇల్లెందు - భద్రాచలం జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భద్రాచలం-ఏటూరు నాగారం మీదుగా మహారాష్ట్రకు కూడా జాతీయ రహదారి వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఖమ్మం నుంచి రాజమహేంద్రవరం జాతీయ రహదారి పనులు పూర్తి అవుతాయన్నారు. కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. పాండురంగాపురం నుంచి విష్ణుపురం రైల్వేలైన్ మంజూరు అయిందన్నారు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే లైన్ వేస్తే భద్రాచలానికి రైల్వే కనెక్టివిటి వస్తుందన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం కింద రూ.600 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశామని తుమ్మల తెలిపారు. సాగునీరు ఇబ్బందులు వచ్చినా వైరా, తల్లాడ, పెనుబల్లి వెంసూర్ మండలాలతోపాటు ఎగువన పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట నియోజకవర్గాల్లోని పంటలు కూడా కాపాడుకుంటున్నామన్నారు. కాల్వల నిర్మాణ పనుల సవరణ అంచనాలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, దీని ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లో సుమారు 1. 20 లక్షల ఎకరాలు, సాగర్ కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. భద్రాద్రి దేవాలయ అభివృద్ధికి టెంపుల్ చుట్టూ భూసేకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి దశ కింద భూసేకరణకు రూ.34 కోట్లు మంజూరు చేశారన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయితే ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డుగా ఉపయోగపడుతుందని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. రైతులు నిర్భయంగా ఆయిల్ పామ్ సాగు చేయొచ్చని సూచించారు. గ్రానైట్ పరిశ్రమ మీద ఆధారపడే యువకులకు లాభం చేకూర్చేలా నిబంధనలు, మార్గదర్శకాలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పాత నేలకొండపల్లి రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 కోట్ల మంజూరు చేశారని అన్నారు. సన్నబియ్యం ధాన్యానికి బోనస్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేసిందని, ఎక్కడైనా గ్యాప్ ఉండి రైతులకు రాకపోతే కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. మార్చి నెలాఖరు నాటికి రైతు భరోసా నిధులు జమ చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవేస్ మేనేజర్ దివ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మీ ఆఫీసులో సర్వర్లు ఎందుకు పెట్టుకున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ఏసీపీ, వెంకటగిరి నేతత్వంలో కేసు నమోదయ్యే కొద్ది రోజుల ముందు శ్రవణ్ రావు లండన్‌కు వెళ్లి అటు నుంచి అమెరికాకు వెళ్లినట్టు అధికారులకు సమాచారముంది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆరవ నిందితునిగా ఈయన పేరు చేర్చారు. అయితే తనకు ఈ కేసుతో సంబంధం లేదనీ, తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఇటీవల శ్రవణ్ రావు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు నిరాకరించింది. తర్వాత శ్రవణ్ రావు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆయనను అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలిచ్చిన అత్యున్నత న్యాయస్థానం, మరోవైపు విచారణకు సహకరించాలని శ్రవణ్ రావును ఆదేశించింది. ఆ మేరకు కేసు నమోదైన దాదాపు ఏడాదిన్నర తర్వాత జూబ్లిహిల్స్ పోలీసుల ముందు శ్రవణ్ రావు హాజరయ్యారు. ఇంతకు ముందు ఇతన్ని అరెస్ట్ చేయడానికి రాష్ట్ర పోలీసుల తరపున సీబీఐ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు కూడా జారీ అయింది. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితునిగా పేర్కొన్న అప్పటి ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్ రావు కోసం కూడా ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీస్ జారీ కాగా మరో వైపు ప్రభాకర్ రావు సైతం తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో వేసిన పిటీషన్ విచారణలో ఉంది. ఇదిలా ఉంటే తాము దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న శ్రవణ్ రావు విచారణకు హాజరు కావడంతో అప్పటికే రూపొందించుకున్న ప్రశ్నల జాబితాతో అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం సంధించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కోసం అత్యాధునిక పరికరాలను శ్రవణ్ రావు ఎలా సేకరించారు? వాటి ద్వారా ఎంత మంది ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు? ఆ ట్యాపింగ్ చేసిన సమాచారాన్ని ఏ, ఏ పోలీసు అధికారులకు అందించారు?, అప్పటి పొలిటికల్ బాస్‌లలో ఎవరెవరికి ఈ ఫోన్ ట్యాపింగ్ సమాచారం చేరవేశారు? .. తదితర ప్రశ్నలను కూడా అధికారులు వేయగా, కొన్నింటికి సమాధానమిచ్చిన శ్రవణ్ రావు మరి కొన్నింటికీ మౌనం వహించినట్టు తెలిసింది. ఏసీపీ, వెంకటగిరి స్వీయ పర్యవేక్షణలో సాగిన ఈ విచారణతో ఈ వ్యవహారంలో అప్పటి ఐజీ ప్రభాకర్ రావు నుంచి ఏవైనా సలహాలు, సూచనలు అందుకున్నారా?, ఏ ఏ ప్రజా ప్రతినిధులను టార్గెట్ చేయాలి? అన్న సూచనలు అందుకున్నారా? అనేది కూడా అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ముఖ్యంగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో ఫోన్ ట్యాపింగ్ పరికరాలను అమర్చి ఫోన్లను ట్యాప్ చేయడంలో శ్రవణ్ రావు తీసుకున్న చర్యల గురించి కూడా అధికారులు కూలంకషంగా ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా అప్పటి బీఆర్ఎస్ పొలిటికల్ బాస్ లలో ఎవరు ఈ ట్యాపింగ్‌లకు ప్రోత్సాహమిచ్చారనే విషయమై శ్రవణ్ రావు నుంచి సమాచారం రాబట్టడానికి అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్టు తెలిసింది. ఈ విషయంలో కొంత సమాచారాన్ని కూడా దర్యాప్తు అధికారులు సేకరించినప్పటికీ ఆ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. ఉదయం 11.20 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శ్రవణ్ రావును సుదీర్ఘంగా అధికారులు విచారించాక ఆయన జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. అవసరమైతే మరోసారి విచారణ కోసం పిలుస్తామని అధికారులు ఆయనకు చెప్పినట్టు తెలిసింది.

మోడీ తీరుతో బ్యాంకింగ్ రంగంలో సంక్షోభం !

- మిత్రులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ : బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. శత కోటీశ్వరులైన తన మిత్రులకు మోడీ ప్రభుత్వం ఏకంగా 16 లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేసిందన్నారు. దీనిపై రాహుల్ తాజాగా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఆశ్రితవాదం, ఆర్థిక దుర్వినియోగం కలిసి భారతదేశ బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. దీనివల్ల జూనియర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతోంది, వారిపై ఒత్తిడి పెరుగుతోంది, వారు తీవ్రమైన పర్యవసానాలను ఎదుర్కోనాల్సి వస్తోంది" అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు కలిసిన ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగుల ప్రతినిధి బృందంతో మాట్లాడిన రాహుల్ వారి ఆవేదనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇటీవల 782 మంది ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు తనని పార్లమెంటులో కలిసి తమ సమస్యలను వివరించారన్నారు. అనైతిక రుణాల్ని మంజూరు చేసినందుకు, వాటికి అవలంబించిన పద్ధతులను బహిర్గతం చేసినందుకు బ్యాంకు ఉద్యోగులపై ప్రతీకార చర్యలుగా బలవంతపు బదిలీలు, వేధింపులకు గురిచేస్తున్నట్టు వారు తెలియచేశారన్నారు. బ్యాంకు ఉద్యోగుల అనుభవాలు తనను ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ఒత్తిడి ఇద్దరు ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడేందుకు దారి తీసిందని చెప్పారు. ఈ సమస్య కేవలం ఐసీఐసీఐ బ్యాంకుది మాత్రమే కాదని, అనేకమంది బ్యాంకింగ్ నిపుణులను ప్రభావితం చేస్తోందన్నారు. ఆర్థిక దుర్వినియోగాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం ఉద్యోగుల ప్రాణాల్ని బలి తీసుకుంటోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా వేలాదిమంది నిజాయితీపరులైన నిపుణులను ప్రభావితం చేసే అత్యంత ఆందోళనకరమైన అంశమిదన్నారు. పని ప్రదేశంలో వారు ఎదుర్కొంటున్న వేధింపులు, వారి సమస్యలపై పోరు సల్పుతామని రాహుల్ తెలిపారు.



దేశంలోనే మొదటిసారి సన్న బియ్యం పంపిణీ

- గౌరవెల్లి ప్రాజెక్టులో నీళ్లు నింపుతా : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి సన్న బియ్యం పంపిణీని ఉగాది నుంచి చేస్తుందని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకల పంచాంగ శ్రవణం ఉంటుందని, అందరూ పాల్గొనాలని కోరారు. గౌరవెల్లిలో నీళ్ల నింపడంతోపాటు కాలువల భూసేకరణ వేగంగా జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంపిణీకి ఇప్పటికే అన్ని చౌక ధరల దుకాణాలకు సన్న బియ్యం చేరాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కోసం పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. హుస్నాబాద్‌లో 309 పోలింగ్ స్టేషన్‌లు, 160కి పైగా గ్రామాలు ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెలలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి కొరత ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. కరీంనగర్-హుస్నాబాద్ నాలుగు లైన్ల రోడ్డుకు టెండర్ అయిందన్నారు. మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లైబ్రరీ వచ్చినా స్థలాలు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. హామీ ఇచ్చిన 100 రోజుల్లో శాతవాహన యూనివర్సిటీకి హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు అయిందని తెలిపారు. దీనికి మహాసముద్రం గండి వద్ద స్థల సేకరణ చేశామని, లేవలింగ్ చేస్తున్నామని చెప్పారు. 9 ఏండ్ల కిందట ఏర్పడిన అక్కన్నపేట మండల కార్యాలయ భవనానికి కోటిన్నర రూపాయలు మంజూరు అయిందన్నారు. హుస్నాబాద్ జంక్షన్‌లో ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఫిష్ మార్కెట్ దగ్గర జంక్షన్, ఎల్లమ్మ చెరువు నుంచి రామవరం వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రింగ్ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా చేస్తామన్నారు. కరీంనగర్‌లో లా కాలేజీ, హుస్నాబాద్‌కి ఇంజినీరింగ్ కాలేజీ మంజూరైనట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మెన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, వెన్న రాజు, చిత్తారి రవీందర్, వీరన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజినీరింగ్ కళాశాల పెట్టాలి

- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆందోళన

నవతెలంగాణ - కరీంనగర్

శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కళాశాలను హుస్నాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ శనివారం కరీంనగర్‌లో ఆందోళన నిర్వహించాయి. ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు యూనివర్సిటీ వద్ద నిరసన తెలిపి, అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల నెరవేరని కలగానే మిగిలిపోతుందా అని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణలో విద్యా హబ్‌గా ఎదుగుతున్న కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేటు కళాశాలల వైపు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అధిక ఫీజులు చెల్లించలేని విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగున్నరేండ్లుగా విద్యార్థి సంఘాలు పోరాడి సాధించిన ఇంజినీరింగ్ కళాశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో విద్యాభివృద్ధిపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు మొండిచేయి చూపుతోందన్నారు. ముఖ్య మంత్రి పెద్దపల్లి యువ వికాసం సభలో స్వయంగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కరీంనగర్ ఎంపీ పొన్నం ప్రభాకర్ నివాసాన్ని ముట్టడించి, జిల్లా కేంద్రానికి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారాపు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, టౌన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్, సాగర్, సందీప్, సందేశ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



భూకంప మృతులు 1600 మందికి పైనే..!

(మొదటిపేజీ తరువాయి)

చేతులతోనే ఆ శిథిలాలను, రాళ్లగుట్టలను తవ్వేందుకు ప్రయత్నించడం కనిపిస్తోంది. సాయం కోసం కేకలు వేస్తున్న వారిని బయటకు లాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మయన్మార్‌లో శనివారం కూడా ప్రకంపనలు ఎక్కువగానే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిల్లో ఒకదాని తీవ్రత 6.4గా నమోదైంది. మాండలె నగరంలో డజన్ల సంఖ్యలో భవనాలు కూలిపోవడంతో ఆ శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి తమకు సాయం కావాలని సహాయక బృందాలు పేర్కొంటున్నాయి. మయన్మార్ సాంస్కృతిక రాజధాని అయిన మాండలేలో ఒక భవనం కూలిన ఘటనలో 90మందికి పైగా శిథిలాల్లో చిక్కుకుపోయారు.

12 అంతస్తుల ఈ భవనం భూకంపం ధాటికి ఆరు అంతస్తులుగా మిగిలింది. రక్తం కోసం డిమాండ్ బాగా ఉన్నదనీ, రక్త దాతలు ఉదారంగా ముందుకు రావాలని ప్రభుత్వం కోరింది. విదేశీ సాయం తీసుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని మిన్ ఆంగ్ ప్రకటించారు. ఇంకా జరిగిన నష్టం, మరణాలపై ఒక స్పష్టత రావాల్సి వుందని ఎన్‌జిఓ ప్లాన్ ఇంటర్నేషనల్‌కు సంబంధించి మయన్మార్ డైరెక్టర్ హైదర్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఇంతటి విధ్వంసాన్ని తాము చూడలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానవతా సాయం చాలా ముఖ్యమని అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

- లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి
- ఎల్‌ఆర్‌ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు పెంచాలి : విలేకర్ల సమావేశంలో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్ఎల్‌బీసీ, ఎస్ఆర్ఎస్‌పీ, డిండి ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక నిలిచిపోయాయని అన్నారు. వెంటనే దీనిపై సమీక్ష నిర్వహించి నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని లిఫ్టులను ప్రాజెక్టు అంతర్భాగంలోకి తీసుకొని ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను గ్యారెంటీగా అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం మార్కెట్లోకి వస్తుందని, మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారుల, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా రైతుల పండించి పంటకు మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు మరో నెలరోజులపాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

గడువు చివరి రోజుల్లో ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఎక్కువ మంది వినియోదారులు పన్నులు చెల్లించలేకపోయారని, అదేవిధంగా ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని తొలగించి ఫీజు రాయితీ 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అడవిదేవులపల్లిలో సత్రశాల బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధి చెందడంతోపాటు రెండు రాష్ట్రాలకు ప్రయోజకరంగా ఉంటుందని చెప్పారు.

అదేవిధంగా డంపింగ్ యార్డ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ముఖ్యమంత్రి దృష్టి సారించి సమీక్ష పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, భవాండ్ల పాండు, లక్ష్మీనారాయణ వెంకటరెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా మూల్యాంకనం చేపట్టాలి

- విద్యార్థులకు న్యాయంగా మార్కులు కేటాయించాలి
- ఎగ్జామినర్లకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశం
- మేడ్చల్ జిల్లా మూల్యాంకన కేంద్రం పరిశీలన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న మేడ్చల్ జిల్లా జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎగ్జామినర్ల పనితీరును ఆయన పరిశీలించారు. సమయపాలన పాటించాలనీ, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు న్యాయంగా మార్కులను కేటాయించాలని కోరారు. ప్రతి ఎగ్జామినర్ జాగ్రత్త వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన విధిని అత్యంత పారదర్శంగా నిర్వహించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ ప్రక్రియలను పరిశీలించి సిబ్బందికి మూల్యాంకన ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉగాది సందర్భంగా మూల్యాంకన కేంద్రాలకు ఆదివారం సెలవు ప్రకటించామని తెలిపారు. సెలవు అనంతరం మూల్యాంకనం మరింత సమర్థవంతంగా కొనసాగించి నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆహార భద్రత అధికారులను నియమించాలి

- ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి
- మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను పని చేయించాలి : సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఆహార భద్రత అధికారులను నియమించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఫోరం అధ్యక్షులు యం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలనీ, మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను పని చేయించాలని ఆయన కోరారు. ఆహార భద్రత అధికారులు లేకపోవడంతో కల్తీ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటే ఉందనీ, అందులో పరీక్ష నిమిత్తం సరియైన పరికరాలు లేవని తెలిపారు. ఈ లేబొరేటరీలో సైంటిస్టులు, ఇతరులు కలిపి 78 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 11 మంది మాత్రమే పని చేస్తుండటంతో ఈ ల్యాబ్ నామమాత్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వము రెండు సంవత్సరాల క్రితం వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ల్యాబులు మంజూరు చేసి నిధులు కూడ విడుదల చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వినియోగించుకోలేకపోవడంతో ఆ నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఒక సంచార ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ (మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్) ఉన్నప్పటికీ అందులో సరిపడ పరికరాలు లేక పరీక్షలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 5 సంచార ల్యాబ్ లను మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 5 వ్యానులైతే కొన్నారు కాని అందులో పరీక్షల కొరకు కావలసిన పరికరాలు కొనకపోవడంతో కేంద్ర నిధులు ల్యాప్స్ అయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. గతంలో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆహార కల్తీ గురించి ప్రజలు ఫిర్యాదు చేయడానికి ఒక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అది కార్యరూపం దాల్చక కాగితాలకే పరిమితమైందని వెల్లడించారు.



స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

ముగిసిన జాతీయ కరాటే పోటీలు

హైదరాబాద్ : 2027 ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ వేదిక కానుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 'హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ కరాటే పోటీలు శనివారంతో ముగిశాయి. 1500 మంది క్రీడాకారులు పోటీపడిన ఈవెంట్‌లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు, జట్లకు మహేశ్‌కుమార్ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశాన్ని పంపించారు. 'బడ్జెట్‌లో క్రీడలకు అధిక నిధులు కేటాయిస్తున్నాం. స్పోర్ట్స్ యూనివర్శిటీతో ప్రపంచ శ్రేణి క్రీడాకారులను తయారు చేయనున్నాం. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అభినందనలు' అని సీఎం సందేశంలో పేర్కొన్నారు.



అమెరికా జట్టుకు టీడీసీఏ షాక్

సెంచరీతో చెలరేగిన అభినవ్ గౌడ్

హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్–17 వన్డే ట్రోఫీలో అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఏవైసీఏ) జట్టుకు టీడీసీఏ రూరల్ జట్టు షాక్ ఇచ్చింది. వరుస విజయాల ఊపుమీదున్న ఏవైసీఏపై 21 పరుగుల తేడాతో గెలుపొందింది. అభినవ్ గౌడ్ (143) సెంచరీతో చెలరేగటంతో టీడీసీఏ రూరల్ తొలుత 40 ఓవర్లలో 243/10 పరుగులు చేసింది. ఛేదనలో ఏవైసీఏ 49.1 ఓవర్లలో 222 పరుగులకు కుప్పకూలింది. తనూశ్ (92 నాటౌట్) పోరాడినా.. అమెరికా యూత్ జట్టుకు ఓటమి తప్పలేదు. అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలంగాణ జట్టును టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.

ముంబయి చతికిల

ముంబయి ఇండియన్స్‌కు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్ ముంగిట తలొంచిన ముంబయి ఇండియన్స్ అంచనాలను అందుకోలేదు. మహ్మద్ సిరాజ్ (2/34), సాయి సుదర్శన్ (63) మెరుపులతో గుజరాత్ టైటాన్స్ సీజన్లో తొలి విజయం సాధించింది.

36 పరుగుల తేడాతో టైటాన్స్ గెలుపు
రాణించిన సిరాజ్, సాయి సుదర్శన్



నవతెలంగాణ-అహ్మదాబాద్

ఐపీఎల్18లో గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో పరాజయం నుంచి పుంజుకున్న గుజరాత్ టైటాన్స్ శనివారం అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. 197 పరుగుల ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. రోహిత్ శర్మ (8), రియాన్ రికెల్టన్ (6) నిరాశపరచగా.. తిలక్ వర్మ (39, 36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (48, 28 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. కానీ రాబిన్ మింజ్ (3), హార్దిక్ పాండ్య (11, 17 బంతుల్లో 1 ఫోర్) విఫలం అయ్యారు. నమన్ ధిర్ (18 నాటౌట్), మిచెల్ శాంట్నర్ (18 నాటౌట్) ఆఖర్లో ధనాధన్‌తో నెట్‌రన్‌రేట్‌ను మెరుగుపర్చారు. ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (63, 41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరువగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (38, 27 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), జోశ్ బట్లర్ (39, 24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

ఫైనల్లో జకోవిచ్

సెమీస్‌లో దిమిత్రోవ్, ఫ్రిట్జ్ ఓటమి
మయామి ఓపెన్ టెన్నిస్ 2025

మయామి (యుఎస్ఏ)

మయామి ఓపెన్‌లో నొవాక్ జకోవిచ్ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. 2016 తర్వాత తొలిసారి ఇక్కడ ఫైనల్‌కు చేరుకున్న సెర్బియా స్టార్.. నేడు చెక్ రిపబ్లిక్ ఆటగాడు జాకుబ్‌తో తలపడనున్నాడు. శనివారం జరిగిన మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్లో బల్గేరియా ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్‌పై 6–2, 6–3తో వరుస సెట్లలో జకోవిచ్ విజయం సాధించాడు. ఐదు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరిసిన జకోవిచ్.. 54–34తో పాయింట్ల పరంగా స్పష్టమైన ఆధిపత్యం చూపించాడు. మూడు ఏస్‌లు కొట్టిన దిమిత్రోవ్, ఓ బ్రేక్ పాయింట్‌తో సరిపెట్టుకున్నాడు. రెండు సెట్లలోనూ జకోవిచ్‌కు పోటీ ఇవ్వలేకపోయాడు. మరో సెమీఫైనల్లో జాకుబ్ మెన్సిక్ మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించాడు. అమెరికా ఆటగాడు, మూడో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌పై 7–6(7–4), 4–6, 7–6(7–4)తో జాకుబ్ గెలుపొందాడు. తొలి సెట్ నుంచి ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో రెండు కీలక టైబ్రేకర్‌లను జాకుబ్ గెల్చుకున్నాడు. తొలి సెట్, నిర్ణయాత్మక మూడో సెట్‌లు టైబ్రేకర్‌కు దారితీశాయి. రెండింటిలోనూ 7–4తో పైచేయి సాధించిన జాకుబ్ టైటిల్ పోరుకు చేరుకున్నాడు. రెండో సెట్‌ను 6–4తో స్పష్టమైన ఆధిక్యంతో సొంతం చేసుకున్న టేలర్ ఫ్రిట్జ్ ఒత్తిడిలో అంచనాలు అందుకోలేదు.

నవచిత్రం

మంచి కథలకు, కొత్త టాలెంట్‌కి గొప్ప వేదిక




'కొత్తవారిని తయారు చేయడంలో ఆనందం వేరు. మంచి కథలకు, కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడానికి 'కథాసుధ' గొప్ప వేదిక' అని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. దర్శకుడు సతీష్ వేగేశ్న, కె.రాఘవేంద్రరావు సూపర్ విజన్‌లో ఈటీవీ విన్‌లో 'కథాసుధ' ప్రసారం కానుంది. ప్రతి ఆదివారం ఓ అద్భుతమైన కథతో అలరించబోతోంది. దీనికి సంబధించిన టైటిల్, ప్రోమో లాంచ్ ఈవెంట్ శనివారం గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి, డైరెక్టర్ సతీష్ వేగ్నేశ, బివిఎస్ రవి, తనికెళ్ళభరణితో పాటు 'కథాసుధ' టీం అంతా పాల్గొన్నారు.

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ, 'యూట్యూబ్‌లో చాలా అద్భుతమైనటువంటి ప్రతిభావంతులు ఉన్నారు. మంచి డైలాగ్స్, కథలు రాసిన వారిని సెలెక్ట్ చేసాం. ఇందులో నాలుగు ముప్పై నిమిషాల నిడివి గల సినిమాలు 17 రోజుల్లో తీశాం. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడానికి 'కథా సుధ' గొప్ప వేదిక. కొత్త దర్శకులు, రచయితలు, నటీనటులు దీంతో పరిచయం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

"శతమానం భవతి' డైరెక్టర్ అనగానే నాకు ఇచ్చే రెస్పెక్ట్ వేరే విధంగా ఉంటుంది. వారి కళ్ళల్లో తెలియని ఒక అభిమానం ఉంటుంది. ఎంత గొప్ప సినిమా అని చెప్తుంటారు. అలాంటి కథలు నా దగ్గర చాలా ఉన్నాయి. కానీ వాటిని సినిమాగా తీయాలంటే కమర్షియల్‌గా వర్కౌట్ అవుతుందా లేదా అని అనుకుంటున్న సమయంలో ఈటీవీ వారిని కలిశాను. నేను చెప్పిన ఐదు కథలను సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. ఐదు కథలని 20 రోజుల్లో తీశాం. ఈ కథలన్నీ మిమ్మల్ని అలరిస్తాయి. ఇందులో మిమ్మల్ని తట్టి లేపే జ్ఞాపకాలు ఉంటాయి. మీరు మర్చిపోలేని అనుభూతులు ఉంటాయి' అని దర్శకుడు సతీష్ వేగేశ్న చెప్పారు.

డైరెక్టర్ బివిఎస్ రవి మాట్లాడుతూ, 'సినిమా ఎంత నిడివి ఉన్న కథ 20 నిమిషాలే ఉంటుంది. అలాంటి కథలని కథాసుధగా తీసుకురావడం ఈటీవీ వారిది గొప్ప ప్రయోగం. ఇది చాలా పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ,'రామోజీరావు మహనీయుడు. ఆయన ఆశయాలు ఎప్పుడూ కూడా చిరస్మరణీయంగా ఉంటాయి. రాఘవేంద్రరావుతో పరిచయం నా సౌభాగ్యం. ఈటీవీ చాలా గొప్ప వేదిక. కథలకు పరమాద్భుతమైనటువంటి వేదిక. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన కథలు, దర్శకులని ఈ వేదిక ఇవ్వబోతోంది. సతీష్ వేగ్నేష కథ చెప్పిన వెంటనే ఓకే అన్నాను. చాలా అద్భుతంగా చేశాడు. ఈటీవీ విన్‌లో వచ్చే ఈ కథలు మన హృదయంలో దాచుకోదగ్గవి' అని అన్నారు.

'లవ్ యువర్ ఫాదర్' రిలీజ్‌కి రెడీ



కషిక కపూర్, శ్రీహర్ష

ఎస్పీ బాలు తనయుడు ఎస్పీ చరణ్ చాలా ఏళ్ళ తర్వాత 'లైఫ్' (లవ్ యువర్ ఫాదర్) అనే సినిమాతో మళ్ళీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. మనీషా ఆర్ట్స్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్స్ పై కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. పవన్ కేతరాజు దర్శకుడు.

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, రఘుబాబు, షకలక శంకర్, రియా తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. మణిశర్మ సంగీతం అందించారు. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ చాలా ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లా రెడ్డి విచ్చేశారు.

ఈ సందర్భంగా హీరో శ్రీ హర్ష మాట్లాడుతూ,'ఈ సినిమాని నిర్మించిన మా నాన్న రామస్వామి రెడ్డికి, సినిమాని ఇంత అద్భుతంగా తీసిన డైరెక్టర్ పవన్ కేతరాజుకి ఎంతో రుణపడి ఉంటాను. మణి శర్మ లాంటి మ్యూజిక్ డైరెక్టర్ మా సినిమాకి సంగీతం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే సింగర్ ఎస్పీ చరణ్, నటుడు ప్రవీణ్‌తో కలిసి పని చేయటం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. హీరోగా నాకూ మంచి గుర్తింపు తీసుకొచ్చే సినిమా అవుతుంది' అని అన్నారు.

'ఎస్పీ చరణ్ ఈ సినిమా చేయబట్టే చాలా అద్భుతంగా వచ్చింది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని డైరెక్టర్ పవన్ చెప్పారు.

ఎస్పీ చరణ్ మాట్లాడుతూ,'నా క్యారెక్టర్‌ని అద్భుతంగా డిజైన్ చేసిన డైరెక్టర్ పవన్ కేతరాజుకి ధన్యవాదాలు. ఈ సినిమాతో శ్రీ హర్షకి మంచి సక్సెస్ ఇవ్వాలని ప్రేక్షకులను కోరుతున్నాను. ఇంతమంచి సినిమాలో నేను పాడేందుకు అవకాశం ఇవ్వనందుకు కోపంగా ఉంది (నవ్వుతూ). కానీ ఓ మంచి పాత్ర చేసినందుకు చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు.

మెస్మరైజ్ చేసే యూనిక్ స్టోరీ..



డా. అనిల్ విశ్వనాథ్

'పొలిమేర' చిత్ర విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా '28°C'. నవీన్ చంద్ర హీరోగా నటించగా, షాలినీ వడ్నికట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మించారు. ఏప్రిల్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇద్దరు మెడికల్ స్టూడెంట్స్ మధ్య జరిగే ప్రేమ కథ ఇది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, సూపర్ నేచురల్ షేడ్స్ ఉంటాయి. మెడికల్‌గా 28°C అనే అంశాన్ని కథలో మిక్స్ చేశాం. బ్రెయిన్ డ్యామేజీ అయిన వారు ఎక్కువ వేడి, చల్లదనం తట్టుకోలేరు. అది థియరీగా ఉంది. ఈ అంశాన్ని సినిమా కోసం ఎఫెక్టివ్‌గా ఉపయోగించాం. టైటిల్‌లో కనిపించే ప్రశ్నార్థకం మిమ్మల్ని సినిమా చివరి వరకు క్యూరియాసిటికి గురిచేస్తుంది. యూనిక్ స్టోరీతో, డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో సినిమా ఉంటుంది.
- నవీన్ చంద్రకు స్క్రిప్ట్ చెబితే, ఆయనకు బాగా నచ్చి అంగీకరించారు. జార్జియాలో 25 డేస్ షూటింగ్ చేశాం. ఆ షెడ్యూల్ కోసం మేము పడిన కష్టం మాటల్లో చెప్పలేను. అక్కడ పడిన కష్టాల అనుభవాలతో పుస్తకం రాయాలని అనుకున్నా. ఈ సినిమా రిలీజ్ ఆగిపోయినప్పుడు నా పర్సనల్, ప్రొఫెషనల్ కెరీర్ ప్రశ్నార్థకంలో పడింది. అప్పుడు 'పొలిమేర' స్క్రిప్ట్ చేశాను. ఆ మూవీ బ్లాక్ బస్టర్ కావడంతో 'పొలిమేర 2' చేశాను. 'పొలిమేర'తో వచ్చిన గుర్తింపుతో ఈ సినిమా బాగా రిలీజ్ అవుతుందని నమ్ముతున్నా. నా స్నేహితుడు వంశీ నందిపాటి ఈ సినిమా చూసి, రిలీజ్ చేయాలని ముందుకొచ్చాడు.
- నా నెక్ట్స్ మూవీ 'పొలిమేర 3' త్వరలో సెట్స్ మీదకు తీసుకెళ్తాం. ఇది పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో ఉంటుంది. వచ్చే ఏడాది సంక్రాంతి సీజన్‌కు రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఇందులో ఓ స్టార్ కీలక పాత్రలో నటిస్తారు. నేను షో రన్నర్‌గా నా టీమ్ మెంబర్ నాని కాసరగడ్డ డైరెక్షన్‌లో అల్లరి నరేష్‌తో '12ఎ రైల్వే కాలనీ' మూవీ చేస్తున్నాం. ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాశాను. త్వరలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ చేస్తున్నాను.

సందేశాత్మకంగా 'శివ శంభో'



అనంత ఆర్ట్స్ పతాకంపై బొజ్జ రాజగోపాల్, సుగుణ దోరవేటి నిర్మించిన సంగీత, సాహిత్య విలువలు కలిగిన భక్తి ప్రధానమైన చిత్రం 'శివ శంభో'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ప్రకటించారు. నర్సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం భారతీయ కళలైన సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాం శాలుగా ఉంటూనే సందేశాత్మక ఉంటుంది. ఇటువంటి చిత్రాలను ఉత్తమ అభిరుచి గల ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే ఆశాభావాన్ని ఈటెల రాజేందర్ వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్ళందరికీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. చిత్ర నిర్మాతల్లో ఒకరు, రచయిత, సంగీత దర్శకులు దోరవేటి మాట్లాడుతూ,' ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ప్రేక్షకులు తప్పకుండా మా చిత్రాన్ని ఆదరిస్తారన్న విశ్వాసం ఉంది' అని తెలిపారు. కృష్ణ ఇస్లావత్, కేశవర్ధిని, బేబీ రిషిత హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : బొజ్జ రాజ గోపాల్, దోరవేటి సుగుణ, శ్రీశైలం రెడ్డి, డైరెక్టర్ :నర్సింగ్ రావు, డి ఓ పి: కారె సతీశ్ కుమార్, పాటలు, మాటలు, సంగీతం :దోరవేటి.

భిన్న ప్రేమకథా చిత్రం



ఉదయ్ రాజ్, వైష్ణవి సింగ్

ఉదయ్ రాజ్, వైష్ణవి సింగ్ జంటగా శ్రీ వెంకటేశ్వర ఎంటర్ టైన్మెంట్ పతాకంపై రాజేష్ చికిలే దర్శకత్వంలో నిర్మాత ఎం.బంగార్రాజు నిర్మించిన చిత్రం 'మధురం'. ఎ మెమొరబుల్ లవ్ అనేది ట్యాగ్ లైన్. టీనేజ్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఏప్రిల్ 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

హీరో ఉదయ్ రాజ్ మాట్లాడుతూ, 'శ్రీ వెంకటేశ్వర ఎంటర్ టైన్మెంట్స్ అధినేత బంగార్రాజు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చి, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. దర్శకుడు రాజేష్ అత్యద్భుతంగా తెరకెక్కించారు. కెమెరామెన్ మనోహర్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ వెంకీ వీణ సూపర్బ్ సాంగ్స్ ఇచ్చారు. ఇదొక క్లీన్, యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అందరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమా నాకు టర్నింగ్ పాయింట్ అవుతుంది' అని అన్నారు. '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు ఎలా ఉండేవో నేటి తరానికి కళ్ళకు కట్టిన్నట్లు చూపించబోతున్నాం. ఈ సినిమా ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది' అని దర్శకుడు రాజేష్ చికిలే చెప్పారు. నిర్మాత ఎం.బంగార్రాజు మాట్లాడుతూ,'రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఏప్రిల్ 18న సినిమా విడుదల చేస్తున్నాం. ఇప్పటికే హీరో నితిన్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. సినిమా కూడా అందరికీ నచ్చేలా ఉంటుంది' అని అన్నారు.

'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'



మురళీ మోహన్, ఆమని ప్రధాన పాత్రధారులుగా ఉషారాణి మూవీస్ బ్యానర్ మీద వల్లూరి రాంబాబు నిర్మిస్తున్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'. టి.వి. రవి నారాయణ్ దర్శకుడు. ఈ చిత్ర టైటిల్ పోస్టర్ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు నిర్మాత అంబికా కృష్ణ, దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

దర్శకుడు టి.వి. రవినారాయణ్ మాట్లాడుతూ, 'డొక్కా సీతమ్మ గురించి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు నాలో ఎంతో స్ఫూర్తిని నింపాయి. ఒక అభిమానిగా ఈ సినిమాను తీసి చిరంజీవి, పవన్ కళ్యాణ్‌కి అంకితం చేద్దాం అనుకున్నాను' అని అన్నారు.

'డొక్కా సీతమ్మ వంటి మహనీయురాలి కథతో సినిమాను చేస్తున్నాం. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది. వచ్చిన ప్రతీ ఒక్కరికీ కడుపునిండా అన్నం పెట్టి, పంపేవారు. ఇలాంటి గొప్ప వారి గురించి ప్రస్తుత తరానికి తెలియాలి. ఆమనికి ఈ సినిమాతో జాతీయ అవార్డు రావాలి' అని మురళీ మోహన్ చెప్పారు. ఆమని మాట్లాడుతూ, 'దర్శకుడు డొక్కా సీతమ్మ కథ చెప్పారు. ఇలాంటి పాత్రలను చేయాలంటే రాసి పెట్టి ఉండాలి' అని తెలిపారు.

నిర్మాత రాంబాబు మాట్లాడుతూ, 'డొక్కా సీతమ్మ గారి కథను, చరిత్రను అందరికీ చెప్పాలనే ఉద్దేశంతోనే ఈ సినిమాను తీస్తున్నాం. డొక్కా సీతమ్మగా ఆమని నటన అందరినీ ఆకట్టుకుంటుంది. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు.

మార్చి 31 వరకు ఆస్తి పన్నులు చెల్లించండి

- దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి



నవతెలంగాణ-కీసర

ఉగాది, రంజాన్ పండుగ సెలవు రోజులలో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి తెలిపారు. ఆస్థి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లింపునకు ఎల్ఆర్ఎస్ సంబంధించి ఈనెల 30 ఉగాది పండగ, ఈ నెల 31న రంజాన్ పండుగ సెలవు రోజుల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. దమ్మాయిగుడ మున్సిపల్ ప్రజలు కౌంటర్లలో ఆస్థి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఎల్ఆర్ఎస్ చెల్లించి దమ్మాయిగూడ పట్టణాభి వృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



నవతెలంగాణ- మేడ్చల్

రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజాగారి ఆంజనేయులు శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రజకులకు 250 యూనిట్ల ఉచిత కరెంటు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే రజకులకు ఉచితంగా 250 యూనిట్ల విద్యుత్‌ను పంపిణీ చేయాలని కోరినట్లుగా తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నప్పటికీ కొంతమంది విద్యుత్ అధికారులు రజకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు రజకులను ఇబ్బందులు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

- మత సామరస్యాన్ని రక్షించడానికి కట్టుదిట్టమైన చర్యలు
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉగాది, రంజాన్ పండుగలను సంతోషంగా, శాంతియుతంగా జరుపుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది, రంజాన్, శుభాకాంక్షలను తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రత, జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని జోనల్ డీసీపీలు, ఏసీపీలతోపాటు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నో సున్నితమైన ప్రదేశాలు ఉన్నాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక ప్రార్థనల వంటి కార్యక్రమాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అవసరమైతే రిజర్వు పోలీసులను ఉపయోగించాలన్నారు. పండుగలు ప్రశాంత వాతారణంలో పూర్తి చేసేందుకు మతపెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, వారి సహకారంతో వేడుకల ప్రశాంత వాతారణంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా తమ పండుగలు జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. అన్ని మసీదుల ప్రాంగణాల్లో వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని, అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కల్లోలాలు రెచ్చగొట్టే పాత నేరస్తుల మీద నిఘా వేసి ఉంచాలని, వారు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. షి టీమ్స్ బృందాలు విధుల్లో ఉండాలని సూచించారు. వైషమ్యాలు సృష్టించే సోషల్ మీడియా పోస్టులు పెట్టే వ్యక్తుల మీద తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జీ. నరసింహా రెడ్డి, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్ గౌడ్, ఏసీపీ సీసీఆర్బీ రమేష్, పలువురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతోపాటు ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వంజరి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

వంజరి సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను వంజరి సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ బాగాయత్‌లో వంజరి కుల ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి అమరేందర్, సలహాదారులు ముత్తయ్య, సురేందర్, ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి ప్రవీణ్, నాయకులు జై నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ పండుగ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల ఇమాం, మోజాంలకు బట్టల పంపిణీ చేశారు. ఉప్పల్ నియోజకవర్గ ముస్లింలు ఆనందో త్సాహాల మధ్య కుటుంబ సమేతంగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు



నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలు దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి సీహెచ్ ప్రణీత్ కుమార్ సమక్షం లో శనివారం లెక్కించారు. రూ.7,19,955 ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సంకూరి శ్రీనివాస్ గౌడ్, కార్యనిర్వాహణాధికారి ఎం.వీరేశం, తాళ్ళ వెంకటేష్ గౌడ్, ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రఘుపతి గౌడ్, ఆర్.కే.లక్ష్మీ, నారాయణ, అమరాచారి, ఉమా సేవకురాలు, మహిళా సభ్యులు దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ముస్లింలకు ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ మాసం సందర్భంగా డాక్టర్ ఎస్ఆర్ నగర్ డివిజన్ అన్నపురం కాలనీలోని జామి మసీద్, మహమ్మద్ మసీదులో రియాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరయ్యారు. రియాజ్‌కు పండ్లు తినిపించి ఇఫ్తార్ విందును షురూ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు ముందుస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రియాజ్ అహ్మద్ ఖాన్, జైమిత్ అమిత్ పాషా, జమీల్ ఖాన్, మహమ్మద్ ఇక్బాల్, హిమాం నజీముద్దీన్, మోసిన్ మహమ్మద్, కుమార్ స్వామి, బాలరాజు, షేర్ మణమ్మ, సత్యనారాయణ, రాజు, ప్రమోద్ చారి, తదితరులున్నారు.

పగడాల ప్రవీణ్ కుమార్ మృతి బాధాకరం



- ఫెయిత్ హెూప్ లవ్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ ఇజ్రాయిల్
- చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ నేరేడ్‌మెట్

పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతి బాధాకరమని ఫెయిత్ హెూప్ లవ్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ ఇజ్రాయిల్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని ఫెయిత్ హెూప్ లవ్ మినిస్ట్రీస్ చర్చిలో క్రైస్తవ నాయకులు సెర్ల అనీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ మృతి క్రైస్తవులకు తీరని లోటు అని అన్నారు. ప్రేమతో అందరినీ పలకరించే వారని, అతని అకాల మరణం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం దేవుని సేవలో ఉంటూ అన్ని మతాలవారు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించే మంచి సేవకుడని చెప్పారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో పాస్టర్ కుమార్, నెహెమియా, సంసోను, విజయ రాజు, సెల్వన్, ఉమా,లత, తదితరులున్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఉగాది, రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-చర్లపల్లి

విద్యార్థులకు వివిధ పండుగలు, సాంప్రదాయాలపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ప్రతి పండుగను డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నామని స్కూల్ చైర్మెన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్ తెలిపారు. శనివారం నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో ఉగాది, రంజాన్ పండుగల ముందస్తు వేడుకలను నిర్వహించామని తెలిపారు.

షడ్రుచుల ఉగాది పచ్చడి..
- చైర్మన్ కె.నవనీతరావు

ముందస్తు ఉగాది వేడుకలలో భాగంగా విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మెన్ కె.నవనీతరావు మాట్లాడుతూ.. ఉగాది పండుగ తెలుగువారికి ఎంతో ప్రముఖమైందన్నారు. మామిడి తోరణాలు, షడ్రుచుల ఉగాది పచ్చడి ఈ పండుగ ప్రత్యేకత అన్నారు. తమ విద్యార్థులకు వివిధ పండుగలు, సాంప్రదాయాలపై అవగాహన కల్పించే ందుకు ప్రతీ పండుగను తమ స్కూల్‌లో నిర్వహిస్తున్నా మన్నారు. ఉగాది అందరికీ మేలు జరగాలని ప్రార్థిస్తూ, విద్యార్థులందరికీ షడ్రుచుల ఉగాది పచ్చడి పంచారు. విద్యారులు పచ్చడి ప్రాధాన్యత, నూతన సంవత్సర ఆరంభం, పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలను ప్రదర్శించారు. నూతన సంవత్సరాన్ని శుభమయం చేయాలని ఉపాధ్యాయులు అతిథులు ఆశీస్సులు అందజేశారు.





మత సామరస్యానికి 'రంజాన్'
- మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్

రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్ అన్నారు. రంజాన్ మాసానికి సంబం ధించిన కార్యక్రమంలో ఉపవాస దీక్ష ప్రాముఖ్యత, సహనం, దయ, సేవాభావం వంటి అంశాలపై విద్యార్థు లు ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా మత సామర స్యాన్ని ప్రతిబింబించే సందేశాలను అందించారు. ఈ ఉత్సవాలు విద్యార్థులకు మత సామరస్యభావాన్ని పెంపొందించడంలో సాంస్కృతిక విలువలను అర్థం చేసుకోవడంలో సహాయపడతాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. రంజాన్‌పై విద్యార్థులకు వివ రించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగాగా ప్రజలం దరూ కలిసిమెలిసి ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కమలామనోహర్ రావు, కోర్ ఆపరేషన్స్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్, వైస్ ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

- హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ - చర్లపల్లి

ఈసీఐఎల్ చౌరస్తా సాయిబాబా మందిరంలో శనివారం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై మందిరంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పేద వృద్ధురాలు మాధవరమ్మ కొండూరు విజయ, పడకంటి రామచందర్‌లకు ప్రతినెలా అందజేసే పింఛన్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, రామిని తిరుమలేష్ గుప్తా, గంప కృష్ణ గుప్తా, నంగునూర్ అశోక్ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్తా, వైవియు నాగేశ్వరరావు గుప్తా, బాచెల్లి నవీన్ గుప్తా, చందాసంతోష్ గుప్తా, అమర కృష్ణ గుప్తా, బల్లి శ్రీధర్ గుప్తా, మిరియాల అరుణ్ కుమార్ గుప్తా, ఉప్పల ఆంజనేయులు గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, రాయల శ్రవణ్ గుప్తా, చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, బుస్సా శ్రీనివాస్ గుప్తా, గజ్జల రమేష్ గుప్తా, అర్థం శ్రీనివాస్ గుప్తా, కండె శివ గుప్తా, బెజగం శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజల దాహర్తిని తీర్చ డానికి చలివేంద్రం ఏర్పా టు చేయడం అభినందనీ యని ఎమ్మెల్యే మర్రి రాజశే ఖర్ రెడ్డి అన్నారు. నేరేడ్ మెట్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు జేకే సాయిగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల అంజయ్య, జెఏసీ వెంకన్న, శివ కుమార్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, శోభ, రాజేష్ గౌడ్, సుమన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయం సాధ్యం

- రాచకొండ డీసీపీ పీవీ. పద్మజ
- క్రాంతి కీన్ స్కూల్ విద్యార్థులతో ముఖాముఖీ
- తెలంగాణ ఆర్ఎంఎస్ టాపర్ జె. వైష్ణవికి అభినందనలు



నవతెలంగాణ - జవహర్ నగర్

పట్టుదలతో చదివితే విజయాన్ని సులువుగా సాధించవచ్చని రాచకొండ డీసీపీ పీవీ పద్మజ విద్యార్థుల తో నిర్వహించిన ముఖాముఖిలో అన్నారు. శనివారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో క్రాంతి కీన్ స్కూల్ అండ్ అకాడమీ విద్యార్థులు డీసీపీని కలిశారు. ఇటీవల ఆర్ఎంఎస్ (రాష్ట్రీయ మిలిటరీ స్కూల్) తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా ఎంపికైన జె. వైష్ణవిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణపై ప్రశంసలు కురిపించారు. ఏప్రిల్ 5న జరగనున్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం కొన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నాపత్రాలు 20 నిమిషాల ఆలస్యంగా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని, ఈ ఏడాది జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సైనిక్, నవోదయ, రాష్ట్రీయ మిలిటరీ, వంటి జాతీయ స్థాయి పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్యాణి, డైరెక్టర్ లావణ్య, హచ్‌వోడీ జాకబ్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఎంఈఎస్ కాలనీలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ డివిజన్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. డ్రయినేజీ వ్యవస్థ అవుట్లెట్ లేక ఇబ్బందిగా ఉందని, అంతర్గత రోడ్లు చిందరవందరగా తయారయ్యాయని, పార్కులో ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఏఈ వరుణ్, కాలనీ ప్రెసిడెంట్ మధుకర్, వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, శివ ప్రసాద్, గుప్తా, శివ ప్రసాద్, నారాయణ, హరీష్, స్థానిక నాయకులు యాదగిరి గౌడ్, సాజిద్, భాస్కర్ తదితరులున్నారు.

ముస్లింలకు నిత్యావసర వస్తువులు పంపిణీ



- మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ వెయ్యి మందికి నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో ఐదు కిలోల బియ్యం, చక్కెర, సేమియా, ఆయిల్, డాల్డా, కాజూ, డ్రైఫ్రూట్స్, కందిపప్పు, నెయ్యి శనగపప్పులతో కూడిన కిట్టును ముస్లింలకు అందజేసినట్లు తెలిపారు. మేడ్చల్, గిర్మాపూర్, రైయిలాపూర్, అత్వెల్లి, కిష్టాపూర్, పూడూరు చెందిన ముస్లింలకు ఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సరుకులను అందజేసినట్లు తెలిపారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రి మేడ్చల్ మాజీ సర్పంచ్ చిలకరాజు గతంలో పేదలకు అండగా ఉండేవారిని గుర్తు చేశారు. తన తండ్రి బాటలోనే కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ప్రెసిడెంటు పాషా, కాంగ్రెస్ సేవాదళ్ ప్రెసిడెంట్ రఫిక్, ఇనాయిన్, అంజత్, ఆరీఫ్ ఖాన్, అష్రఫ్, అజ్మత్, రఫిక్, మోనార్క్, మణికంఠ, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని యజమానులు ఇంటి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వసంత ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 ఏడాదికి సంబంధించిన ఇంటి పన్నులు ఈ నెల 31వ తారీఖులోపు చెల్లించాలని, ఆదివారం, సోమవారం సెలవు లేదని, మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. జవహర్ నగర్ ప్రజలు ఇట్టి సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రంజాన్ సందర్భంగా దుస్తులు పంపిణీ..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కార్యాలయం వద్ద, కార్పొరేటర్ ఆధ్వర్యంలో.. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి, డివిజన్‌లో ముస్లిం, ఆడపడుచులకు, నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైందన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దెట్కువ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. డివిజన్‌లో ఉన్న ముస్లిం సోదరులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, మజర్ ఫారూఖ్, ఖలీమ్, బషీర్, నికత్ ఫాతిమా, జబీన్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ మాస సందర్భంగా.. శుక్రవారం మూసాపేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ.జుబేర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కృష్ణ రాజ్ పుత్, శివ చౌదరి, ఎండి సలీం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

నేటి నుంచి సన్నబియ్యం పంపిణీ

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- రేషన్ కార్డుల పంపిణీలో జాప్యం
- జిల్లా వాసుల ఎదురు చూపులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి నుంచి పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. నేడు సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన తర్వాత అన్ని జిల్లాల్లో షురూ కానుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 619 రేషన్ షాపులు ఉన్నాయి. 5,30,590 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి నెలకు దాదాపు 10761.607 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు.

రేషన్ కార్డుల జారీలో జాప్యం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డుల పంపిణీలో వాయిదాల పర్వం కొనసాగుతోంది. కార్డుల కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కార్డుల పంపిణీలో అంతులేని జాప్యం చోటు చేసుకుంటోంది. ప్రజాపాలనలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 1,43,267 మంది కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రాథమికంగా కొందరిని అర్హులుగా గుర్తించగా.. ఇందులో మరికొందరిని ఇటీవల వార్డు సభల్లో లబ్దిదారులుగా నిర్ధారించారు. గుర్తించిన లబ్దిదారులకు కార్డులను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. అర్హులను గుర్తించి నెలలు దాటుతున్నా కార్డుల పంపిణీ మాత్రం ముందుకు సాగడం లేదు. ఇదే సమయంలో చాలా మంది ఇప్పటికీ దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు.

అయోమయం.. గందరగోళం..

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా పేర్కొనగా.. మార్చి మొదటి వారానికి మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కావడంతో కొత్త కార్డులు ఎప్పుడిస్తారో..? అనే గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా మీ సేవా కేంద్రాల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కూడా ప్రారంభం కాలేదు. మార్చి 1న రేషన్ కార్డులు అందజేస్తారని ప్రకటించినా ఇంతవరకు పంపిణీపై స్పష్టత రాలేదు. పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా కార్డుల పంపిణీపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో లబ్దిదారుల్లో అయోమయం కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామనీ, కొత్త కార్డుల ముద్రణ డిజైన్ల ఎంపికలో స్పష్టత రాకపోవడం కూడా జాప్యానికి కారణమని పేర్కొంటున్నారు. కార్డుల కోసం ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి ఉంటోందనీ, పలువురు నిత్యం ఫోన్ చేసి ఎప్పుడిస్తారని అడుగుతున్నారని కొందరు అధికారులు చెబుతున్నారు. కార్డుల పంపిణీకి అధికారికంగా ఉత్తర్వులు ఇస్తే వాటికి అనుగుణంగా రేషన్ కేటాయింపు వంటి ప్రక్రియ చేపట్టనున్నారు. కొత్త కార్డులతో పాటు సుమారు 1,21,696 మంది రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు.

సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడు తోడుంటా..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడు తోడుంటానని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో "దళిత సంఘాల ఐక్యవేదిక -307" నూతన కార్యవర్గం సభ్యులు ముఖ్య సలహాదారులు కిషన్ రావు, గట్టు అశోక్, మజ్జల సత్యనారాయణల ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... దళిత సంఘాల ఐక్యవేదిక నూతన కార్యవర్గం సభ్యులకు ముందుగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మంగ రాంచందర్, ప్రధాన కార్యదర్శి మేకల ఎల్లయ్య, కోశాధికారి జి.జే.రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఎం.సాయిబాబా, గౌరవాధ్యక్షులు సిహెచ్.బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘ సభ్యులు ఒక్కతాటిపై ఉంటేనే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుంది..

కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, సంక్షేమ సంఘం సభ్యులంతా ఒక తాటిపై ఉన్నప్పుడే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని అన్నారు. 125 - గాజుల రామారం డివిజన్ "హెచ్ఏఎల్ వెస్ట్ కాలనీ" వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేండ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్నీ డివిజన్‌లో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ కమలాకర్, సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులు టివి.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయా డివిజన్‌లకు చెందిన ప్రజా ప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సి పాలిటీ, కొంపల్లి మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన దాదాపు 139 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు సుమారు రూ. 47 లక్షల చెక్కులను ప్రజా ప్రతినిధులు, అధ్యక్షులు, నాయకుల అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతీ ఒక్క నిరుపేదను అదుకుంటూ భరోసా కల్పించే నాయకులు, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. అనారోగ్య సమస్యతో ఆస్పత్రుల పాలై ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మహమ్మద్ రషీద్ రఫీ, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, కెఎం.గౌరిష్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలుగు నూతన సంవత్సరం, శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో మీరు అనుకున్న పనులు విజయవంతంగా పూర్తి కావాలని.. జీవితంలో ఎదురైన కష్టాలను ఎదుర్కోని ధైర్యంగా ముందుకు వెళ్లా లని సూచించారు. ఉగాది పచ్చడిలో లాగే తీపి, పులుపు, చేదు, వగరులాగా జీవితంల సమ్మిళితమైందని తెలిపారు. కష్టాలు వచ్చాయని కుంగిపోకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొనే మార్గం ఖచ్చితంగా ఉండే ఉంటుందని దానిని అన్వేషించి ముందుకు సాగాలని కోరారు.

కార్మికులకు పనిగంటలు తగ్గించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్



నవతెలంగాణ-నిజాంపేట

వేసవికాలంలో మున్సిపల్ కార్మికుల పనిగంటలను తగ్గించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల బిందెల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం ఆయన నిజాంపేట వార్డు కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న మున్సిపల్ సిబ్బందికి, పెరుగు తున్న వేసవికాలం దృష్ట్యా పని గంటలు తగ్గించాల్సింది పోయి, అదనపు పనులను అప్పగించడం సరికాదన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కొరకు తరచూ వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకునేటట్టు మున్సిపల్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ కార్మికులు ధరించే దుస్తు లు, చీపుర్లు,టోపీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో నిజాంపేట గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు చెత్త సేకరించే పని మున్సిపల్ కార్మి కులు చేసేవారని, కానీ ప్రస్తుతం అది కాంట్రాక్టర్ రషీద్‌కి వెళ్లడం ఇబ్బం దిగా తయారైందన్నారు. తద్వారా చెత్త సేకరణలో కూడా ఒక మాఫియా లాగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధి కారులు చిన్నచిన్న షాపుల వద్ద కూడా రూ.20 లు వసూలు చేస్తు న్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆయన ఆక్షేపించారు. ఈ కార్య క్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ నాయకులు దుర్గయ్య, నర్సమ్మ, భాగ్యమ్మ, యాదమ్మ, లక్ష్మి, అమృతమ్మ, సూపర్వైజర్ జీతయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మతసామరస్యానికి నిదర్శనం, సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులు దోహదమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. సీనియర్ మైనార్టీ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రషీద్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు సయ్యద్ సాజిద్‌ల ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మద్దుమ్ నగర్ లోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. భారతదేశంలో కులాలు, మతాలు, విభిన్న సంస్కృతులు చాలా గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సీఐ.కేతూరి నరసింహు, ఎస్సై శంకర్, ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు జనార్ధన్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకే.శేఖర్ యాదవ్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నియో గీతాంజలి స్కూల్‌లో ఉగాది సంబరాలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నిజాంపేటలోని నియో గీతాంజలి స్కూల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రాష్ట్రాల సాంప్రదాయ దుస్తులు ధరించి, అందరినీ ఆకట్టుకున్నారు. నియో గీతాంజలి డైరెక్టర్ రమాదేవి, ప్రిన్సిపాల్ రఘుబాలలు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ రఘుబాల, స్కూల్ డైరెక్టర్ రమాదేవిలు మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఉగాది పండుగ యొక్క విశిష్టతలను భవిష్యత్ తరాలకు కండ్లకు కట్టినట్టుగా, పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉగాది పంచాంగాన్ని చదివి, వినిపించి అందరికీ ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్‌లో టీడీపీ సీనియర్ నాయకులు ఉప్పు రాము ఆధ్వర్యంలో.. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు ఉప్పు రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలతో కలిసి, మూసాపేట్ డివిజన్ పరిధిలోని గుడ్షెడ్ రోడ్‌లో, అలాగే శ్రీహరి నగర్‌లో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యకమంలో నేతలు కొత్తపల్లి రాముగౌడ్, పడ్డ వాసుదేవ రావు, జంకుడు రామారావు, అనిల్, మల్లేష్ యాదవ్, గణపతి, మల్లేష్ గుప్తా ,కేఎస్ఆర్ నగేష్, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామోజు శివకుమార్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

శేరిలింగంపల్లి నియోజకవర్గ కూకట్‌పల్లి, దీనబంధు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర, కూకట్‌పల్లి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీరామోజు శివకుమార్, రాష్ట్ర నాయకులు పాతూరి వెంకట్రావు ఆధ్వర్యంలో.. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నాయకులు ఎస్ఎస్ రాజు, సిద్దయ్య, రాంబాబు, శ్రీనివాసరావు, భీమ్, తిమ్మప్ప, శేఖర్ రెడ్డి, సీత ,అర్జున్, సరోజమ్మ సాయిరాం, సందీప్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కవుల గళం జాలువారే ప్రతీ అక్షరం విలువైనదే



ప్రముఖ కవి సామ్రాట్ డాక్టర్ ఆలపాటి చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఉత్సాహంగా "ఉగాది కవి సమ్మేళనం"

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కవుల గళం నుంచి జాలువారే ప్రతి అక్షరం ఎంతో విలువైందని ప్రముఖ కవి సామ్రాట్ డాక్టర్. ఆలపాటి అన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని చైతన్య కళానికేతన్ సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు,ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యానికేతన్ పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి,ప్రధాన కార్యదర్శి వాకిటి రామ్ రెడ్డి ల ఆధ్వర్యంలో "శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళన" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన తోపాటు ప్రముఖ సుప్రసిద్ధ కవులు గంటా మనోహర్ రెడ్డి,కేఎల్. కామేశ్వర రావు, మోటూరి నారాయణ రావు,కూర్మాచలం శంకరస్వామిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావంలోని గొప్ప అర్థాలను బాహ్య ప్రపంచానికి చెప్పే మేధావులు కవులు అని అన్నారు. రవి కాంచని చోట కవి ప్రకాశి స్తాడని అంతటి గొప్ప ఆలోచనా శక్తితో కవితలు రచించి మెప్పించడం కవులకే సాధ్యమని వ్యాఖ్యానించారు. దశాబ్దాల నాటినుండి నేటి వరకు తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ వాటి విశిష్టతలను కవితల రూపంలో వర్ణించడం నభూతో భవిష్యత్ అన్నారు. గత 3 దశాబ్దాలుగా ఎంతోమంది కవులను, కళాకారులను ఒకే వేదిక పైకి రప్పించి వారిలోని కవిత కళా నైపుణ్యాన్ని పది మందిలో పరిచయం చేస్తున్న నిర్వాహ కులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.రాష్ట్రంలో చాలామంది పేద కవులు ఆర్థిక ఉపాధి,సరైన ఆదరణ లేక దయనీయ పరిస్థితిలో వున్నారని అటువంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాలని కోరారు.పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా కవితల ప్రాచుర్యం ప్రమాదపుటంచుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.చరవానికి ఎంత దూరం ఉంటే అంత ఆయుష్మంతుడు అవుతారని చెప్పారు.నేటి యువతరం చైతన్యవంతులై కవితల్లోని కమ్మదనాన్ని తెలుసుకొని భావితరాలకు వివరించాలని పునరుద్ఘాటించారు. అనంతరం చైతన్య కళానికేతన్ సాహితీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శివరాత్రి యాదగిరి వాకిటి రామిరెడ్డిలు మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా కళా రంగం, విద్యారంగం మక్కువతో ఆయా రంగాల్లో నైపుణ్యం పెంచుకొని కవులకు, కళాకారులకు తమ వంతుగా సేవా కార్యక్రమాలు చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నామన్నారు. అనంతరం 50 మంది కవులు వారి వారి కవితా పాటవాలను వివరించి మంత్రముగ్ధులను చేశారు.ఈ సందర్భంగా చైతన్య కళానికేతన్ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను, కవులను శాలువాలతో సన్మానించి మేమేంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు మేడ రాజేశ్వరి, చల్లా సురోజిని,వేముల జ్యోతి, గౌతమి,డాక్టర్ వంగరి విష్ణు, డాక్టర్ సృజనాకర్, శ్రీహరి డేగేకార్, కాంతారెడ్డి, వేముల సత్యనారాయణ, అమృత్ రెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- కాంగ్రెస్ నేత ఎం.యుగంధర్ రెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రజానీకానికి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులకు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. తెలుగు ప్రజల ఉగాది పండగ, తెలుగు ప్రజల నూతన సంవత్సరం వేడుకలు ప్రారంభంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలని, దినదినం అభివృద్ధిచెందుతూ మంచి మార్గములో నడుచుకుంటూ పది మందికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపును ఇచ్చారు. ఉగాది పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి మరింత ముందుకు దూసుకు పోయేందుకు కార్యకమాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- మున్నంగి కిరణ్ రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలుగు ప్రజలకు మున్నంగి కిరణ్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఉగాది పండుగను తెలుగు ప్రజలు వైభవంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలకు అన్ని శుభాలు కలగాలని ఆయన కోరుకున్నారు. షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయ్యే శ్రీ విశ్వావసు సంవత్సరంలో ప్రతి ఇంట్లో ఆయురోగ్యాలు, సిరిసంపదలు, ఆన ందాలు, నిండాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాలు సర్వతో సుఖీ సుభిక్షంగా ఉండాలని పల్లెలు పట్టణాలు కళకళలాడాలని, తెలుగు సంస్కృతి సంప్రదా యాలు కలకాలం వర్ధిల్లాలి అన్నారు. ప్రతి ఇంట్లో పత్తి ఒకరు సంప్రదాయ బద్ధంగా ఉగాది పండుగను జరుపుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్‌లో కార్పొరేటర్ పండా ల సతీష్ గౌడ్ స్థానిక సమస్యల పరిష్కారించేం దుకు కృషి చేస్తానని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కమ్యూనిటీ హాల్‌ను కాలనీవాసులకు అందు బాటులో తీసుకువస్తామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదని, వాటి సమస్యతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత విద్యుత్ అధికారులతో చర్చించి.. అతి త్వరలో విద్యుత్తు సమస్యను పరిష్కరిం చి మూడు స్తంభాలను కూడా వేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సమతా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింలు, సతీష్ గౌడ్, కేబీఎస్, నారా యణ, ఇ.లింగస్వామి, కె.యాదగిరి, కె.భాస్కరరావు, పి.సుకృత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా పనుల పరిశీలన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనలను నిర్వహించేందుకు ఎస్పీఆర్‌హిల్స్‌లోని మైదానంలో సిద్ధమవుతున్న ఈద్గా పనులను రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకీయ సుల్తానా, ఈఈ రాజకుమార్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది ముస్లిం సోదరులకు మరికొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్టు సీఎన్ రెడ్డి తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వహిదర్, కాంట్రాక్టర్, డివిజన్ నాయకులు, మన్సూర్, ఇక్బాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు సరి కాదు

- డాక్టర్ ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

దేశంలో క్రైస్తవులపై దాడులు రోజూ రోజూకి పెరిగిపోతున్నాయని, క్రైస్తవులను హింసించోద్దని, సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. క్రైస్తవులు మంచి మార్గాన్ని బోధిస్తున్నారని మతాన్ని మార్చడం లేదని చెప్పారు. క్రైస్తవులపై దాడులు చెయ్యడం ఎంత వరకు సమంజసమని, ముందుగా మనమందరం భారతీయులం. కులం, మతం అంటూ కొట్టుకుచస్తుంటే భావి తరాలకు మనం ఏం నేర్పిస్తునట్టని, మనం అందరం కలసి జీవించడం, ప్రేమను పంచడం నేర్చుకున్నప్పుడే, మన దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. మత నాయకులు ప్రేమను బోధించాలి తప్ప విద్వేషపు విత్తనాలు నాటడం సరికాదని కులాలు మతాలు వేరైనా మనమఅంత భారతీయులం అని ఇకనైనా ఒకరిని ఒకరు ప్రేమిస్తూ దేశ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను వసూలు

- జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

14 ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నును వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిష్కరించి, ఎర్రగడ్డలోని యజమాని వద్ద నుంచి శనివారం రూ.56 లక్షల 87 వేల 848 యూసుఫ్ గూడా జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జకియ సుల్తానా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని వసూలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. వన్ టైం సెటిల్మెంట్ ద్వారా వడ్డీలు పెనాల్టీలు తగ్గిస్తున్నామని, దీనిని ఇంటి యజమానులు వినియోగించుకొని నేడు లేదా రేపు ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. సెలవు దినాలు అయినప్పటికీ టాక్సీ వసూలు చేయుటకు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి ఆస్తి పన్ను చెల్లించని వారి స్థలాలను సీజ్ చేస్తామని బకాయి దారులను హెచ్చరించారు.

పేదల వైద్య సేవలకు సహకారం



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)ను నిరుపేదలు వైద్యానికి ఉపకరించేలా కృషి చేశామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 60 మంది రోగులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను సీతాఫల్‌మండీలోని ఆయన కార్యాలయంలో శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు నాణ్యమైన భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని పద్మారావు గౌడ్ అన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్‌మండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నాని పేర్కొన్నారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా ఆదుకోవాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు రూ.25 వేలు పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పింది. ఆ విధంగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమకుర్తి శ్రీనివాస్ అన్నారు. వారు చేపట్టిన బస్సు యాత్ర శనివారం ఖైరతాబాద్‌కు చేరుకుంది. ఖైరతాబాద్ నేతలు జెట్టి విజయకుమార్, నక్క రఘు బస్సు యాత్రకు స్వాగతం పలికారు. ప్రభుత్వం ఇకనైనా న్యాయం చేయాలని కోరారు.

టీడీపీకీ పూర్వవైభవం తీసుకొస్తాం..




- వల్లారపు శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే పరమావధిగా పనిచేస్తామని టీడీపీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ్వాన్ని సీతాఫల్‌మండీ డివిజన్ తెదేపా అధ్యక్షుడు జివి క్రిష్ణ నామాలగుండు కూడలిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యలక్రమంలో ముఖ్య అతిధులుగా నందమూరి రామకృష్ణ, తెదేపా సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ విచ్చేసారు. నందమూరి రామకృష్ణ పార్టీ పతకావిష్కరణ చేసి, కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, నాయకురాళ్లకు తినిపించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. అన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన పార్టీ టీడీపీ పార్టీ అని, ప్రాంతాలు వేరైనా తెలుగువారి అంతరంగం ఒక్కటేనని చాటిన వ్యక్తి ఎన్‌టీఆర్ అన్నారు. టీడీపీని ఈ గడ్డపై అభివృద్ధి వైపు నడిపేందుకు పుట్టిన పార్టీ తెలుగు దేశం అని, కార్యకర్తల పార్టీ అంటేనే తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు



- బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ ప్రముఖ ఐటీ అండ్ ఈ-సెక్యూరిటీ సంస్థ బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ తమ కార్యాలయంలో తెలుగు వారి నూతన సంవత్సరోత్సవం ఉగాదిని 200 మందికిపైగా ఉద్యోగులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని తెలుగు జాతి సంస్కృతిని కాపాడేలా సంబరాలను జరుపుకునానరు. ఆఫీస్‌ను మామిడి ఆకులు, పువ్వులతో అందంగా అలంకరించారు. ఉద్యోగులు ఉగాది పచ్చడి, ప్రత్యేక వంటకాలను ఆస్వాదిస్తూ ఉగాది ప్రత్యేకతను గుర్తు చేసుకున్నారు. జీవితం పలు రుచులతో కూడినదని తెలియజేస్తూ, ఈ విందు ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా, సంస్థ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు స్టేక్ హోల్డర్స్‌కు ఉగాది హాంపర్లను అందజేసి, సామూహికత కృతజ్ఞత భావాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ రాజశేఖర్ పాపోలు మాట్లాడుతూ.. 'ఉగాది కొత్త ఆశలతో, సమృద్ధి, సానుకూలతలతో నిండిన శుభప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. తమ సంస్థ, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ, బలమైన కార్పొరేట్ మూల్యాలను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని ఉగాది వంటి పండుగలను జరుపుకోవడం మా టీమ్ ఐక్యతకు వర్క్ మరింత బలపరచి, సమగ్రత విలువలను పెంపొందించడానికి తోడ్పడుతుందన్నారు.

ఓయూలో ఉద్యమాల నిషేధం రాజ్యాంగ విరుద్ధం

- తక్షణమే సర్క్యులర్ రద్దు చేయాలి
- నిరసన దీక్షలో ఓయూ ప్రొఫెసర్‌లు



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ సర్క్యులర్ ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఓయూ ప్రొఫెసర్లు అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సర్క్యులర్ రద్దు చేయాలని, ఓయూ విద్యార్థుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలను ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్, ఓయూ పూర్వ విద్యార్థి నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ పూల మాల వేసి దీక్షలను ప్రారంభించారు. ఓయూ ప్రొఫెసర్, పాలమూరు యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ రీసెర్చ్ స్కాలర్, సీతాఫల్‌మండీ డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, ఓయూ పూర్వ విద్యార్థి నేత సత్యవతి విద్యార్థుల నిరసన దీక్షకి మద్దతు తెలిపి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఓయూ విద్యార్థి నేతలు, ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. చరిత్ర గమనంలో ఓయూ అధ్యయనంలో, పోరాటంలో అగ్ర గ్రామిగా ఉన్నదని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగిన ఎదిరించి నిలిచి బాధితులకు భరోసా ఇచ్చే గొప్ప చరిత్ర ఉస్మానియా సొంతమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక నిర్బంధాలను ధిక్కరించి తెగువతో పోరాడిందని గుర్తు చేశారు. మూడేండ్ల అధికారంలో ఉండే వీసీ రాజ్యంగా విరుద్ధంగా సర్క్యులర్ ఇవ్వడం పరిపాలనలో అజ్ఞానాన్ని తెలుపుతుందని తెలిపారు. విశ్వ విద్యాలయాలు భావ సంఘర్షణ కేంద్రాలని, మేధో మధనాలు, చర్చలు, నిరసనలు విశ్వ విద్యాలయంలో అంతర్భాగమని తెలిపారు. వర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, వర్సిటీలు ముందుకు రానపుడు విద్యార్థులు తమ నిరసనను వ్యక్తంచేస్తారని దానిని మానవతా దృక్పథంతో వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ చూడాలని అన్నారు. కానీ నేడు ఓయూలో దానికి విరుద్ధంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంలో జోక్యం చేసుకొని విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ సర్క్యులర్ వచ్చిన నేపద్యంలో రాజ్యాంగ విరుద్ధమైన ఈ సర్క్యులర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి బహిరంగం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, డీబీఎస్ఏ, బీఆర్ఎస్వీ, టీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, అంసా, ఎస్ఎస్‌యూ, జేవీఎస్, స్పోర్ట్స్ ఫెడరేషన్, డీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, ఎస్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి విభాగం, తెలంగాణ గిరిజన శక్తి, బీఎస్ఎఫ్, ఏఎస్‌యూ, ఓయూ జాక్, టీడీఎస్ఎఫ్, ఎంఎస్‌యూ, ఎంఎస్‌ఏ తదితర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

మైదానాల అభివృద్ధికి రూ.24 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే శ్రీ గణేష్
- పోలీసులు, మీడియా మధ్య క్రికెట్ మ్యాచ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ప్రాంతంలో క్రీడా మైదానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 24 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. శనివారం ఏవోసీ సెంటర్ లోని..తాపర్ కారానా పోలీసులు కంటోన్మెంట్ మీడియా జట్ల మధ్య జరిగిన 20 20 క్రికెట్ మ్యాచ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా మైదానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 24 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వివరించారు. పోలీసు, మీడియా క్రీడాకారులు కలిసి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేతో పాటు తిరుమలగిరి ఏసీపీ రమేష్, బోయిన్ పల్లి మార్కెట్ మాజీ చైర్మెన్ టీఎన్ శ్రీనివాస్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ డీ. శ్రీనివాస్, తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు. కారానా సీఐ రామకృష్ణ, ఎస్సైలు లకన్ రాజ్, రవికుమార్, నరేష్, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రమేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, హరిబాబు, శ్రీరామ క్యాటర్స్ ప్రతినిధి, నాగభూషణం రెడ్డి, మీడియా టీం కెప్టెన్ వంశీ, సుధీర్, ఎల్లేష్, వెంకట్, మాణిక్యాల రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను ఎండ గట్టాలి



- ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జై బాపు-జై భీం-జై సంవిధాన్ అభియాన్ అక్రమాన్ని శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలో తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యకమానికి నియోజకవర్గ కోఆర్డినేటర్ రాష్ట్ర వైశ్య కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత అతిధిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని, రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలు ఇతర విషయాలుపై ఆమె కార్యకర్తలకు వివరించారు. శ్రీ గణేష్ మాట్లాడుతూ.. కార్యకర్తలు అందరూ నిబద్ధతతో పనిచేయాలని జై భీమ్, జై బాపు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని సూచించారు. బీజేపీ చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, బీజేపీ కుట్రలను ఎండ గట్టాలని ఎమ్మెల్యే అన్నారు. బీజేపీ స్వార్థపూరిత రాజకీయాలు చేస్తుందని, మతం కులం పేరు మీద దేశాన్ని విడదీసే రాజకీయాలు చేస్తుందని వారి మాయలో పడకుండా దేశాన్ని కాపాడు కోవాలని కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ విధానం మానవత్వం అని, కులాలు మతాలు అన్నింటికన్నా మానవత్యం గొప్పదని, ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే చెప్పారు.

'హౌసింగ్' సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో హౌసింగ్ స్కీంకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ స్కీంలపై శనివారం సితాఫలమండీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో అన్నారు. లాలాపేటలోని చంద్రబాబు నగర్‌లో గతంలో నిర్మించిన ఇండ్లు శిథిల స్థితికి చేరిన పరిస్థితిపై పద్మారావు గౌడ్ అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. అపాయకరంగా ఉన్న ప్రాంగణాల్లో ప్రజలు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయి నగర్‌లో నిర్మాణం పనుల్లో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మరాఠా బస్తీలో కొత్త ఇండ్లను నిర్మించాలని, దోభీ ఘాట్, సుబాష్ చంద్ర బోస్ నగర్, ఆజాద్ చంద్ర శేఖర్ నగర్‌లలో లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని సూచించారు. హమాలి బస్తీలో వివాదాలు పరిష్కరించాలని, శాస్త్రి నగర్, లబ్ది బస్తీల్లో శిథిల స్థితి చేరిన భవనాల పునర్నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సికింద్రాబాద్ హౌసింగ్ సెల్ ఏఈ. క్రాంతి, అధికారులు మల్లికార్జున్, కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, కంది శైలజ, రాసురి సునీత రమేష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ డ్రైవర్లపై ప్రత్యేక తనిఖీలు

- ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నీటి ట్యాంకర్లు భారీ వాహనాలు కనుక వాటి డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదం జరిగే అవకాశం చాలా ఎక్కువ ఉన్నందున గతంలో చాలా ప్రమాదాలు సంభవించాయి. అందువల్ల వారిపై మరింత నిఘా ఉంచి ప్రత్యేక తనిఖీలు చేస్తూన్నామని ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో మూసపేటకు చెందిన శ్రీవాణి వాటర్ సప్లై కేంద్రానికి చెందిన ఒక ట్యాంకర్ నంబర్ TS09 UE4113 డ్రైవర్‌కు శ్వాస విశ్లేషణ పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించినట్టు రావడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేయశారు. ఈ తనిఖీలు నిత్యం ఉంటాయని నీటి ట్యాంకర్ల యజమానులు తమ వాహనాలు ఇచ్చే ముందు నిర్ధారణ చేసుకోవాలన్నారు. పట్ట పగలు మద్యం సేవించి ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లతో పాటు యజమానులపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ సైదులు వాటర్ ట్యాంకర్ యజమానులను, డ్రైవర్లను హెచ్చరించారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన జంపన



నవతెలంగాణ-కంటోన్మెంట్

అమావాస్య పురష్కరించుకొని శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బాపూజీనగర్ శ్రీ దేవి నల్ల పోచమ్మ ఆలయం, జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ, చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. అమావాస్య రోజు శివుని పూజతో పాటు పితృదేవతలని సంతృప్తి పరిస్తే అనుకున్న కార్యాలు నెరవేరు తాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ భాటియా, శ్రీకాంత్, దుర్గయ్య, రామారావు, పుట్టి నర్సింహా, నరేందర్, జహంగీర్ గౌడ్, రాముగౌడ్, శశిధర్ గౌడ్, అనిల్, శ్రీనివాస్ గౌడ్, జాజుల క్రాంతి, విట్టల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్ శంకర్‌కు జ్యూడిషియల్ రిమాండ్



నవతెలంగాణ-అంబర్‌పేట్

యూట్యూబర్ శంకర్‌కు కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో అతన్ని పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. న్యూస్ లైన్ యూట్యూబ్ చానెల్ నిర్వాహకుడు శంకర్ తనను మోసం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. శంకర్ తనను పెండ్లి చేసుకుంటానని నమ్మించి, తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. అంతేగాక పెండ్లి చేసుకోమని అడిగినందుకు బెదిరింపులకు గురి చేస్తున్నాడని, తన వ్యక్తిత్వాన్ని కించ పరిచేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నాడని ఆ యువతి అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శంకర్‌ను తన నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. గతంలో కూడా శంకర్‌పై పలు కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం పోలీసులు శంకర్‌పై ఐటీ యాక్ట్ సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. యువతి ఫిర్యాదును పరిశీలించిన కోర్టు శంకర్‌కు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌ను విధిస్తున్నట్టు తెలిపింది. దీంతో పోలీసులు శంకర్‌ను చంచల్ గూడ జైలుకు తరలించారు.

సామజిక న్యాయానికి కేరాఫ్ 'టీడీపీ'

- తలారి.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఓయూ

సామాజిక న్యాయానికి కేరాఫ్ టీడీపీ అని తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ అని చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్కూల్ ఆఫ్ సీబీఎన్ జాతీయ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉదయం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ అండ్ స్కూల్ ఆఫ్ సీబీఎన్ ఆధ్వర్యంలో టీడీపీ 43వ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగు ప్రజల ఆత్మ గౌరవ సామాజిక న్యాయ' దినోత్సవం పేరిట 3కే రన్‌ను నిర్వహించారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన పార్టీ అన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్‌సీసీ గేటు వరకు రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రన్‌లో గెలుపొందిని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

అమీర్‌పేట్‌లో బైక్‌ను ఢీకొన్న కారు


- మద్యం సేవించి కారు నడిపిన బ్యాంకు ఉద్యోగి
- రంజాన్ షాపింగ్‌కు బైకుపై వెళుతున్న దంపతులకు గాయాలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అమీర్‌పేట్ చౌరస్తా వద్ద శనివారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తున్న దంపతులను మద్యం మత్తులో బ్యాంక్ ఉద్యోగి కారుతో ఢీ కొట్టాడు. ఈ సంఘటన మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. గాజుల రామారంలో ఉంటున్న ముస్లిం దంపతులు షేక్ షరీఫ్, అతని భార్య సాల్మన్ బేగం శనివారం, చార్మినార్ వద్దకు వెళ్లి రంజాన్ షాపింగ్ చేసుకొని గాజులరామారం వెళ్లే క్రమంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అమీర్‌పేట్ చౌరస్తా ఎస్సార్ నగర్ ఇండస్ఇండ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న పిన్నోజు సాయి కృష మద్యం సేవించి కారుతో బైక్‌పై వెళ్తున్న దంపతులను ఢీకొట్టాడు. కింద పడిపోయిన దంపతులకు ఇద్దరికీ కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు కావటం జరిగింది. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు మధుర నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి, గాయపడిన దంపతులను 108 అంబులెన్స్‌లో ఎర్రగడ్డలోని సెంట్ తెరిసా హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన దంపతులకు ప్రాణాపాయం లేదని హాస్పటల్ వైద్యులు తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మద్యం సేవించి రేష్ డ్రైవింగ్ చేసిన బ్యాంకు ఉద్యోగి సాయి కృష్ణను అరెస్ట్ చేసి, మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, అతనిపై పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరచి రిమాండ్కు తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వాహనాలు నడిపే వారిని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.

42శాతంలో ఏంబీసీలకు 21శాతం కోటా ఇవ్వాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల 42శాతం రిజర్వేషన్లలో ఏంబీసీలకు 21శాతం కోటా కేటాయించాలని తెలంగాణ ఏంబీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఐతరాజు అభేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 136 బీసీ కులాల్లో 70 కిపైగా ఏంబీసీ కులాలున్నాయని బీసీ బడ్జెట్లలో ఏంబీసీల అభివృద్ధికి 50శాతం నిధులు కేటాయించాలని, సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఇండ్లు లేని ఏంబీసీలకు ఇంటి స్థలంతోపాటు ఇండ్లు నిర్మించి నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను కలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గంగపుత్ర యువజన సంఘం నాయకులు అంబటి సుధాకర్, ఏంబీసీ సంఘం నేతలు అమంచి అంజయ్య, కొండ్రాతి అంజయ్య, దామర నాగేశ్వరరావు, నలపరాజు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'కులం ఆదాయం ధ్రువీకరణ పత్రాలను త్వరగా జారీ చేయాలి'



నవతెలంగాణ-అంబర్‌పేట

కులం ఆదాయం ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీ ఆలస్యం కాకుండా త్వరగా జారీ చేయాలని బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ అన్నారు.శనివారం తహసీల్దార్ వీరాబాయికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలను పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి నాయకులు నజయ్ ముదిరాజ్, నరేంద్ర ముదిరాజ్,బొట్టు మహేష్ గౌడ్, సురేష్ ముదిరాజ్, దశరథ్, సాయి, రాజేష్, ఫెరోజ్, కాశి, రోహిత్.తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలు సమయం పొడిగింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో రైలు నడిచే సమయాన్ని పొడిగిస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం ఆఖరి రైలు రాత్రి 11 గంటల వరకే అందుబాటులో ఉండగా ఇప్పుడు ఈ సమయాన్ని రాత్రి 11.45 గంటల వరకూ పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులో ఉండనున్నట్టు చెప్పారు. అయితే ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకే ఈ సమయ వేళలు అమలులో ఉండనున్నాయి. అంతేకాక ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న సూపర్ సేవర్ హాలిడే ఆఫర్ మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు 20 ట్రిప్పుల డబ్బులతో 30 ట్రిప్పులు వెళ్లే ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించారు.

యూనిఫాంలు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలి

- ప్రతి విద్యార్థికీ నూతన యూనిఫాం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- జూన్ 2 నాటికి యూనిఫాంలు పాఠశాలలకు చేరాలి
- విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల రీ ఓపెనింగ్ రోజున ప్రతి విద్యార్థి స్కూల్ యూనిఫామ్స్ తో పాఠశాలలకు రావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్ తో కలసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 772 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 1,03,912 మంది విద్యార్థిని విద్యార్థులకు రెండు జతలు చొప్పున స్కూల్ యూనిఫాంలు నిర్దేశించిన సమయం నాటికి అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ముందుగా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ అధికారులు నాణ్యమైన క్లాత్‌ను ఏప్రిల్ 3 నుండి 5 వరకు విద్యాశాఖకు అందించాలని సూచించారు. జిల్లాలోని మండలాల వారీగా స్వయం సహాయక సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టేందుకు సంఘాలకు అప్పగించాలని అలాగే విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థి పాఠశాలల రీఓపెనింగ్ రోజున నూతన యూనిఫామ్ తో వచ్చేలా దుస్తులు అందచేస్తున్నందున అదిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు యూనిఫామ్స్ స్టిచ్చింగ్ చార్జీలు రూ.ఒక కోటి 50 లక్షలు చెల్లించటం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల దుస్తుల సంఖ్య వివరాలను అందరి వద్ద ఉండాలని అలాగే ఏ ఒక్క విద్యార్థికి కూడా దుస్తులు అందలేదని కంప్లైంట్స్ రావద్దని సూచించారు. పాఠశాలల రీఓపెనింగ్ సమయం ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున స్వయం సహాయక నైపుణ్యత గల టైలర్లతో సంఘాలకు యూనిఫామ్ ల కటింగ్, స్టిచ్చింగ్ లపై శిక్షణ ఇప్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో ఆర్ రోహిణి, వివిధ శాఖల సంక్షేమ అధికారులు డిప్యూటీ డిఈఓ లు, డిపిఓ లు, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అల్ట్రాసౌండ్ యంత్రం సీజ్

- ఏడీఆర్ హాస్పిటల్‌లో తనిఖీలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి డివిజన్ మిర్యాలగూడ ప్రాంతంలో ఉన్న మనోహర్‌రెడ్డి పాలీ క్లినిక్‌లో అల్ట్రాసౌండ్ యంత్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. అలాగే ఆనంద్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ఈడీఆర్ హాస్పిటల్‌లో తనిఖీలు నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టస్ సి.ఉమా గౌరీ, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్‌తో కలిసి ఆయా క్లినిక్స్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అందుబాటులో లేకపోవడం, సరిగ్గా వైద్యులు సంతకం చేయని నివేదికలు, తప్పనిసరి రిజిస్టర్‌లను నిర్వహించకపోవడం, ఆన్‌లైన్‌లో సమర్పించకపోవడం, ఎంట్రీలు చేయకపోవడంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద కింద నిబంధనలు, సెక్షన్ల ప్రకారం సీజ్ చేశారు.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT
AT: HYDERABAD
O.S.No.2408 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri.K.John Subba Rao, ...Defendant

To
Sri.K.John Subba Rao, S/o.K.Immanuyelu, Aged about 48 Years, Occ: Business, R/o. H.No.8-2-603/B/34/93, Singadi Basti Road No.10, Banjara Hills, Hyderabad-500034.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs 2.20.386-75ps_to_wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 07-04-2025.

In case of your failure to attend before the Court on 07-04-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate Advocates,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village,
HYDERABAD-50.
Counsel for the Plaintiff,

IN THE COURT OF THE HON'BLE, I ADDL.DISTRICT JUDGE AT: SANGAREDDY
I.A.NO. 57 OF 2024
IN
O.S. NO. 207 OF 2022

Between:
Smt. Mamatha and another. ...Petitioners/Plaintiffs

AND

K. Ashok Reddy & others ...Resp's/Def's/Proposed Resp's 7 to 18

To,
SunkaraMuralidhar S/o.late Subba Rao, Aged 48 years, Occ: Business, R/o.Plot No.1387, Apuroopa Township, Pragathinagar, Opp: JNTU Kukatpally, Hyderabad. ...Respondent No.7

M.Vijaya Laxmi W/o.M.Hanumanth Reddy, Aged 60 years, Occ: House Holder,R/o. H.No.1-7-355 near Sagar Lal Hospital, Bakaram,Musheerabad, Hyderabad, 500020 ...Respondent No.13

Notice

Take notice that, the plaintiff filed the civil suit, suit for partition and separate possession in respect of suit scheduleproperties against the respondents/defendants and others and the same is posted to 22-04-2025 at 10.30 a.m., for your appearance before the Hon'ble I Addl District & Sessions Judge at Sangareddy, hence you are hereby directed to appear either in person or through an advocate. In default of your appearance on that day the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT//
Sardar Jasbeer Singh
M. Maheshwari
Advocates, Hyderabad
Cell: 9642161115

'నీటి సంరక్షణ పద్ధతులను వివరించే థీమ్ పార్కు బాగుంది'

- జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్‌కి చెందిన ఏడుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్ బృందం జలమండలిని సందర్శించింది. ఒకరోజు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి విచ్చేసి జలమండలి కార్యకలాపాల గురించి వారు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహానగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతో పాటు నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్ కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. నగర ప్రజలకు సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేసే విలువైన నీటిని వృథా చేయకుండా జలమండలి ఎప్పటికప్పుడు చేపట్టే అవగాహన కార్యక్రమాల్ని వివరించారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను వివరించే థీమ్ పార్కును జలమండలి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ థీమ్ పార్కులో భవిష్యత్తు తరాలకు వాన నీటిని ఎలా ఒడిసి పట్టాలో తెలిపే వివిధ పద్ధతుల్ని ఉన్నట్లు వివరించారు. వీటితో పాటు రాబోయే 25 ఏండ్లలో చేపట్టే భవిష్యత్తు కార్యాచరణ గురించి కూడా తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సమ్మర్ ఆక్షన్ ప్లాన్ లతో వేసవిలో హైదరాబాద్ నగరంలో తాగునీటి ట్యాంకర్ బుకింగ్ సరళి డెలివరీ వివరాలతో పాటు గత ఏడాదికంటే 60 శాతం పెరిగినా 98 శాతం ట్యాంకర్లను 24 గంటల్లో డెలివరీ చేస్తున్నట్టు వివరించారు. అలాగే జలమండలి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ-హైదరాబాద్ స్పెషల్ డ్రైవ్" కార్యక్రమం గురించి వివరించారు.. జలమండలి పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది, అధికారులు సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో పూడికతీత పనులు రోజూ చేపడుతున్నారని అన్నారు. ఒకవైపు రోజూ వారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుకుంటూనే మరోవైపు స్పెషల్ డ్రైవ్ కు సంబంధించిన పనులు చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రోగ్రామ్ లో ఇప్పటిదాకా 24,001 ప్రాంతాల్లో పనులు నిర్వహించారని, అందులో 3,156 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 248.1 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారని వివరించారు. అలాగే ఈ కార్యక్రమం చేపడంవల్ల ఎంసీసీ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు తగ్గినట్టు ఈడీ చెప్పారు. ఈఎన్సీ అండ్ డైరెక్టర్ ఆపరేషన్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్ జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ ఐటీతో పాటు.. ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్- 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగుశుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్స్-1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సిజిఎం (పి అండ్ ఏ) మహ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించింది టీడీపీ

- పార్టీ సీనియర్ నాయకులు ఎడెల్లి భాను ప్రకాష్

నవతెలంగాణ-అంబర్‌పేట

బడుగు బలహీన వర్గాలకు రాజకీయంలో అధిక ప్రాధాన్యత ఇస్తూ చట్ట సభలో అవకాశం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని సీనియర్ నాయకులు ఎడెల్లి భాను ప్రకాష్ అన్నారు, టీడీపీ ఆవిర్భావం దినోత్సవ పురస్కరించుకొని బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని రెడ్ బిల్డింగ్ ఎక్స్ రోడ్లో లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది యువకులకు, యువతులకు రాజకీయంగా అవకాశం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎడెల్లి సత్యనారాయణ, కిరణ్ కుమార్, దశరథ్, కిరణ్ కుమార్, అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం అశోక్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పీ..సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. పొలిటి బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటగా పార్టీ పతాకావిష్కరణ గావించి, వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అరవింద్ కుమార్ గౌడ్ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రాష్ట్రాలతోపాటు ప్రపంచంలోని తెలుగువారితోపాటు, పార్టీ కార్యకర్తలు నాయకులందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశంను తెలంగాణ గడ్డ మీద న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ ఆదర్శనగర్‌లో 1982 మార్చ్29, స్థాపించారని గుర్తు చేశారు. అప్పటికే సినీరంగంలో 60 సంవత్సరాలకు పైగా ఏకచిత్రాధిపత్యంతో వెలుగొందుతున్న ఎన్టీ రామారావు తనకు ఇంత హోదా ఇచ్చిన తెలుగు ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతో పార్టీని స్థాపించారన్నారు. సేవాభావంతో పుట్టిన పార్టీ కేవలం తెలుగుదేశం పార్టీనే అన్నారు. సామాజిక న్యాయం అనే నినాదంతో ప్రతి పేదవాడికి 'కూడు గూడు గుడ్డ' అనే నినాదంతో, ఒక మంచి ఆశయంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించడం జరిగిందన్నారు. పార్టీ స్థాపించి 9 నెలల్లో అధికారాన్ని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఆతర్వాత పార్టీ జాతీయాధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సంస్కరణలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను బాగుపరిచి పార్టీని మరింత ముందుకు తీసుకు వెళ్లారన్నారు. ఇటీవల పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా 2 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు చేసినప్పటికీ అందులో 1,20,000 పైగా నూతన క్రియాశీల సభ్యత్వం కాగా, 80వేల సభ్యత్వాలు రెన్యువల్ చేసుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నిరంతరం ప్రజల పక్షాన ఉండి పోరాడుతుందని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీ రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజు గౌడ్, ఎస్.ప్రకాష్, ఎం రాజు, ఝాన్సీ, ప్రమీల, మహానంది, గండికోట విజయ్, సి.విట్టల్, పరశురామ్, భాను ప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, అడ్డగుట్ట విజయ్, అమ్మినాయుడు, ప్రదీప్ గౌడ్, శ్యాంసుందర్, ప్రవీణ్, తడక వినోద్, ఎండి సలీం, రామదాసు, జగదీష్ గౌడ్, సాయి, ధనరాజ్, శుక్రవేది తదితరులు పాల్గొన్నారు.



కులం పుట్టుక నిర్మూలన పుస్తకావిష్కరణ

నవతెలంగాణ - ముషీరాబాద్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన కులం పుట్టుక నిర్మూలన పుస్తకాన్ని ఇంగ్లీషు నుండి తెలుగులోకి మోహన్ తలారి అనువాదం చేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాత్రి ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సీనియర్ జర్నలిస్ట్ విజయ్ సాధు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంట చక్రపాణి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. హిందూ సమాజంలోని కుల వ్యవస్థ ఎలా పుట్టింది, ఎలా వేళ్ళూనుకుంది, కులం పేరిట శూద్రులలోని కొందరిని అంటరాని వారిగా ఎలా దూరం పెట్టి అణిచివేస్తూ వచ్చారు, హిందూమతంలో కుల వ్యవస్థను రూపుమాపి సమూలంగా సంస్కరించకపోతే ఇతర మతాల నుండి ముప్పు ఎలా పొంచి ఉంది వంటి విషయాలన్నింటినీ ఈ రెండు పత్రాలలో అంబేడ్కర్ సమగ్రంగా వివరించారని తెలిపారు. ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసి విశాల ప్రజా ప్రయోజనాల దృష్టిలో తన భావాలను సూటిగా వ్యక్తం చేశారన్నారు. అంబేడ్కర్. కుల వ్యవస్థపై ఇంత ఘాటుగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తే నాటి జాతీయ నాయకుల, పత్రికల కన్నెర్రకు, ఆగ్రహానికి గురవుతానన్న చేదు వాస్తవం అంబేడ్కర్‌కు తెలియనిది కాదన్నారు. కానీ ఎవరి మెచ్చుకోళ్ల కోసమో పొగడ్తల కోసమో అర్రులు చాచకుండా నిర్భీతిగా తన అభిప్రాయాలను ప్రకటించారని చెప్పారు. తీవ్ర వ్యతిరేకులు సైతం కన్విన్స్ కాగల రీతిలో తన వాదనలను బలంగా వినిపించారని తెలిపారు. అంబేడ్కర్ హిందూ మతాన్ని ఎన్నడూ వ్యతిరేకించలేదని.. పైగా సంస్కరించుకొని మరింత బలపడాలని హితవు చెప్పిన దార్శనికుడాయన అని అన్నారు ఈ కార్యక్రమంలో అనురాధ , స్టాలిన్, మోహన్ తలారి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Sai Krishna Karthiik Sattiraju S/o SSN Murthy R/o. 7-12-126, P.No 38 Rd.No 3 Surya Enclave, Tirumalagiri Secunderabad 500015, Aadhar No 896664168908 have changed my name as Sai Krishna Karthik Sattiraju.

PUBLIC NOTICE

NOTICE is hereby given that **Mr. Sajjad Ali Khan** resident of Vill no 2, Plot no 47, SKR Enclave, Road no 70, Journalist colony, Hyderabad - 500033, Telangana state has Agreed to Sell the Property bearing municipal no 6-3-566 in Survey no 106/B (old 106/P), TSLR no 12, Block - N, Ward - 85, Irramanzil, Somajiguda, Hyderabad. Any person having any right, title, interest, claim or demand of any nature whatsoever in Respect of the said Flat, is hereby required to make the same known in writing along with the documentary proof thereof, to G Sreenivasulu Reddy at H.No. 10-5-385/58/12, A-5, 7th floor, Subhishi Valencia, Road no 12, Banjara hills, Hyderabad - 500034 (Gmail - tigerreddy7777@gmail.com Ph no - 9948663719) within seven days from the date of publication.

G.RAMANAIDU MA , LLB.
Advocate,Ph No. 918985969989

శ్రీయుత గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి మిర్యాలగూడ వారి కోర్టులో
H.M.O. P.No. 01 of 2025

Between:-
గుంటోజు @ ఉరువాల శ్రీ సుప్రియ. ...వాది

మరియు

గుంటోజు రామాచారి ....ప్రతివాది

To,
గుంటోజు రామాచారి తండ్రి: క్రిష్ణయ్య చారి, వయస్సు:33 సం॥రాలు, వృత్తి: కార్పెంటర్, నివాసము: కనకదుర్గటెంపుల్ రోడ్, నియర్ రామోజీఫిల్మ్ సిటీ, అనాజ్‌పూర్ గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా

పై కోర్టులో మీ భార్య అయిన గుంటోజు @ ఉరువాల శ్రీ సుప్రియ గారు మీపై విడాకుల కొరకు పిటిషన్ వేసి ఉన్నారు. ఇట్టి పై దావాలో మీకు పలుమార్లు నోటీసులు పంపినను అందక తిరిగి వచ్చుచున్నవి. కావున పై దావాలో మీకు అభ్యంతరములు, ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో ఇట్టి దావా యొక్క వాయిదా **తేది: 11-04-2025** తేదిన ఉన్నది. ఉదయం 10:30 గంటలకు మీరు గానీ, మీ తరఫున న్యాయవాది గాని కోర్టుకు హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకోగలరు. లేనిచో ఇట్టి దావాలో కోర్టు వారు మీ పరోక్షంలో తదుపరి విచారణ చేయుదురు.

(కోర్టు వారి అనుమతితో)
సం/-
ముచ్చర్ల కళ్యాణ్‌బాబు
న్యాయవాది, మిర్యాలగూడ
సెల్ నెం: 9247257099

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, R.R. DISTRICT, AT: L.B. NAGAR.
O.S. No. 430 OF 2023

BETWEEN:
Smt. Adimetti Anasuya and another, ...Plaintiffs

AND

Smt. Shabad Padma & others, ...Defendants

NOTICE

To,
1. Mr. SANJEEV GOYAL, S/o. B.L. Goyal, Aged about 55 years, Occ: Business, R/o. H. No. 34/1, Road No. 8, Banjara Hills, Hyderabad, T.G. -5000 (Defendant No. 27)
2. Mr. MOHAMMED MASROOR HUSSAIN, S/o. Mohd Ahmed Hussain, aged about 48 years, Occ: Business, R/o. H. No. 17-3-89, Rein Bazaar, Near MCH Park, Outside Yakutpura, Hyderabad, T.G. (Defendant No. 35)

Sir,
Take notice that my clients filed the above suit is filed for Partition And Separate Possession And Declaration to Declare the sale Deeds As Null And Void And Consequential Injunction Agricultur e land adm. Ac. 3.15 gts in Sy.No.47 situated at Kokapet (V), Gandipet (M) the then Rajendra Nagar (M), R.R. District, T.S. The said suit is posted to 17-04-2025. Kindly be present either in person or through advocate before the said Hon'ble court at 10.30 A.M. otherwise the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)
(MOHAMMED SHUJAUDDIN)
ADVOCATE
#16-7-311/2, Opp. Sahifa Masjid, Azampura, Hyderabad, T.G.-24, Cell: 9000007006.

IN THE COURT OF THE HON'BLE I. ADDL. JUNIOR CIVIL JUDGE.
AT: SANGAREDDY.
O.S.No. 921 of 2023

Between:-
Balija Mallappa. ...Plaintiff.

AND

Gajula @ Balija Ramulu and others. ...Defendants.

To,
Papsupuleti Subrahmani,
W/o. Pasupuleti Narayan Srihari,
Aged about 46 years, Occ: House wife, R/o. Villa No. 108,
Gundlapochampally Road,
Kompally, Medchal, Medchal Malkajgiri District, T.S.

Take notice that, the above named plaintiff filed a suit for partition and separate possession against you and other defendants in respect of lands in Sy.Nos.20/A Ac.0-18 guntas, Sy.No.21/A Ac.0-28 guntas, Sy.No.22/A Ac.0-24 guntas, Sy.No.23/A Ac.0-12 guntas, Sy.No.26/A Ac.0-19 guntas, Sy.No.36/AA, Ac.0-23 guntas, All situated at Kothapally Village, Gummadidala Mandal, Sangareddy district, and the above case is coming for your appearance and the case is posted to Dated:02-04-2025 for your appearance, as such you are hereby directed to appear before the above mentioned court on the above said date at about 10-30 AM either in person or through an Advocate, otherwise the matter will be decided as per the record available in the court.

//BY ORDER OF THE COURT//
(Mohd. Mahboob Ali),
Advocate, Sangareddy.
Office # 5-2-64 Jalal Bagh,
Behind Dist Court,
Sangareddy - 502001.
Cell.No. 9394699989.

శ్రీయుత సీనియర్ సివిల్ జడ్జి కోర్టు - మిర్యాలగూడ
O.P.NO. 83 OF 2024

Between:
నడింపల్లి అంజనేయులు ...పిటిషనర్

మరియు

నడింపల్లి సౌజన్య ...రెస్పాండెంట్

TO:
నడింపల్లి @ బుట్టి సౌజన్య W/o అంజనేయులు వయసు 29 సం॥రాలు వృత్తి : ప్రయివేటు జాబ్ R/o 10-23/3 న్యూ గడ్డి అన్నారం కాలనీ సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పైన పేర్కొనబడిన పిటిషనర్ Divorce నిమిత్తము పై కోర్టు వారి ఎదుట దరఖాస్తు దాఖలు చేసినారు. పలుమార్లు మీకు నోటీసులు పంపిన తామీలు కాలేదు. మీ హాజరు నిమిత్తము వాయిదా తేది:11-04-2025 న కలదు. ఆ రోజు ఉదయం: 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయం గా కాని అడ్వకేటు ద్వారా హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
C.H. రఘురామరావు
డి. శ్రీనివాసరావు
మంద.సైదులు
H.no: 28-729
విద్యానగర్ - మిర్యాలగూడ,
నల్లగొండ జిల్లా,
(పిటిషనర్ తరపు న్యాయవాదులు)
సెల్: 9440480362

IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: HAYATHNAGAR
O.S.NO. 202 OF 2025

Between:
Upadhyay yashoda & others ...Plaintiffs.

And

The Tahsildar & Another
Hayathnagar Manadal, ..Defendants

To,
All concerned

NOTICE

Whereas the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs of Late Sri. Upadhyay Sohanlal who died on 10-10-2000 in respect of the suit schedule property i.e. House bearing No.A-202, in Category BWS in Phase II, of Vanasthalipuran Residential Complex in Survey No.201, of Saheb Nagar Kalan Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, Under Registration Sub District Hyderabad East is Vanasthlipuram, L.B Nagar Municiaplity admeasuring totle 50 Sq.Mtrs., equivalent to 60 Sq. Yards and having the Plinth area (built up area 23.42 Sq.Mtrs., 28 Sq. Yards) in bounded by: EAST: H.No: A-197; WEST: Road; NORTH H.No: A-201; SOUTH: H.No: A-203; and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may appear before this Hon'ble court on **21-04-2025** at 10.30 AM, either in person or through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// BY ORDER OF THE COURT//
M/s. POCHAMPALLY GIRIDHAR,
N.BALAKRISHNA
Advocates
B-436, 1st Floor, Near Red Water Tank, Vanasthalipuram, Hyderabad.
Mobile No. 7013191874

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు : కార్పొరేటర్

నవతెలంగాణ - హస్తినాపురం



హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో అభివృద్ధి పనులకు రూ. 16 కోట్ల 12 లక్షల 62 వేలు మంజూరైనట్టు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మెన్, కాంగ్రెస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మధు యాష్కి గౌడ్ సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహచర మంత్రులకు ధన్యవాదములు తెలిపారు. రూ. 12 కోట్ల 50 లక్షలతోఏపీఎస్ఈబీ కాలనీ నుండి బైరా ముల్ గూడా చెరువు వరకు వరద నీటి కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్టుగా తెలిపారు అదే విధంగా శ్రీ రమణ కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.89 లక్షల 37 వేలు ఆర్ కె ఆర్ ఎంక్లేవ్ లో బీటీ రోడ్ మరమ్మతులకై 15 లక్షలు భీమా నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.30లక్షలు అగ్రికల్చర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాలకు రూ.81 లక్ష50 వేలు విజయదుర్గా కాలనీ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు శివ సాయి నగర్ సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 25 లక్షలు దాతునగర్ రోడ్ నెంబర్ 1 వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3 శ్రీరామ అయోధ్య కాలనీ శ్రీ రమణ కాలనీ ఫేస్ 1 లలో రోడ్ల నిర్మాణానికి రూ.86 లక్షల 75 వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి ముమ్మరంగా జరుగుతుందని తెలిపారు .ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు.

పేదలకు కేటాయించిన భూములను వారికివ్వాలి

- సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ

నవతెలంగాణ - హస్తినాపురం



పేదల కోసం ప్రభుత్వాలు ఇచ్చిన ఇంటి స్థలాలను రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం కబ్జా చేసి ఆయా ప్రాంతాల ప్రజలను మోసం చేసిందని, అట్టి భూములను తిరిగి స్థానికులకు ఇవ్వాలని సీపీఐ(ఎం) సర్కిల్ కమిటీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు.పార్టీ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నందనవనం శాఖ కార్యదర్శి, సర్కిల్ కమిటీ సభ్యులు మంథని యాదయ్య అధ్యక్షతన సాగర్ రింగ్ రోడ్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీం పట్నం మండల పరిధిలో నాగన్ పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 189, 203 లో 577 మందికి ఇండ్ల పట్టాలు పేదలకు ప్రభుత్వం మంజూరీ చేసిన తర్వాత రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం అట్టి భూములను కబ్జా చేసి,పేదలకు మరొక చోట భూములు కేటాయిస్తానని నమ్మించి మోసం చేసిందన్నారు. పేదల భూములను కబ్జా చేసిన వారిని వదిలేసి, పేదలకు కేటాయించిన భూమిని పేదలకే ఇవ్వాలని పోరా టం నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ని , జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ని ,ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్‌ను, ఇతర నాయకులను గాయపరిచి అరెస్టు చేయడం సిగ్గుచేటని,ఇప్పటికైనా ప్రభుత్వం, రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పార్టీ నాయకులు,కార్యకర్తల పైన పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని,లేని పక్షం లో జిల్లావ్యాప్తంగా ఇల్లు లేని పేదల అందరినీ సమీకరించి రామోజీరావు ఫిలిం సిటీ లో భూ పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు పొట్టేపాక రామస్వామి, భూష రాజు కాశయ్య రాధమ్మ అంజమ్మ శాంతి గంగమ్మ కుమారి పాల్గొన్నారు.

ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరిగిందని ప్రజలు డిహైడ్రేషన్ గురికాకుండా చూసుకోవాలని బేగంబజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్ అన్నారు. శనివారం ఆరోగ్య కేంద్రంలో పలువురికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఓఆర్‌ఎస్‌ను వన్ లీటర్ మంచి నీటిలో కలుపుకొని సేవించాలని సూచించారు. బయటికి వెళ్ళేటప్పుడు తాగు నీరు తీసుకెళ్లాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, అంబలి లాంటి పానీయాలు, సీజన్ పండ్లు తీసుకోవాలన్నారు. ఉదయం 11 గంట ల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండలో బయటికి వెళ్ళ కూడదని ప్రజలకు సూచించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ ఉన్న వాళ్లు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఓఆర్‌ఎస్ పాకెట్లు ఆరోగ్య కేంద్రంలో బస్తీ దవాఖానాల్లో సిద్ధంగా ఉంచామని ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో పీహెచ్‌ఎన్ నాగేశ్వరమ్మ, ఏఎన్‌ఎం నలిని, ఆశావర్కర్లు చైతన్య లక్ష్మి, మాధవి, శ్వేత, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ.10 కోట్ల 62 లక్షల ఆస్తి పన్ను వసూలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హౌసింగ్ బోర్డ్ డిపార్టుమెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ జగదీష్ హౌసింగ్ బోర్డ్ విభాగాని కి చెందిన ఆస్తి పన్ను బకాయి రూ.10 కోట్ల 62 లక్షల ఆస్తి పన్నును వసూలు చేసి జీహెచ్‌ఎంసీ గోషామహల్ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య కు అందజేశారు. వారి వెంట అసిస్టెంట్ కమిషనర్ ఎంఎస్ శైలజ, ఆస్తి పన్ను ఇన్‌స్పెక్టర్ కైలాష్, బిల్ కలెక్టర్లు సంజీవ సదానంద్ తదితరులు



నిలువ నీడ కరువు..

- బస్ షెల్టర్లలో నీడ కరువు..
- బస్ షెల్టర్‌లు లేక ఎండలోనే ప్రయాణికులు..
- కొన్ని ప్రాంతాల్లో గ్రీన్ మ్యాట్‌లు కట్టడంతో ఉపశమనం..









నవతెలంగాణ-ధూల్ పేట్

రోజురోజుకు పెరుగుతున్న ఎండలు.. భగ్గు మంటున్న భానుడు.. వేడిమి దెబ్బకు ప్రయాణి కులు బస్ స్టాప్‌లో అల్లాడుతున్నారు. బస్ షెల్టర్ లో నిలువ నీడ లేదాయే.. కొన్ని ప్రాంతాల్లో బస్ షెల్టర్లే లేకపోవడం.. దీంతో ప్రయాణికులు నీడ కోసం వెతుకుతున్నారు. కనీసం ఈ ఎండాకాలం ఎండల నుండి ఉపశమనంకు ప్రధానమైన బస్టాండ్‌లు, బస్ షెల్టర్ వద్ద గ్రీన్ మ్యాట్ పై నుంచి కడితే కాస్త ఉపశమనం కలుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రధాన టెర్మినల్స్

ఎండ వేడిమికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. ఆరభంలోనే ఇంత ప్రభావం చూపుతున్న భానుడు ముందు రోజుల్లో మరింత వేడిమి పెరిగే అవకాశాలు ఉన్నాయని వినిపిస్తుంది. నగరానికి ప్రధాన టెర్మినల్స్ అయిన సీబీఎస్, అఫ్జల్ గంజ్, కోటి, మెడికల్ కాలేజ్ బస్ షెల్టర్లు ఉన్న లేనట్టే ఉన్నాయి. అఫ్జల్‌గంజ్ బస్‌స్టాండ్ అన్ని స్టాల్‌తో నిండిపో యింది. దీంతో రోడ్డు పై ముందుకు నిలబడాల్సి వస్తుందని ప్రయాణి కులు వాపోతున్నారు. కోటి, మెడికల్ కాలేజ్, సీబీ ఎస్, ఉస్మానియ ఆస్పత్రి, నాంపల్లి, చార్మినార్, పురాణపూల్, శాలిబంద, ఫలక నుమా, చాంద్రా యణ గుట్ట, బండ్ల గూడ తదితర ప్రాంతాలల్లో ఎండ దెబ్బకు ఇబ్బంది లకు గురవుతున్నారు. ఉదయం 11 గంటల నుండి, సాయంత్రం 4 గం టల వరకు ఎండ ప్రభావానికి భయపడుతున్నారు. ఆయా ప్రధాన ప్రాంతాలలో బస్ షెల్టర్‌ల వద్ద గ్రీన్ మ్యాట్ కట్టేస్తే కాస్త ఉపశమనం అవుతుందని అశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బస్ షెల్టర్‌లు లేక..

ప్రయాణికులు బస్ షెల్టర్‌లు లేక ఎండ వేడిమికి ఇబ్బందులకు గురవుతున్నారు. పురాణ పూల్ దర్వాజా, గోపి హెూటల్, జుమ్మేరత బజా ర్, బేగం బజార్ చత్రి, శాలి బండ, మిస్రి గంజ్, ఫలక్ నుమా బండ్ల గూడ తదితర ప్రాంతాలలో బస్ షెల్టర్‌లు లేక ఎండలోనే నిలబడాల్సి స్తుంది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల నీడ, బిల్డింగ్‌ల, పక్కలనే ఉన్న టీ స్టాల్‌ల నీడలను అశ్రయి ంచడానికి చూస్తున్నారు. ప్రధాన రహదారుల్లో రోడ్ మధ్యలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జల నీడకు రోడుక్రాస్ చేసి మరీ వెళ్తున్నారు. నీడ కోసం రోడ్లు క్రాస్ చేయడం బస్ రాగానే పరుగెత్తుకుని మళ్ళీ రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలతో ప్రమాదం జరిగే పరిస్థితి లేకపోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు బస్ స్టాప్‌ల వద్ద గ్రీన్ మ్యాట్ వేయాలని పలువురు కోరుతున్నారు.

హమాలీలకు లైసెన్సులు, యూనిఫామ్స్ ఇవ్వాలి

- సీఐటీయు నాయకులు విట్టల్



నవతెలంగాణ-మెహదీపట్నం

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో హమాలీలకు లైసెన్సు లు, రెండు జతల యూనిఫాం వెంటనే ఇవ్వాలని సీఐటీయు జిల్లా మాజీ కార్యదర్శి జి.విట్టల్ డిమాండ్ చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్ హమాలీ యూనియన్ ఆధ్వ ర్యంలో మార్కెట్ చైర్మెన్ టి.మల్లేష్‌కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ గుడిమల్కా పూర్ మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు 10 సంవత్సరాల క్రితం యూనిఫాంలు, లైసెన్సులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికి 10 సంవత్సరాలు దాటిపోయినా కూడా ఇప్పటికీ హమా లీలకు కొత్త యూనిఫాంలు ఇవ్వలేదని లైసెన్సులని కూడ రెన్యువల్ చేయలేదన్నారు. హమాలీలకు యూని ఫామ్స్ ఇవ్వకపోవడం లైసెన్సులు రెన్యువల్ చేయ కపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హమాలీలకు యూనిఫామ్‌లు ఇచ్చి, వారి లైసెన్సులు రెన్యువల్ చేయాలని హమాలీల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.రాము లు, నాయకులు నరసింహ చారి తదితరులున్నారు.

తపాలా ఖాతాదారులకు మెరుగైన సేవలు

- కార్వాన్ సాహు పోస్ట్ మాస్టర్ సి.బాలకృష్ణ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తపాలా ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని, అలాగే పోస్ట్ ఆఫీస్ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కార్వాన్ సాహు పోస్ట్ మాస్టర్ సి.బాలకృష్ణ అన్నారు. శనివారం కార్వాన్ సాహు తపాల కార్యాలయంలో ఆయ న మాట్లాడుతూ.. పోస్ట్ ఆఫీస్‌లో ప్రజలు పొదుపు ఖాతా, నెలవారీ పొదుపు, ఫిక్స్ డ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, టాటా ఏఐజీ పాలసీస్, ఇండి యా పోస్ట్ ప్రెమెంట్స్ బ్యాంకు తదితర సేవలను విని యోగించుకోవాలని ప్రజలకు, ఖాతాదారులకు సూచిం చారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా ఖాతాదారుల ఇంటి వద్దకే నేరుగా సేవలంది స్తున్నామన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా సురక్ష సువిధ, సుమంగళ్, యుగల్ సురక్ష, తదితర పాలసీలను అందిస్తున్నామని తెలిపా రు. ఖాతాదారులు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఆన్‌లైన్ సేవలను వినియో గించుకోవాలని సూచించారు. దీనివల్ల ఖాతా దారులకు సమయం ఆదా అవుతుందని తెలిపారు. ప్రజలందరూ పోస్టల్ అందిస్తున్న సేవలను సద్వినియోగిం చుకోవాలని ఖాతాదారులను కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ పి విశ్వేశ్వర్, ఎంటీఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓలా, ఉబెర్, రాపిడోల శ్రమ దోపిడిని అరికట్టాలి



- ఇందిరా పార్క్ వద్ద క్యాబ్ డ్రైవర్‌ల ధర్నా

నవతెలంగాణ-ముషీరాబాద్

ఓలా, ఉబెర్, రాపిడో సంస్థలు చేస్తున్న శ్రమ దోపిడిని వెంటనే అరికట్టాలని క్యాబ్ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద క్యాబ్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీవో చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్న ఇతర రాష్ట్రాల టాక్సీ ఫ్లేట్ వాహనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబెర్, రాపిడో సంస్థలలో, సెక్టర్లో అటాచ్ అయి ఉన్న ఇతర రాష్ట్ర వాహనాలలో వెంటనే రద్దు చేయాలన్నారు. ఆర్టీవో చట్ట విరుద్ధంగా నడుస్తున్న బైక్ టాక్సీ లలో వాహ నాలపై కఠిన చర్యలు తీసుకోవాలని క్యాబ్ డ్రైవర్ వద్ద యాప్ సంస్థలు విధిస్తున్న ట్రాఫిక్ చలాన్లను తగ్గించాలని కోరారు. క్యాబ్‌లపై అకారణంగా విసిస్తున్న ట్రాఫిక్ చాలన్ల ను తగ్గించాలని క్యాబ్ సర్వీస్‌లో ఉన్న ప్రతి డ్రైవర్ కి రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా కల్పించాలని కోరారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పరిస్థితి ఓలా ఉబెర కంపెనీలో మాకు చెల్లించాలి ఎవరెస్టు స్వీట్స్ కంపెనీల వాహనాలు నిలిపివేసి క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 రోజులలో చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నాంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం వైద్యులు చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ మోహమ్మద్ ఆలీ, పర్వేజ్, గౌస్‌ల బృందం సందర్శించారు. ఆస్పత్రిలో గల ఆర్థోపెడిక్, కిడ్నీ డయాలసిస్ సెంటర్, జనరల్ ఓపి, గైనిక్ ఒపి,నవ జాత శిశువులకు లేబర్ రూ మ్, మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్,(ఐసీయూ)లో సౌకర్యా లు, జనరల్ ఫిజీషియన్ ఓపి, సర్జరీ ఒపి, ఆపరేషన్ థియే టర్, ఈఎన్‌టీ, డెంటల్ ఓపి, ఫిజియోథెరపీ, ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రత, బ్లడ్ బ్యాంక్ ,అన్ని విభాగాలను సంద ర్శించి వైద్య సేవలు, సౌకర్యాలను ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ నజియా నౌషిన్ సిద్ధిఖాను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ నజియా నౌషిన్ సిద్ధిఖా, ఆర్ఎంఓ క్రాంతి కిరణ్, డాక్టర్ గిరిధర్, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఫణి కిరణ్, నర్సింగ్ సూపర్డెంట్ విజయకుమారి, హెడ్ నర్సులు అరుణ జ్యోతి, సరళ కుమారి, ఐ సి ఎన్ స్వప్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాత్రులు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాత్రులు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తరంగి నాగరాజ్ (34) అనే వ్యక్తి ఫంక్షన్ హాల్ లో పనిచేస్తూ రాత్రి సమయంలో సంచరిస్తూ దొంగతనాల కు పాల్పడుతున్నాడు. చిక్కడపల్లి వెంకటేశ్వర కమాన్ వద్ద టీ స్టాల్ నిర్వహిస్తున్న విజయదాస్ రోజు మాదిరిగానే ఈనెల 23న ఉదయం 2:30 గంటలకు తన టీ స్టాల్ మూసివేసిన తర్వాత, పని చేసి అలసిపోయి ఎయిర్టెల్ ఆఫీ సు ముందు పడుకున్నాడు. అదే సమయంలో తరంగి నాగ రాజ్ అనే వ్యక్తి నిద్రిస్తున్న విజయదాస్ వద్దకు వచ్చి అతని జేబులను తనిఖీ చేయడం ప్రారంభించాడు. అకస్మాత్తుగా మేల్కొని ఎవరు నువ్వు నా జేబులను ఎందుకు తనిఖీ చేస్తు న్నావని అడగగా వెంటనే నిందితుడు గట్టిగా పట్టుకొని గాయపరిచి అతని జేబులో నుంచి రూ. 700లు తీసుకొని పారిపోయాడు. వెంటనే బాధితులు స్థానిక చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చిక్కడపల్లి పోలీస్ క్రైమ్ టీం శిల్పావళి తన టీంతో విస్తృతంగా తనిఖీ నిర్వ హించి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకు న్నారు. పోలీసుల విచారణలో నిందితుడు ఈ నేరాన్ని తానే చేసినట్లు ఒప్పుకున్నాడని నిందితులపై గతంలో అఫ్జల్గంజ్, మలక్‌పేట్, సుల్తాన్ బజార్, పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు 7 కేసులు నమోదయాయని తెలిపారు.

గాంధీభవన్‌లో గోషామహల్ కాంగ్రెస్ నాయకుల భేటీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



గాంధీభవన్‌లో శనివారం జై బాపు, జై భీమ్, జై భీమ్, జై సంవిధాన్ గోషామహల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కైలాష్ ఆధ్వర్యంలో గోషామ హల్ నియోజకవర్గం చెందిన కాంగ్రెస్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ కదిర్, బి బ్లాక్ ప్రెసిడెంట్ శ్యామ్, గన్ ఫౌండ్రీ డివిజన్ అధ్యక్షులు చంద్ర మోహన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్, సంజయ్ కుమార్ యాదవ్, సీకే మూర్తి, కిషన్ బద్రి సుభాష్ జహంగీర్‌లు పాల్గొని గోషామాల్ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలన్న అంశాలపై చర్చించినట్లు తెలిపారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గన్ ఫౌండ్రీ డివిజన్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ పౌర హక్కుల కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వారి అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ ,నాంపల్లి తాసిల్దార్ ప్రేమ్ కుమార్, ఎస్ఐ, ఎస్ సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్, జీహెచ్‌ఎంసీయుసీడీసీ ఓసమ్మయ్య, వివిధశాఖల అధికారులు తదితరులున్నారు.

టీకా బండి వాహనాలు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో రొటీన్ ఇమ్యునైజేషన్ సెషన్‌లను నిర్వ హించడానికి అధిక ప్రమాదం ఉన్న, చేరుకోవడానికి కష్టతరమైన ప్రాంతంలో వాహనాలను ఉపయోగించేందుకు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏఎన్‌ఎంలకు నాలుగు టీకా బండి వాహనా లను (హెూండా యాక్టివా) కేటాయించారు. ఈ బండ్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఖైరతాబాద్ యూపీహెచ్‌సీ (ఏఎన్‌ఎం-లావణ్య), మెట్టుగూడ యూపీహెచ్‌సీ (ఏఎన్‌ఎం-శైలజ), శ్రీరామ్ నగర్ యూపీహెచ్‌సీ (ఏఎన్‌ఎం-రజిత), సనత్‌నగర్ (ఏఎన్‌ఎం-ప్రమీల)కు వారి ప్రాంతాల్లో అర్హత గల పిల్లలకు 100శాతం టీకా కవరేజ్ కోసం కేటాయించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట్ మాట్లాడుతూ రొటీన్ ఇమ్యూనిజేషన్ సెషన్‌లను నిర్వహిం చడానికి, అర్హత గల పిల్లలకు టీకాల కవరేజ్ కోసం సిబ్బందికి ఈ వాహనాలు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా మాస్ ఎడ్యు కేషన్ అండ్ మీడియా అధికారి జక్కుల రాములు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల చలో ఢిల్లీ మహాధర్నాను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

వచ్చే నెల 2న పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్ హనుమంత రావు ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే బీసీల మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి బీసీలు ఎదురుచూస్తున్న బిల్లును రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింప చేశా రని పార్లమెంట్లో కూడా బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ పోరాటం బీసీలకు లభించిన అరుదైన గౌరవం అని అన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని గాంధీనగర్ డివి జన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని వీవీ గిరి నగర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ నివి చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మహిళలకు స్వయం ఉపాధికై ఉచిత శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇటీవల ప్రారంభించినబ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణ తరగతులపై, టీచర్లు భోధన పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమ వం తు సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామ న్నారు. డివిజన్‌లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయి ంట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ నేతలు సాయి కుమార్, ఆనంద్ రావు, సాయి, శిక్షణను అందిస్తున్న టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ హమాలీ పోర్టర్స్ కూలి పెంచాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా



నవతెలంగాణ-ముషీరాబాద్

నిజాం కాలంలో ఆర్టీసీ సంస్థ ఏర్పాటైనప్పటి నుండి సంస్థలో హమాలీ వ్యవస్థ కొనసాగుతుందని ఆర్టీసీ హమాలీ పోర్టర్స్ కూలీ రేట్లు, కనీస సౌకర్యాలు కల్పించాలని మాజీ రాజ్యసభ సభ్యులు సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టీజీఎస్‌ఆర్‌టీసీ లైసెన్సు రిపోర్టర్స్ యూని యన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ భవన్ ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఎండీ సీవీ సజ్జనార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణికులతో పాటు రవాణా వ్యవస్థ ద్వారా ఆర్టీసీకి అనేక లాభాలు వస్తున్నాయని ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి కార్గో సంస్థలో రవాణా సంస్థ లాభదాయకంగా నడుస్తుందని కానీ కార్మికుల కూలీ రేట్లు మాత్రం సగాని సగం తగ్గించడం ద్వారా వారికి తీవ్ర అన్యాయం జరుగు తుందని వారు విమర్శించారు. వందలాదిమంది హమాలీ పోర్టర్లు సీబీస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ లాంటి బస్టాండ్లతో పాటు రాష్ట్రం లోని అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల సరుకుల్ని రవాణా చేసేం దుకు కృషి చేస్తున్నారని వారు తెలియజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ హమాలీలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20 శాతానికి తగ్గకుండా కూలీ రేట్లు పెంచాలని, ప్రతి పోర్టర్ కార్మికుడికి రెండు జతల యూనిఫారం సంస్థ ద్వారా ఇప్పించాలని, కార్మికులకు రెస్టు రూమ్‌లో డిపోలలో ఏర్పాటు చేయాలని కోరారు. ఒకవైపు రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరుగుతున్నప్పటికీ హమాలీ పోర్టర్స్ రేట్లు పెరగకపోవడం తీవ్ర అన్యాయమని వారు తెలియజేశారు. వీలైనంత త్వరలో పరిష్కారం చేస్తామని రెస్ట్ రూములు హెల్త్ కార్డులు యూనిఫారం హమాలిరేట్ల పెంపుదలకు సంస్థ ద్వారా కృషి చేస్తామని డెలిగేషన్‌కు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, యూనియన్ ఉపాధ్యక్షులు జి దాసు, వి పోచయ్య, కే కొండయ్య ఇ దశరథ్, కే చంద్రమౌళి, జి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ హత్యలన్ని ప్రభుత్వ హత్యలే

- ఎన్ కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి : తెలంగాణ పౌర హక్కుల సంఘం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ఆపరేషన్ కాగార్ పేరుతో కొనసాగుతున్న ఎన్ కౌంటర్ హత్యలన్ని ప్రభుత్వ హత్యలేనని తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆరోపించింది. శనివారం హైదర్ గూడ, ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు మాట్లాడుతూ మధ్య భారతంలో ఆపరేషన్ కాగార్ పేరుతో కొనసాగిస్తున్న ప్రభుత్వ హత్యాకాండలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. 7 లక్షల మంది పారా మిలటరీ బల గాలను వెనక్కి పంపించాలని, ఎన్ కౌంటర్ హత్యాకాండలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. సుక్మా జిల్లా గోందోడు ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ హత్యాకాండలో 20 మంది అమాయకులు బలైయ్యార న్నారు. 14 నెలల కాగార్ హత్యాకాండలో 470 మంది చనిపో వడం జరిగిందని, ఈ ఎన్‌కౌంటర్ హత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. ఎన్ కౌంటర్‌లో పాల్గొంటున్న పోలీసులందరిపై 302 హత్యానేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. 14 నెలలుగా కొనసాగిన కాగార్ మారణకాండలో ఎంతో మంది ఆదివాసీల ను జంతువులవలే వెంటాడి వేటాడి హత్య చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ప్రభుత్వం చేపట్టిన ఈ బూటకపు ఎన్ కౌంటర్లను ఆపాలని వారు డిమాండ్ చేశారు.

బీసీ కుల సంఘాలతో సీఎం చర్చలు జరపాలి

- 96 కుల సంఘాల 30 బీసీ సంఘాల నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

రిజర్వేషన్ల అంశం చర్చించడానికి అఖిల పక్షంతో బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చ జరపాలని 96 కుల సంఘాల - 30 బీసీ సంఘాల నాయకుల డిమాండ్ చేశాయి. అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి బీసీలకు విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు 29 శాతం నుంచి 42 శాతంకు పెంచుతూ అలాగే స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచుతూ రెండు బిల్లులు పాస్ చేయ డం చారిత్రాత్మకం. అందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపు తున్నామని 96 బీసీ కుల సంఘాలు, 30 బీసీ సంఘాల సమా వేశానికి జాతీయ బీసీ సంఘం ఉపాధ్యకులు గుజ్జ సత్యం, బీసీ సంఘం అధ్యక్షులు రాజారాం అధ్యక్షతన జరిగింది. భవిష్యత్ కార్యాచరణ గురించి విస్తృతంగా చర్చించారు. ఈ చర్చలకు ఎంపీ ఆర్ కృష్ణయ్య, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, ఎల్.రమణ ఒకలాభరణం కృష్ణమోహన్రావు, నారగోని,హాజరై ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ. ఈ బిల్లు చట్టం చేశారు. దీని అమలు కోసం న్యా య నిపుణులతో చర్చించి బీసీ బిల్లు అమలు చేయడంతో భిన్నాబి ప్రాయాలు వ్యక్తం అవుతున్నందున లోతుగా చర్చించి అమలు కోసం పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపు కోవాలని చూడడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తెచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి సవరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గుజ్జ సత్యం మాట్లాడుతూ అలాగే బిహార్‌లో ఇటీవల అసెంబ్లీలో బిల్లు పాస్ అయిన ప్రభు త్వం జీవో జారీ చేసింది. ఉద్యోగాలు కూడా భర్తీ చేశారు. రాజా రాం యాదవ్ మాట్లాడుతూ. చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణ నను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, విద్య, ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పా టు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పిం చాలని, బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యుస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇటీవల కర్ణాటకలోని విజయపురలో జరిగిన జాతీయ సమై క్యత శిబిరంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నుండి వీసీఐడబ్ల్యు ఎన్ ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వి.దీపిక కు ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు లభించింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ డి మృధుల కు తెలంగాణ నుండి ఉత్తమ వాలంటీర్ అవార్డు లభించింది. ఎన్ఐసిశిబిరంలో ప్రాతినిధ్యం వహించిన వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 15 జట్లలో తెలంగాణ జట్టు అవార్డులను గెలుచుకుంది. ఎన్ఐ శిబిరంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇచ్చినందుకు ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మహిళా విశ్వవిద్యాలయంలో అవార్డు సాధించిన వారందరినీ అభినందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మహిళ విశ్వవిద్యాలయానికి మరింత పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

సీవరేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ-చంపాపేట్

ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి ఆఫీస్ కాలనీలో చేపట్టిన 650 డయా సీవరేజ్ పైప్ లైన్ పనులను శనివారం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి మేనేజర్ రమ్య భారతి, షబ్బీర్, కాలనీవాసులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ పరిధిలోని పాత గ్రామంలో ఉన్న చిన్న మసీదులో ముస్లిం మత పెద్దలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తిరుమలరెడ్డి, మల్లేష్, భాస్కర్ సాగర్, అమీర్,నవీద్, హలీం పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎన్జీవోల ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్, తెలంగాణ సోషల్ మీడియా జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డాక్టర్ ఆలేటి ఆటం అన్నారు. ఇటీవల సోషల్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తూ ఆలేటి ఆటం పాదయాత్ర చేపట్టిన విషయం విధితమే. ఈ మేరకు అబ్దుల్లాపూర్ మెట్ మండలం కేంద్రంలో ఐదు రోజులుగా దీక్ష చేపట్టారు. దీక్షకు పూనుకున్న ఆలేటి ఆటంకు, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్ నిమ్మ రసం అందజేసి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా డా. ఆలేటి ఆటం మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మహిళా జర్నలిస్టులపై దాడులు పెచ్చుమీరాయన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో భయంకరమైన ట్రోలింగ్‌తో బయపెడుతున్నారన్నారు. సోషల్ మీడియా వేదికగా కొందరు అసభ్యకరమైన పోస్టులు పెడుతూ విద్వేషాలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అసాంఘిక శక్తులను అరికట్టాలన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జర్నలిస్ట్ సంఘాలతో చర్చించి చైనా లా జర్నలిజంకు మతసామరస్య, లౌకిక ప్రజాస్వామ్య బద్ధమైన 19(1),19(2) నచట్టానికి మరింత బలం చేకూరే విధంగా చట్టం తేవాలని కోరారు. ఇతర కార్పొరేషన్ మాదిరిగా జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్ కోసం పోరాడాల్సి ఉన్నందున దీక్షను తాత్కాలికంగా విరమింపజేయడం జరిగిందన్నారు. దీక్షను విరమింపజేసినవారిలో సీపీఐ (ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ సామెల్, సీఐటీయూ జిల్లా నాయకులు నర్సింహ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకులు కగుండె శివ కుమార్ తదితరులు ఉన్నారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది



టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోల్

అన్ని దానాలలో కెల్లా అన్నదానం మహా గొప్పదని, ఆకలితో అలమటించిన వారికి పిడికెడు అన్నం పెట్టిన సంతోషానికి మించిందని ఏమీలేదని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. శనివారం అమావాస్యను పురస్కరించుకొని నగరంలో పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన అమావాస్య అన్నదాన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బ చంద్ర శేఖర్ గుప్త, అధ్యక్షుడు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి తిరుమలేశ్ గుప్త, కార్యనిర్వహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు అశోక్ గుప్త, చక్రపాణి గుప్త, శ్రీనివాస్ గుప్త, నవీన్ గుప్త, సంతోష్ గుప్త, చంద్ర శేఖర్ ప్రెసిడెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు

- విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యతోనే మంచి గుర్తింపు వస్తుందని, విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో ఉన్న డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్. ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ సీఎం కేసీఆర్ విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి పేద కుటుంబంలో జన్మించిన చిన్నారులకు కేజీ నుండి పీజీ వరకు నాణ్యమైన విద్యను పూర్తి స్థాయిలో అందించడం కోసం కృషి చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా బాలికల చదువు కోసం కస్తూరిబా గాంధీ, గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంను గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. 13జూనియర్ కళాశాలలను నూతనంగా మంజూరు చేయించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలలను మంజూరు చేసిన ఘనత దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాప్రమాణాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు చదువుకునే సమయంలో విద్య విలువ తెలియదని, జీవితం గడుస్తున్న సమయంలో విద్య విలువ తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఉస్మానియా యూనివర్శిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రాన్సిపాల్ సి హెచ్ రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, యాత్తం పవన్ కుమార్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, నాయకులు జెనిగ శ్రీనివాస్ రెడ్డి, బల్వంత్, అధ్యాపకులు డా.వెంకట్ రెడ్డి, డా.రేవతి, డా.జ్యోతి, నరసింహ రాజ్, డా.రామరాజు, డా.కిరణ్మయి, నరసింహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా : కార్పొరేటర్



నవతెలంగాణ-చంపాపేట్

ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి స్థానికులకు సూచించారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మమ్మ నగర్ లో భూల్ లక్ష్మీమాత గుడి వద్ద రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను శనివారం జీహెచ్ ఎంసీ సిబ్బందితో ఎత్తివేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారామ్, దిలీప్, రవి, శ్రీరామ్, సుభాష్, హరి, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ కోర్టులో రాగిజావ పంపిణీ...



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో బార్‌అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వేసవి ఉపశమనం కోసం రాగి జావా పంపిణీని నిర్వహించారు . కోర్టులలో వివిధ కేసుల నిమిత్తం సాధారణ ప్రజలు, వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చే పోలీసులు చాలామంది రోజూ కోర్టులకి హాజరు అవుతూ ఉంటారు. వేసవి నుండి ఉపశమనం పొందడానికి రాగి జావా పంపిణీ నిర్వహించారు . పెద్ద ఎత్తున జనాలు హాజరవడంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చారు. ఇందులో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

'ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి'



నవతెలంగాణ-చంపాపేట్

ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సంతోష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్, కుర్మగూడ డివిజన్ అధ్యక్షులు దర్శనం నర్సింగ్ రావుల ఆధ్వర్యంలో సైదాబాద్ మండలం తహసీల్దార్ జయశ్రీకి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు, యువకులకు, నిరుపేదలకు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ రెనువల్స్, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఆదాయం, క్యాస్ట్, స్థానిక సర్టిఫికెట్స్ అవసరం అని చెప్పారు. అంతేకాదు ఈ మధ్య ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులానికి చెందిన వారికి వెంటనే ధ్రువపత్రాలను ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చైర్మెన్ సిద్ధాల బీరప్ప



ఫొటో 5

నవతెలంగాణ-బడంగ్‌పేట్

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగపేట్‌లోని లార్డ్స్ ఒలింపియాడ్‌లో ప్రాథమిక స్థాయి విద్యార్థులు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని జరుపుకున్నారు. 'క్రీడో' ఆధ్వర్యంలో జరిగిన 'పేరెంట్స్ ఎంగేజ్ మెంట్ ప్రోగ్రాం' లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు చేసిన ప్రయోగాలు, ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు చిన్ననాటి నుండి చదువు మీద సంపూర్ణ అవగాహన, ఆసక్తి కలుగజేస్తే ఆ విద్య నిరంతరం ఎదుగుతుందని, అట్టి విద్యను మరచిపోవడం జరగదని, అందుకే లార్డ్స్ విద్యా సంస్థ ప్రీ ప్రైమరీ చిన్నారులకు వినూత్న విద్యా విధానాన్ని(క్రీడో) అవలంభిస్తుందని తెలిపారు. లార్డ్స్ వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లలు విద్యను కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకున్న విద్య బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, లార్డ్స్ ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'బకాయిలను లబ్దిదారుల అకౌంట్లలో జమచేయాలి'



నవతెలంగాణ-చంపాపేట్

బకాయి వడ్డీ 219 కోట్లు ఎస్.టి. ట్రైకార్ రుణాలతో పాటు బీసీ, ఎస్సీ, మైనారిటీల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే లబ్దిదారుల అక్కౌంటులలో జమ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. బాలునాయక్, గిరిజన సమైక్య సీనియర్ నాయకులు ఆర్. శంకర్ నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. రఘు, కండల వెంకటేష్, గిరిజన సమీక్ష రూప్సింగ్ నాయక్‌లు కోరారు. ఈ మేరకు శనివారం సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ పేరుతో నూతన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిందన్నారు. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ లబ్దిదారులకు కార్పొరేషన్ల ద్వారా యువతీ యువకులకు రుణాలను మంజూరు చేసింది కానీ.. చెక్కులు సైతం సిద్ధం చేసి లబ్దిదారుల ఖాతాలో జమచేయలేదన్నారు. గత 6 నెలల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇస్తూ వచ్చిందని అన్నారు. అకస్మాత్తుగా ఈ నిధులను విడుదల చేయకుండా రాజీవ్ యువ వికాస్ పేరుతో బకాయి పడ్డ రుణాలను పూర్తిగా రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రాజీవ్ యువశక్తి ఆన్లైన్ తేదిని పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా గిరిజనులు, ఆదివాసులు, వెనుకబడ్డ కులాలకు సరియైన కులము, ఆదాయము తహశీల్దార్ ద్వారా జారీచేసే విషయంలో ఆలస్యం అవుతుందని, లబ్దిదారుల మేలు కోసం తేదీని పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘుపతి నాయక్, గిరిజన సంఘం సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు మహమ్మద్ కప్లి భాయ్ పాల్గొన్నారు.

తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి, మల్కాజ్గిరి పార్లమెంటు కమిటీ సభ్యులు సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు మరాటి బిక్షపతి, మన్సురాబాద్ డివిజన్ అధ్యక్షులు దుర్గం మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు బాదుకుల శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, కాటిపాక ప్రవీణ్, జనీగే మహేందర్, కరన్ చౌదరి, కుమార్ యాదవ్ సుధాకర్ గౌడ్ రమేష్ గౌడ్, శివ నాయక్, రాజు నాయక్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరన్నగుట్టలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ-హయత్‌నగర్

వీరన్నగుట్టలోని ఉత్తర భాగంలో బస్తీ దవాఖాన పక్కన పది కాలనీవాసులకు, దాదాపు 150 ఇండ్ల వాసులకు సరైన డ్రైనేజీ ఔట్ లెట్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కన ఉన్న ప్రైవేట్ స్థలం నుంచి డ్రైనేజీ వ్యవస్థ తీసుకుపోవాల్సిన నేపథ్యంలో ఆ స్థల యజమాని ముషీరాబాద్ శాసన సభ్యులు ముఠా గోపాల్ సన్నిహితులు. ఈ మేరకు శనివారం ఆ ప్రదేశానికి స్థల యజమాని రాజేందర్ తమ్ముడు జయేందర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పలిపించారు. తర్వాత ప్రజలు ఎదుర్కుంటున్న డ్రైన్ సమస్యలు వివరించారు. సుధీర్ రెడ్డి కోరిక మేరకు కొంతమేర స్థలం ఇవ్వడానికి అంగీకరించారు. దాదాపు 560 ఫీట్ల పొడుగు రెండు ఫీట్ల డయా లైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. పెద్ద డ్రైన్స్ సమస్యకు పరిష్కారం లభించిందని సుధీర్ రెడ్డి తెలిపారు.

ప్రస్తుతం మళ్ళీ కొందరు ఆ ఔట్ లెట్ కు అడ్డుపడుతున్న విషయం మా దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆ ప్రదేశాల్లో అధికారులతో పర్యటించి చుట్టుపక్కల కాలనీలు (బాలాజీ నగర్, లక్ష్మీభవాని కాలనీ, టీ నగర్, కె.వి.ఎస్.రెడ్డి కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, అంజలి రెసిడెన్సీ, స్వాతి రెసిడెన్సీ, లక్ష్మీ ప్రసన్న కాలనీ తదితర కాలనీలకు) ట్రంక్ లైన్ పనుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కాలనీ వాసులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యం అని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, అనిల్ కుమార్, చంద్రారెడ్డి, నర్సింగ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఆకుల సత్యం, మహేందర్, నాగార్జున రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు శుక్లాజ, సతీష్, పలువురు నాయకులు, చుట్టుపక్కల పలు కాలనీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఆదాయ పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి'



నవాతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం తన నివాసంలో తొర్రూరులోని వాణిజ్య సముదాయాల ప్రాంగణానికి సంబంధించి రూ.72వేల ట్యాక్స్‌ను మున్సిపల్ సిబ్బందికి చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలు తమ ఇంటి, వాణిజ్య పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అర్చన, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి



నవతెలంగాణ-నాగోల్

జల సంరక్షణ ప్రతి ఒక్కరీ బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీనివాస నగర్ కాలనీ వారి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య నిర్వహించిన జల సంరక్షణ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నీటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను నిర్మించుకున్నప్పుడే భూగర్భ జలాలను సంరక్షించుకోగలుగుతామని, దీంతో ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టి నీటి సమస్యల నుండి కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, జలమండలి అధికారులు రాజు, సత్యనారాయణ కాలనీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపడితేనే రాబోవు తరాలకు నీటి లభ్యత ఉంటుందని, నీరు లేక నానా ఇబ్బందులు పడతామని వాటర్ వర్క్స్ మేనేజర్ రాజు అన్నారు. శనివారం సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సౌజన్యంతో, ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని హయత్‌నగర్ మన్సూరాబాద్ వార్డ్‌లో లోటస్ ల్యాప్ పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవము నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజు మాట్లాడుతూ నీటిని వృధా అరికట్టడంలో, విద్యార్థులు భాద్యత వహిస్తూ, నీటిని సంరక్షణ చర్యలు చేపట్టే విధముగా తలీ తండ్రులకు, ఇతర నివాస గృహలవారికి తెలియ జేసీ ప్రతి ఇంట ఇంకుడుగుంత ఉండేటట్లు తెలియజెప్పాలని కోరారు. పాఠశాలలో భోజన సమయంలో నీటిని వృథా చేయొద్దని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ ఎస్. నాగబ్రహ్మ చారి మాట్లాడుతూ గ్రీన్ హౌస్ గసెస్ వల్ల మంచు పర్వతాలు కరిగి మానవాలికి నష్టం వాటిల్లడంతో పాటు నీటి కరువు సంభవిస్తుందని, వర్షం నీటి భూగర్భ జలలుగా మార్చడానికి, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలంటే నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపధ్యాయులు చైతన్య, జలమండలి డివిజన్ ఏ.టీ.ఓ విశ్వనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులను గుర్తించేందుకు కాల పరిమితిని పొడిగించాలి

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ



నవతెలంగాణ-నాగోల్

రాజీవ్ యువ వికాస పథకానికి అర్హుల ఎంపికలో కొన్ని నిబంధనలు పెట్టారు, వాటికి అనుగుణంగా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచాలంటే ప్రభుత్వం ప్రకటించిన కాల గడువు సరిపోదని, కాల గడువు పెంచాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలు ఎన్నో లక్షల మంది ఉన్నారని తెలిపారు. రేషన్ కార్డు లేకుండా, ఆదాయ ధ్రువపత్రం పొందాలంటే రెవెన్యూ నిబంధనలు అంగీకరించడం లేదని, రేషన్ కార్డులు ఇవ్వకుండా, ఆదయపత్రాలు అందకుండా, రాజీవు యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవడం అనేది సాధ్యం కాదని వివరించారు. ఈ రాజీవ్ యువ వికాసానికి విధించినటువంటి కాలపరిమితి పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంతేకాదు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉండడం వల్ల దరఖాసుదారుల దరఖాస్తులన్నీ కుప్పలు, తేప్పలుగా అందజేయడం జరిగిందని, వాటిని పరిశీలించే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డు మంజూరు చేయాలని, రాజీవ్ యువ వికాసా పథకానికి ఇప్పుడు పెట్టినటువంటి కాలపరిమితిని పొడిగించాలని కోరారు.

చికెన్ వ్యర్థాల వేలంపాటను దక్కించుకున్న అజిలాన్ ఎంటర్ ప్రైజెస్



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని చికెన్, ఇతర మాంస వ్యర్థాల సేకరణకు శనివారం వేలం పాట నిర్వహించారు. కమిషనర్ అమరేందర్ రెడ్డి సమక్షంలో ఈ వేలంపాట జరిగింది. వేలంపాటలో రూ.5.81లక్షలకు అజిలాన్ ఎంటర్ ప్రైజెస్ అధినేత షబ్బీర్ ఈ కాంట్రాక్టును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు లోబడి వ్యర్థాలను స్వీకరించి, ప్రాసెసింగ్ పరిశ్రమలకు తరలించాలని సూచించారు. లేదంటే వేలం రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్వో శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, పలు చికెన్ సెంటర్ల యజమానులు పాల్గొన్నారు.

ఓ సాధారణ కార్యకర్తగా ప్రారంభమై కమ్యూనిస్టు నేతలుగా శిఖరాగ్రానికి చేరిన మహనీయులు వారు. ఎన్ని విద్రోహాలు..! ఎన్నెన్ని విచ్ఛిన్నాలు..! ఈ సంక్షోభాలన్నిటా పార్టీని, వామపక్ష ప్రభుత్వాలను కాపాడుకోవడానికి మొక్కవోని ధైర్యం, ఉక్కు సంకల్పంతో వారు చూపిన నిర్మాణదక్షత అద్భుతం. పార్లమెంటరీ విలువలను కాపాడుకుంటూ, తమ ప్రభుత్వాలను ప్రజారంజకంగా నడిపించిన వారి సారధ్యం అమోఘం. నిర్బంధాలూ, కుట్రలు ప్రభుత్వాలను అతలాకుతలం చేస్తున్నప్పుడు.. అంతులేని సంఘర్షణకు గురవుతూ కూడా ఆత్మస్థైర్యం కోల్పోకుండా గుండెనిబ్బరంతో ప్రభుత్వాన్ని నిలబెట్టడం వారికే చెల్లింది. మిన్ను విరిగి మీద పడ్డా చలించక.. ప్రజ సంక్షేమమే పరమావధిగా పాలన అందించిన ముఖ్యమంత్రులు వారంతా. ఎక్కడా ఇసుమంతైనా అవినీతి పంకిలం అంటని నిష్కళంక నేతలు. వారి సైద్ధాంతిక నిబద్ధత ముందు, కర్తవ్యదీక్ష ముందు వ్యక్తిగత విషయాలు ఏవైనా చాలా స్వల్పమైనవని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి. ముఖ్యమంత్రులుగా వారు తీసుకున్న వేతనాన్ని పార్టీకి ఇచ్చి... పార్టీ ఇచ్చే అలవెన్స్‌తో సాధారణ జీవితాలు గడిపిన సామాన్యుల ముఖ్యమంత్రులు వాళ్లు. సీఎంలకు ఉండే భారీ కాన్వాయ్‌లను, విలాసవంతమైన సౌకర్యాలను వారు త్యజించారు. నిరాడంబర పాలన సాగించిన ఆదర్శనేతలు. సీపీఐ(ఎం) ముఖ్యముంత్రుల సంక్షిప్త పరిచయం..



అసామాన్య సామాన్యులీ ముఖ్యమంత్రులు



తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి

1957 ఎన్నికలలో కేరళలో కాంగ్రెస్‌ను ఓడించి తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి రాగానే భూసంస్కరణలు అమలు చేశారు. భూస్వామ్య వ్యవస్థ నడ్డివిరిచే చర్యలు చేపట్టారు. కార్మికోద్యమాలు, ప్రజాందోళనల పట్ల పోలీసులు అణచివేత విధానాలు అనుసరించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శిస్తూ ప్రజాస్వామిక సంస్కృతి తీసుకొచ్చారు. భూసంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు రెచ్చగొట్టిన కాంగ్రెస్ 356 అధికరణ కింద ఇఎంఎస్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది. 1967లో మళ్లీ వామపక్ష ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆయన తిరిగి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఇంచుమించు మూడేండ్లు వున్న ఆ ప్రభుత్వం అంతకు ముందు అసంపూర్ణంగా మిగిలిపోయిన ప్రజానుకూల కర్తవ్యాలు, విధానాలు పూర్తిచేసింది. 1969లో ఆ ప్రభుత్వం కాంగ్రెస్ కుటట్రలతోనే మరోసారి కూల్చబడింది. ఉద్యమ నిర్మాణం, సైద్ధాంతిక నిర్దేశంతో పాటు సామాజిక సంస్కరణలు, స్థానిక సంస్థల పటిష్టత, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వుండాలని నిరంతరం తపించడమే గాక అందుకు తగు పద్ధతులను కూడా ఆయన తీసుకొచ్చారు. కేరళ మానవాభివృద్ధి సూచికల్లో ముందు నిలవడానికి ఇదో ప్రధాన కారణం.



ఎల్లలు లేని ప్రజాభిమానం

2000 సంవత్సరంలో తొలిసారి ముఖ్యమంత్రి గా పగ్గాలు చేపట్టిన బుద్ధదేవ్.. ఏకంగా 11ఏండ్లు ఆ పదవిలో ఉన్నారు. ఆయన సారధ్యంలో రెండు ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ సొంతం కమ్యూనిస్టు యోధుడిగా పేరు తెచ్చుకున్న బుద్ధదేవ్.. మితభాషి. కానీ, చేతల్లో మాత్రం ఆయన దూకుడుగా ఉండేవారు. 1977లో తొలిసారిగా కోసిపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1987లో జాదవ్‌పూర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. దీని తర్వాత జాదవ్‌పూర్ నుండి ఎన్నికల్లో విజయపరంపర కొనసాగించారు. జ్యోతిబసు హయాంలో ఉప ముఖ్యమంత్రిగా, హోంశాఖ బాధ్యతలు సైతం నిర్వహించారు. ఐదు దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగి 18 ఏండ్లు మంత్రిగా, 11 ఏండ్లు సీఎంగా ఉన్నా ఆయనకు సొంత బంగ్లా, కారు లేదు. జ్యోతి బసు తర్వాత పశ్చిమ బెంగాల్ పాలనను అందిపుచ్చుకున్న ఆయన.. ఎంత తగ్గి జీవించాలో.. ఈ ప్రపంచానికి నేర్పించారు. సాగులో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. గూర్ఖాలాండ్ తిరుగుబాటును ఎదుర్కోవడం, దానికి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనడం ముఖ్యమంత్రిగా ఆయన సాధించిన గొప్ప విజయాలలో ఒకటి. సాంస్కృతిక రంగం, పోలీసు శాఖలలో ఆయన కృషి ప్రశంసనీయం. ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ తీసుకున్న వేతనాన్ని పార్టీకి ఇచ్చేవారు. ఆయనకు పార్టీ నుంచి అప్పట్లో 3200 రూపాయలు వేతనంగా అందుకునే వారు. ముఖ్యమంత్రిగా భారీ కాన్వాయ్‌లు ఆయన పెట్టుకునేవారు కాదు. కేవలం రెండు కార్లు, నలుగురు సిబ్బందితో ఆయన పాలనను సాగించారు. ఆయనకు రెండుగదుల ఒకే ఒక్క ఇల్లు తప్ప మరెక్కడా స్థిరచరాస్తులు లేవు. ఎల్లలు లేని ప్రజాభిమానాన్ని ఆయన సంపాదించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆయన తిరస్కరించారు.



కొత్త శకానికి నాంది

కూతుపరంబ శాసనసభ నియోజకవర్గం నుంచి 1970, 1977, 1991 మూడు సార్లు పినరయి విజయన్ విజయదుంధుబి మోగించారు. 1996లో పయ్యన్నూర్ శాసనసభ్యుడిగా గెలిచి ఇ.కె. నాయనార్ మంత్రివర్గంలో ఆయన విద్యుత్, సహకార మంత్రిగా పనిచేశారు. 2016 శాసనసభ ఎన్నికలలో గెలిచి కేరళ 12వ ముఖ్యమంత్రి అయ్యారు. 2021లో రెండో సారి ధర్మదోం నుంచి ఎన్నికై రెండోసారి ముఖ్యమంత్రిగా కేరళ సంక్షేమానికి కృషి చేస్తున్నారు. 1996 నుంచి ఎల్డిఎఫ్ ప్రభుత్వంలో విద్యుత్, సహకార మంత్రిగా పినరయి విజయన్ పదవీకాలంలో రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తిలో అసాధారణ పెరుగుదలను చూసింది. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ ప్రాజెక్టుల పంపిణీ సామర్థ్యంలో గణనీయమైన మెరుగుదల సాధించింది. విద్యుత్ రంగంలో కొత్త శకానికి నాంది పలికింది. ప్రజల అవసరాలను అర్థం చేసుకున్న మంచి రాజకీయ నాయకుడిగా పరిపాలనా చతురత, అనుభవం, రాష్ట్ర సహకార రంగంలో వివిధ విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టడంలో ఆయనకు సహాయపడింది. ఆయన 1983 నుంచి 1992 వరకు కన్నూర్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా పని చేశారు. RUBCO ఏర్పాటు వెనుక కూడా పినరయి విజయన్‌ది మార్గదర్శక స్ఫూర్తి. ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ పనితీరు అద్భుతమైన విజయం సాధించింది. అచంచలమైన స్ఫూర్తితో తనను తాను స్థిరపరచుకున్నారు. వరదలు, నిఫా వ్యాప్తి, కరోనా వంటి విపత్తులు ఎదురైన అన్ని సందర్భాల్లో కీలక పరిస్థితుల్లో ఆయన అసాధారణ ధైర్యంతో ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. దానికి తోడు, కేరళ అభివృద్ధి, సామాజిక సంక్షేమంలో గణనీయమైన వృద్ధిని సాధించారు. 2021 శాసనసభ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్ విజయానికి ఆయన ప్రభుత్వ దృఢమైన, ప్రభావవంతమైన పనితీరు ప్రధాన కారణం.

జనరంజక పాలకుడు



దేశ రాజకీయాల్లోనే విశిష్ట నేతగా గుర్తింపు పొందిన, ప్రజా సంక్షేమానికి అలు పెరగని పోరాటం చేసిన నాయకుడు కామ్రేడ్ జ్యోతిబసు. 23ఏండ్లు నిరాటంకంగా ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన మార్క్సిస్టు దిగ్గజం. ముఖ్యమంత్రిగా జ్యోతిబసు ఆధ్వర్యంలో సాగించిన లెఫ్ట్ ఫ్రంట్ పాలన బెంగాల్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చింది. కరువు రాష్ట్రంగా కునారిల్లిన పశ్చిమ బెంగాల్‌ను అన్నపూర్ణగా చేసింది. ఇది ఆయన నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆచరించిన ప్రజాసంక్షేమ పాలన ఫలితమే. బిసి రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో అజయ్ ముఖోపాధ్యాయ ప్రభుత్వంలో 1967 నుంచి 1969 వరకు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ రెండేండ్లు కౌలుదార్లు వారి భూమిని వారనుభవించారు. కార్మిక పోరాటాల్లో పోలీసుల జోక్యం లేదు.

1977 ఎన్నికల్లో జ్యోతిబసు ఆధ్వర్యంలో లెఫ్ట్‌ఫ్రంట్ విజయ దుందుభి మోగించింది. అక్కడి నుంచి 2011 వరకు అంటే 34ఏండ్ల పాటు వామపక్ష కూటమి అధికారంలో కొనసాగింది. జ్యోతిబసు నేతృత్వంలో ప్రభుత్వం ఆపరేషన్ బర్గా కింద 14లక్షల మంది బర్గాదార్ల (కౌలుదార్ల)ను నమోదు చేయించారు. 11లక్షల ఎకరాల భూమిని శాశ్వతంగా వారి అధీనంలోకి తెచ్చి, సాగుచేసేవారి హక్కుకు రక్షణ కల్పించారు. భూ సంస్కరణల చట్టం కింద దాదాపు 13.7లక్షల ఎకరాల భూమిని సేకరించి, 10.4లక్షల ఎకరాలను 25లక్షల భూ వసతిలేని సాగుదారు కుటుంబాలకు పునఃపంపిణీ చేశారు. దాదాపు ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా భూ సంస్కరణల కింద పునఃపంపిణీ చేసిన భూమిలో 20శాతం బసు నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వంలోనే పంపిణీ అయింది. భూ సంస్కరణల వల్ల దళితులు, ఆదివాసులు ప్రధానంగా ప్రయోజనం పొందారు. నివాస ప్రాంతాలకూ, పాఠశాలలకూ మధ్య సగటు దూరం తగ్గింది. సామాజిక సూచీలు కూడా ఎంతో మెరుగుపడ్డాయి. కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగాయి. మైనారిటీలకు సామాజిక భద్రత కల్పించడం, ఆర్థిక తోడ్పాటునందించడం ముఖ్య కర్తవ్యంగా పెట్టుకొని ఆ ప్రభుత్వం కృషి చేసింది.

మాస్ లీడర్



బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ... పొట్టగడుపుకున్న అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ రాష్ట్రంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రిస్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి...సీపీఐ(ఎం) ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపై ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. సినిమాల పైరసీ, లాటరీ మాఫియా, అవినీతికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశారు.

నిరాడంబర నాయకుడు



1957లో త్రిపుర టెరిటోరియల్ కౌన్సిల్‌కు నృపేన్ చక్రవర్తి ఎన్నికయ్యారు 1962లో ప్రతిపక్ష నాయకుడయ్యారు. త్రిపుర పూర్తి రాష్ట్ర హోదా పొందిన తర్వాత, ఆయన 1972లో రాష్ట్ర విధానసభ సభ్యుడయ్యారు. 1977లో ఆయన వరుసగా రెండు స్వల్పకాలిక సంకీర్ణ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. 1977లో త్రిపుర ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ గెలిచినప్పుడు నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రి అయ్యారు. 1988 వరకు పదవిలో కొనసాగారు. 1988 ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ఓటమి తర్వాత, ఆయన 1988 నుంచి 1993 వరకు త్రిపుర విధానసభలో ప్రతిపక్ష నాయకుడయ్యారు. 1993 ఎన్నికల్లో, లెఫ్ట్ ఫ్రంట్ మళ్ళీ త్రిపురలో అధికారంలోకి వచ్చింది. ఆయన రాష్ట్ర ప్రణాళిక బోర్డు చైర్మెన్‌గా సేవలందించారు. ముఖ్యమంత్రిగా ఆయన ఏ బట్టల సూట్‌కేస్‌తో వచ్చారో, అధికారిక నివాసం నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆదే బట్టల సూట్‌కేసుతో వెళ్లిన నిరాడంబరుడు.


అ'సాధారణ' ముఖ్యమంత్రి



1972లో 23 ఏండ్ల వయసులో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలో చేరిన నేత మాణిక్ సర్కార్. ఆరేండ్ల తర్వాత, 1978లో, కమ్యూనిస్ట్ పార్టీకి త్రిపురలో మొదటిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయంలో ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు. 1980లో సర్కార్ అగర్తల నియోజకవర్గం నుంచి త్రిపుర శాసనసభలో అడుగు పెట్టారు. ఆ తర్వాత ఆయన సీపీఐ(ఎం) చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. 1983లో కిషన్‌నగర్ నుంచి మరోసారి విజయం సాధించారు. ఆయన అత్యుత్తమ పనితీరు, నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, 1993లో అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ సర్కార్‌ను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. 1998లో సర్కార్ సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. అదే ఏడాది తొలిసారి త్రిపుర ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి సర్కార్ ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి వరుసగా నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా విశేష సేవలందించారు.

దీనితో భారతదేశంలో ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రుల సమూహంలో సర్కార్‌కు స్థానం లభించింది. సీఎంగా ఆయన తనదైన ముద్ర వేశారు. శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమాలు చేపట్టారు. అత్యంత సాధారణ సీఎం మాణిక్ సర్కార్. ఏమాత్రం ఆడంబరాలు ఇష్టపడని సాధారణ ముఖ్యమంత్రి. తన పేరు మీద ఇల్లు లేదు, కారు లేదు. రిక్షాలోనే సెక్రటేరియట్‌కు వచ్చేవారు. అనవసర ఖర్చులకు అసలు ఇష్టపడని వ్యక్తి ఆయన. మాణిక్ సర్కార్ భార్య పంచాలి భట్టాచార్య2011లో కేంద్ర సాంఘీక సంక్షేమ మండలి ఉద్యోగిగా రిటైర్ అయ్యారు. ఆమె జీవితం కూడా సాధారణం. 'అత్యంత స్వచ్ఛమైన' ముఖ్యమంత్రిగా ప్రజల మన్ననలు పొందిన సీఎం మాణిక్ సర్కార్.

పాలనలో సోషలిజం మిళితం



కేరళ చరిత్రలో అత్యంత ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇ.కె. నాయనార్ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. రాష్ట్రాన్ని గణనీయమైన సామాజిక, ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపించారు. ఆయన నిబద్ధత అంకితభావంతో చేసిన పాలనతో కేరళ ప్రగతిశీల విధానాలవైపు దృష్టి సారించింది. మంచి హ్యూమర్ ఉన్న గొప్ప వ్యక్తిత్వం ఆయనది. పేదల అభ్యున్నతి, విద్యను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఆయన విధానాలు రూపొందించారు. సామాజిక న్యాయం, అభివృద్ధిపై దృష్టి పెట్టడం కార్మికవర్గంతో ఆయనకున్న లోతైన సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఆయన ప్రభుత్వం అందరికీ, ముఖ్యంగా బాలికలు, అల్ప ఆదాయ కుటుంబాలకు విద్యను ప్రోత్సహించే విధానాలను ప్రవేశపెట్టింది. ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపరిచే ప్రయత్నాలు రాష్ట్రంలో అధిక ఆయుర్దాయంకు దోహదపడ్డాయి. నాయనార్ ఆకర్షణ పార్టీ శ్రేణులకు అతీతంగా ఉండేది. సాధారణ ప్రజలతో, ముఖ్యంగా కార్మికులు, రైతులతో కనెక్ట్ అయ్యే విధానం ఆయన ఎదుగుదలకు దోహదపడింది. ఎన్నికల విజయాల్లో ఆ సంబంధాలు కీలకపాత్ర పోషించాయి. అభివృద్ధి ఆధారిత పాలనతో సోషలిజాన్ని మిళితం ఎలా చేయాలో చేసి చూపించారు. కేరళ వామపక్ష రాజకీయ స్రవంతిలో నిరంతర ఔచిత్యంలో ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ప్రవేశపెట్టడం, ప్రజలకు అవసరమైన వస్తువులను అందించడానికి 'మావేలి' సరసమైన ధరల దుకాణాలను ప్రారంభించడం, సంపూర్ణ అక్షరాస్యత ప్రచారం, ప్రజా ప్రణాళికతో సహా అధికారాల వికేంద్రీకరణ మొదలైనవి కొన్ని ముఖ్యమైన విజయాలు. ఒక సారి పాలక్కాడ్ నుంచి ఎంపీగా గెలిచారు.

త్రిపుర అభివృద్ధిలో తనదైన ముద్ర



'రాజా దశరథ్' అని గిరిజనులు ముద్దుగా పిలుచుకొనే దశరథ్ దేవ్ రహస్య జీవితం గడుపుతూనే 1952 జనరల్ ఎన్నికల్లో తూర్పు త్రిపుర నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీతో ఎంపీగా గెలిచారు. రహస్యంగా ఢిల్లీ వెళ్ళి, పార్లమెంటులో ప్రత్యక్షమై స్వతంత్ర భారతదేశంలో తాను స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఎందుకులేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీంతో ప్రధాని నెహ్రూ జోక్యంతో దశరథ్‌దేవ్, గణముక్తి పరిషత్ నాయకుల అరెస్ట్ వారెంట్లను రద్దుచేశారు. ఆయన 1952, 1957, 1962, 1967లలో ఎంపీగా ఎన్నికయ్యారు. 1978లో రామ చంద్రఘాట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. దశరథ్‌దేవ్, నృపేన్ చక్రవర్తి, బిరేన్‌దత్తాల నాయకత్వాన గిరిజనుల నాలుగు ముఖ్యమైన డిమాండ్లపై జరిగిన పోరాటం ఫలితంగా 1978లో విస్తృత ప్రజామోదంతో నృపేన్ చక్రవర్తి నాయకత్వంలో ఏర్పడిన వామపక్ష సంఘటన ప్రభుత్వంలో విద్యా, గిరిజన సంక్షేమశాఖల మంత్రిగా పనిచేశారు. వామపక్షసంఘటన ప్రభుత్వంలో 1983 నుంచి 1988 వరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పనిచేశాడు. 1988 నుంచి 1993 వరకు ప్రతిపక్ష నాయకునిగా ఆయన కీలకపాత్ర పోషించారు.

1993 ఎన్నికల్లో 60 స్థానాలకు గానూ 44 స్థానాలు సాధించి సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. 1993 ఏప్రిల్ 10న దశరథ్‌దేవ్ రాష్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 1998 మార్చి11 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. అధికారానికి వచ్చిన వెంటనే త్రిపురలోని వివిధ తిరుగుబాటు గ్రూపుల సభ్యులకు ప్రభుత్వం క్షమాభిక్షను ప్రకటించింది. త్రిపుర రాష్ట్రానికి మొదటి గిరిజన ముఖ్యమంత్రిగా ఆయన గిరిజనుల, పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. గిరిజనుల భాష అయిన కోక్‌బోరక్‌ను రాష్ట్రంలో రెండవభాషగా గుర్తించారు. రాష్ట్రంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య స్నేహ, సామరస్యాల్ని నెలకొల్పటంలో దశరథ్‌దేవ్ ముఖ్యపాత్ర పోషించారు. ఆయన ప్రభుత్వం గ్రామీణపేదలకు పనికి ఆహారం పథకాన్ని అమలు చేసింది. మూడెకరాలలోపు భూమివున్న రైతులకు భూమిశిస్తును రద్దుచేసింది. అమలులో ఉన్న చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు బదిలీచేసిన గిరిజనుల భూములను తిరిగి వారికి అప్పగించింది. గిరిజన స్వయం ప్రతిపత్తి మండలిని ఏర్పాటుచేస్తూ చట్టం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆయన రచించిన "నాస్మృతిపథంలో ప్రజా ఉద్యమాల చరిత్ర, జ్ఞాపకాలు", "గణముక్తి పరిషత్ చరిత్ర" పుస్తకాలు రాష్ట్ర ప్రజా ఉద్యమాల చరిత్రకు సంబంధించి అత్యంత విలువైన పుస్తకాలు.

కష్టసుఖాల కలయికే ఉగాది

అమ్మ లేఖ



వేణు గీతికకు ప్రేమతో...

ఎలా ఉన్నావ్ బంగారు తల్లి? ఉగాది పండుగ వస్తోంది, మొన్న ఒక రోజు అడిగావు 'అమ్మా! ఉగాది పచ్చడిలో ఏమేమి వేసి చేస్తారు' అని. ఇన్నేండ్లుగా నా దగ్గర ఉన్నావు, నేను చేసిన పచ్చడి తినటం, ఆడు కోవడానికి వెళ్ళటం, లేదా చదువుకోవడానికి కూర్చోవడం. నేను ఎప్పుడూ నేర్చుకోమని బలవంత పెట్టలేదు, కాకపోతే ఒక్క విషయం చెప్పేదాన్ని జీవితంలో ఎదురయ్యే కష్ట, సుఖాల కలయికే ఈ పచ్చడి పరమార్థం.

పురాణాల ప్రకారం ఎన్నో కథలు ఉన్నాయి కానీ, ప్రస్తుతం అవి అనవసరం. ఉగాది మన తెలుగు వాళ్ళకే కాదు, కన్నడ వాళ్ళకి కూడా. గుడిప డవాగా మరాఠీలు జరుపుకుంటారు. కొంచెం టూకీగా ఉగాది గురించి చెప్తాను నాన్న. ఉగా అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది.

అంటే సృష్టి ఆరంభమైన దినమే ఉగాది. చైత్ర శుద్ధ పాడ్యమినాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉగాదినాడు పొద్దున్నే లేచి ఇంటిని శుభ్రం చేసుకుని, స్నానం చేసి, దేవుడి దగ్గర దీపం పెట్టి ఉగాది పచ్చడి నైవేద్యంగా పెడతారు. ఈ ఉగాది పచ్చడి ఆరు రుచుల కలయిక. దీనినే షడ్రుచులు అంటారు. బెల్లం, ఉప్పు, వేప పువ్వు, చింతపండు, పచ్చి మామిడి ముక్కలు, కారం.

వీటికి ఒక్కొక్క దానికి నిర్వచనం కూడా ఉంది

బెల్లం: ఆనందానికి ప్రతీక.

ఉప్పు: జీవితంలో ఉత్సాహానికి సంకేతం.

వేప పువ్వు: బాధ కలిగించే అనుభవాలు.

చింతపండు: నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు.

పచ్చిమామిడి ముక్కలు: దీని వగరు కొత్త సవాళ్లకు గుర్తు

కారం: సహనానికి సంకేతం.

ఉన్నంతలో ప్రతి పండగను ఆనందంగా జరుపుకోవాలి. అప్పుడే దీని ద్వారా మీకు, భవిష్య తరాల వారికి వాటి ప్రాముఖ్యత గురించి తెలుస్తుంది. అంతేకాకుండా ఏ పండగ చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే ఏ కోణంలో చూసిన ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. నాన్న కిందటి ఉగాది పండగకి నీ దగ్గరకు వచ్చాము. ఈ సారి నువ్వే అన్ని తెచ్చుకుని చేసుకోవాలి. నువ్వు పండగ వస్తోంది, పచ్చడి ఎలా చేసుకోవాలి అని అడగటం, అది కూడా ఈ సారి ఆదివారం రావడం, నేను అమ్మలేఖ ద్వారా నీకు తెలియ చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

కొత్త బట్టలు వేసుకుని, ఉగాది పచ్చడి చేసుకుని తినే సెయ్. కొంతమంది పిల్లలు షడ్రుచులతో తినలేరని వారి కోసం చెరుకు ముక్కలు, అరటి పండు లాంటివి వేస్తారు. పండుగ నాడు మేము దగ్గర లేమని బాధపడకు చిట్టితల్లి. సంతోషంగా ఉండు. ఏడాదంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటావు.. ఉంటాను...



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి



శక్తికి చిహ్నం నలుపు

ఇటీవల కాలంలో బాడీషేమింగ్ బాగా పెరిగిపోయింది. రంగూ, రూపాన్ని చూపి మహిళలను అవహేళన చేస్తున్నారు. సాధారణ మహిళలు, సెలబ్రెటీలు చివరకు అధికారులు సైతం దీనికి అతీతులు కారు. దానికి ఉదాహరణ ఈ సంఘటన. తన శరీర రంగు గురించి వస్తున్న కామెంట్లపై.. సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ భావోద్వేగ పోస్టు పెట్టారు. ఒక సీఎస్‌గా పనిచేస్తున్నప్పటికీ.. నల్లగా ఉన్నావంటూ వర్ణ వివక్షకు గురి అవుతున్నానని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త రంగుతో తనను పోల్చి కొందరు నెటిజన్లు చేసిన పోస్టులు చూసి.. ఆమె స్పందించారు. ఇంతకీ ఆమె ఎవరు. ఈ రంగు వివాదం ఏంటో తెలుసుకుందాం.

కేరళకు చెందిన శారదా మురళీధరన్ పుట్టుకతో కొంత నల్లగా ఉండేది. ఆమెను చూసి చాలామంది హేళన చేసేవారు. తన శరీర రంగును చూసి నలుగురూ నవ్వడంతో నాలుగేండ్ల వయసులో తల్లికి చెప్పుకొని తీవ్ర వేదనకు గురయ్యింది. కూతురిని బుజ్జగించి ఏదో సర్దిచెప్పింది. అయితే పెరిగిన తర్వాత కూడా ఆ చిన్నారికి అవే ఛీత్కారాలు, అవమానాలు, హేళనలు. కష్టపడి చదివి.. ఐఏఎస్ పాస్ అయి ఉద్యోగం సాధించారు. మరో ఐఏఎస్‌ను పెండ్లి చేసుకున్నారు.

ఎన్నో ఉన్నత పదవులు

1990 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి శారదా మురళీధరన్.. ఆరేండ్ల పాటు కేరళ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన 'కుటుంబ శ్రీ'కి నేతృత్వం వహించారు. ఆ తర్వాత జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. అలాగే త్రివేంద్రం జిల్లా కలెక్టర్‌గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిషన్‌గా.. ఇలా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారు. గత ఏడాది కేరళ చీఫ్ సెక్రటరీ బాధ్యతలు చేపట్టారు. అయితే ఈమె కంటే ముందు అదే స్థానంలో ఆమె భర్త డాక్టర్ వేణు పని చేసి రిటైర్ అయ్యారు. మొదట భర్త.. ఆ వెంటనే ఆ స్థానంలో శారదా మురళీధరన్ నియమితులు కావడం విశేషం.

నలుపు పేరుతో...

గతంలో ఎన్నో ఉన్నత పదువులు చేపట్టి ఇప్పుడు సీఎస్‌గా ఉన్నప్పటికీ నలుపు పేరుతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమెకు వెక్కిరింపులు ఎదురవుతూనే ఉన్నాయి. తర్వాత కొందరు ఆకతాయిలు ఆమె శరీర రంగు గురించి కామెంట్లు చేశారు. భర్త నుంచి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రంగుతో పోల్చుతూ 'ఆ పదవికి మీరేం సరిపోతారు?' అంటూ పోస్టులు పెట్టారు. అయితే ఆమె వీటికి స్పందిస్తూ తాను నల్లగా ఉన్నాను అనే విషయాన్ని తాను అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. మొదట తాను చేసిన పోస్ట్‌కు వచ్చిన కామెంట్లతో కంగారు పడి.. ఆ పోస్ట్ డిలీట్ చేశారు. అయితే ఇలాంటి అంశాలు తప్పనిసరిగా చర్చించాలని.. తన ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు చెప్పడంతో మళ్లీ తిరిగి తన మనసులో ఉన్నది మొత్తం ఆమె షేర్ చేశాను.

నాలుగేండ్ల వయసులోనే...

ఇదే సమయంలో చిన్నతనంలో తాను ఎదుర్కొన్న ఒక అనుభవాన్ని కూడా ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ శరీర రంగు వల్ల చిన్నతనంలోనే ఆమె పెద్ద మాటలు పడాల్సి వచ్చింది. తాను నల్లగా ఉన్నానని.. తన తల్లి వద్దకు వెళ్లి.. తనను గర్భంలోకి తీసుకెళ్లి తెల్లగా, అందంగా తీసుకురాగలవా అని నాలుగేండ్ల వయసులోనే అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే ఆ శరీర రంగు ప్రభావం తనపై 50 ఏండ్ల పాటు కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకానొక సందర్భంలో అందరి లాగే ఆమె కూడా నల్ల రంగుకు విలువ లేదనే భావనలో తెల్లటి రంగు పట్ల ఆకర్షితురాలయ్యారు. దానివల్ల తనను తాను తక్కువ చేసుకున్నారు. కానీ నలుపు అంటే అద్భుతమని, అందంగా ఉందని ఆమె పిల్లలే ఆమెకు తెలియజేశారు. దాంతో 'నలుపు విశ్వం యొక్క సర్వవ్యాప్త సత్యం అయినప్పుడు ఆ రంగును ఎందుకు కించపరుస్తారు' అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు ఇది సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారిసింది. జరగాల్సిన చర్చ జరుగుతోందని చాలా మంది శారదకు సపోర్ట్‌గా కామెంట్లు పెడుతున్నారు. ■



విశ్వావసు ఉగాది



ఈ ఉగాది
విశ్వంభరాన్ని ధరియించి విశ్వావసుగా వచ్చింది.
విశ్వైక ప్రేమతో తరియించి విశ్వమంతా నిలిచింది.
పాతదనంలో కొత్తదనం ఇంధనంలా మెరిసి
అందమైన మామిడి రెమ్మల మాటున బంధంలా
పూత మురిసి
చెరుకు గడ హరివిల్లుగా
మారి ద్వార
తోరణమయ్యింది
పంచాంగ శ్రవణముల
జాడ సాంప్రదాయాల
తీరమయ్యింది
వేపపూల పరిమళాలతో
పులకరించింది
నవ వసంతం
ఋతువుల క్రతువులతో
పలుకరించింది పండుగ
అనునిత్యం
జీవనమాదుర్యపు అనుభూతుల తీపి
మట్టి పాత్రలో నిండిన పచ్చడి రుచి చూపి
దివ్య ఆమనుల ఉగాది వేళ
భవ్య ఆనందాల అనుభవాల హేల
నాలుగు కాలాలు సౌహార్దానికి చెలిమిగా
రంగుల ముంగిళ్ళు
సౌభాగ్యానికి కలిమిగా
అలౌకిక పరిష్వంగంలో నిత్యానందమై,
ఆంతరంగిక భావాల సంరంభంలో
పరవశపు దొందమై,
మనో వాకిళ్ళ, తలపు తలుపులను తడుముతుంది,
కొత్తదనపు ఊట మరో అధ్యాయపు
వూహలను తరుముతుంది
ప్రతి చోటా ఈ ఉగాది విశ్వావసుగా
ఆకారం ధరించింది
ఉషస్సు నిండిన జగతిని
శతమానం భవతిగా దీవించింది

- డా.సముద్రాల శ్రీదేవి,
9949837743

రెండ్రోజులు ఇదేమాదిరిగా ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

రెండు నుంచి మూడు డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. రాష్ట్రంలో శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 40 డిగ్రీలకుపైగా గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయినట్టు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఏప్రిల్ రెండో తేదీన పలు జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల(గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లవేగం)తో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదురుగాలుల వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, మెదక్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికను విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాబోయే 48 గంటల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది. అదే సమయంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రజలకు గవర్నర్, సీఎం

ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం నుంచి శ్రీ విశ్వావసునామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలనీ, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ఇరువురు ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో సమద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివద్ధి సాధించి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ప్రతిఒక్కరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

పలువురు..

ఉగాది శుభాకాంక్షలు తెలిపినవారిలో అసెంబ్లీ స్పీకర్ బి.ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహ తదితరులు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి పేలిన తూటా

(మొదటిపేజీ తరువాయి)

దానిని సాధిస్తాయని ఆయన తెలిపారు.

దట్టమైన అటవీ ప్రాంతంలో కొందరు మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం అందడంతో భద్రతా దళాలు శుక్రవారం రాత్రే అక్కడికి బయలు దేరాయనీ, శనివారం ఉదయం కాల్పులు మొదలయ్యాయని ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ఓ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా దళాలు అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగిస్తున్నాయి. మరి కొందరు మావోయిస్టులు కూడా ఆ ప్రాంతంలో దాక్కొని ఉండవచ్చునని అనుమానిస్తున్నాయి. మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న బస్తర్ డివిజన్‌లోనే సుక్మా జిల్లా ఉంది. ఇటీవలి కాలంలో అక్కడ భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఈ జోన్‌ను అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా అధికారులు గుర్తించారు.

నక్సలిజంను నిర్మూలిస్తామని అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం గమనార్హం. వారం రోజుల క్రితం ఆయన పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో మావోయిస్టుల హింస 53 శాతం తగ్గిందని అమిత్ షా తెలిపారు.

అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ యాప్ ప్రారంభించిన మూడు వారాల వ్యవధిలోనే మూడు వందల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేశారు. స్వీయ బహిష్కరణ వేటు పడిన అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది. ప్రతి రోజూ ఈ చర్యలు కొనసాగుతాయి. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వీసాలను రద్దు చేస్తాం' అని స్పష్టం చేశారు. 'ఎవరు రావాలో, ఎవరు రాకూడదో నిర్ణయించే అధికారం ప్రతి దేశానికీ ఉంటుంది' అని అన్నారు. కాగా సోషల్ మీడియా పోస్టుల పరిశీలన ఆధారంగా అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు పడుతోంది. అకడమిక్ స్టడీ వీసా (ఎఫ్), ఒకేషనల్ స్టడీ వీసా (ఎం), ఎక్స్ఛేంజ్ వీసా (జే)....ఇలా ఏ వీసా కోసమైనా కొత్తగాదర ఖాస్తు చేసే వారి సోషల్ మీడియా పోస్టులను కూడా జల్లెడ పడతారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇస్తున్నట్లు తేలితే అమెరికాలో చదువుకోకుండా దరఖాస్తుదారులను నిషేధిస్తారు. ఓ తాజా నివేదిక ప్రకారం అమెరికాలో 11 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. వీరిలో 3.31 లక్షల మంది భారతీయ విద్యార్థులే.

ఈ మెయిల్‌లో ఏముంది?

'అమెరికా విదేశాంగ శాఖ తరఫున బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా కార్యాలయం తెలియజేస్తున్న విషయమేమంటే మీకు వీసా జారీ చేసిన తర్వాత కొంత అదనపు సమాచారం లభించింది. దాని ఆధారంగా అమెరికా ఇమ్మిగ్రేషన్-నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 221 (ఐ) ప్రకారం మీ ఎఫ్-1 వీసాను రద్దు చేస్తున్నాము. ఈ విషయాన్ని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి తెలియజేశాము. వారు మీ వీసా రద్దు సమాచారాన్ని మీరు విద్యాభ్యాసం చేస్తున్న సంస్థకు తెలియజేస్తారు. చట్టబద్ధమైన ఇమ్మిగ్రేషన్ హోదా లేకుండా అమెరికాలో నివసిస్తే జరిమానా, నిర్బంధం, తిప్పిపంపడం వంటి చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసా పొందడానికి మీరు అనర్హులు కూడా కావచ్చు. స్వీయ బహిష్కరణ వేటు పడిన వారు అమెరికాలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని గమనించండి. మిమ్మలను మీ స్వదేశానికి కాకుండా ఇతర దేశాలకు పంపవచ్చు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వీసా రద్దయిన వారు సీబీపీ హోమ్ యాప్‌ను ఉపయోగించి అమెరికాను వదిలి వెళ్లేందుకు తమ సుముఖత తెలియజేయవచ్చు. అమెరికాను వదలబోయే ముందు మీ పాస్‌పోర్టును వ్యక్తిగతంగా అమెరికా రాయబార కార్యాలయంలో కానీ, వీసా జారీ చేసిన కాన్సులేట్‌లో కానీ విధిగా సమర్పించాలి. వారు దానిని భౌతికంగా రద్దు చేస్తారు. వీసా రద్దయినందున దానిని ఉపయోగించేందుకు ప్రయత్నించకూడదు. భవిష్యత్తులో అమెరికా రావాలని అనుకుంటే మరో వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. మీరు వీసాకు అర్హులా కాదా అనే విషయాన్ని ఆ సమయంలో నిర్ధారిస్తారు' అని అంతర్జాతీయ విద్యార్థులకు పంపిన ఈ మెయిల్స్‌లో వివరించారు.

స్క్రీన్‌షాట్లను భద్రపరచండి

ఈ నెల 25వ తేదీ నుండే విద్యార్థులకు ఈ మెయిల్స్ పంపుతున్నారని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించాలని రుబియో ఆంతరంగిక ఆదేశాలు జారీ చేశారు. అమెరికా వీసాలు పొందడం జన్మహక్కుగా భావించకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారు దేశం విడిచి వెళ్లిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 'సోషల్ మీడియా పోస్టులను క్షుణ్ణంగా పరిశీలించండి. అవమానకరమైన సమాచారం కన్పిస్తే వాటి స్క్రీన్‌షాట్లు తీసి భద్రపరచాలి. దరఖాస్తుదారులు తమ పోస్టులను తొలగించేందుకు, మార్చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉన్నందున వాటిని జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది' అని ఆయన తన ఆదేశాలలో కాన్సులర్ అధికారులకు సూచించారు.

అందాల పోటీల పేరిట వ్యాపారం

(మొదటిపేజీ తరువాయి)

పోటీలెలా అవుతాయని ప్రశ్నించారు. తెలంగాణది మట్టిమనుషుల కల్చర్ అనీ, పోరాటాల గడ్డ అని చెప్పారు. ఫ్యూడల్ వ్యవస్థకు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్లు, నిజాంరాజుకు వ్యతిరేకంగా ఒడిసెలు, గన్నులు పట్టి ఆనాడు పోరాడిన పాలకుర్తి ఐలమ్మ, సాలమ్మ, కమలమ్మ స్వరాజ్యం లాంటి ఎందరో మహిళలను ఈ సందర్భంగా గుర్తుచేశారు ఆయా దేశాల్లో వనరులను కొల్లగొట్టేందుకు, వినిమయ సంస్కృతిని ప్రోత్సహించేందుకు కార్పొరేట్లు అందాల పోటీలను ఇలాంటి గడ్డ మీద నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉండి కూడా ఈ అందాల పోటీలు నిర్వహించడమేంటని నిలదీశారు. అంగట్లో మహిళను నిలబెట్టడం కిచెన్ టూ కింగ్ మేకర్ ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. ఆ అందాల పోటీలను నిర్వహించకుండా ఉపాధి కూలీలకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు కనీస వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అందం ఆత్మగౌరవానికి ప్రతీక కాదని స్పష్టం చేశారు. మహిళలను వినిమయ వస్తువుగా చూస్తున్న పితృస్వామిక వ్యవస్థను తప్పుబట్టారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు సంధ్య మాట్లాడుతూ.. ఆ అందాల పోటీలను నిర్వహించకుండా ఉపాధి కూలీలకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు కనీస వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అంగాంగ ప్రదర్శనలు చేసే అందాల పోటీలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఎలా అవుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావును ప్రశ్నించారు. కొలతలను బట్టి ఒక మహిళ అందాన్ని నిర్ధారించడమేంటి? అసలు మహిళ దేహాన్ని కొలతలు వేసే అధికారం వారికెక్కడిది అని నిలదీశారు. మేకప్ కిట్లు, మెరిసేందుకు వాడే క్రీమ్‌లలో పాదరసం ఉంటుందనీ, అది క్యాన్సర్ కారకమని చెప్పారు. స్త్రీని వినిమయ వస్తువుగా చూడటం ఆత్మగౌరవం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అందాల పోటీల్లో గెలిచే యువతి స్పాన్సర్లు చెప్పినట్టు నడుచుకోవాలన్నారు. ఇలా చేయడమంటే ఆ మహిళ హక్కులను హరించడమే అవుతుందని నొక్కి చెప్పారు. స్త్రీహక్కులను హరించడానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్త్రీ,పురుష సమానత్వం కోసం విధివిధానాలు రూపొందించాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, అనసూయ (పీఓడబ్ల్యూ), ఆశాలత(ఐద్వా) జ్యోతి(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), స్వరూప(పీఓడబ్ల్యూ), శాంత (బీఎస్పీ), జయ (చైతన్య మహిళా సంఘం), అరుణ(ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం), హేమలత(ఏఐఎమ్ఎస్ఎస్), గిరిజ(మహిళా రచయితల వేదిక), జ్యోతి(కుల నిర్మూలన సంఘం), సత్య, జ్యోతి, కోట రమేశ్(డీవైఎఫ్ఐ), ప్రదీప్(పీడీఎస్‌యూ-ప్రోగ్రెసివ్ యూత్ లీగ్), మహేశ్ (పీడీఎస్‌యూ), రాము (విరసం), జాన్ (ప్రజా కళామండలి), తదితరులు పాల్గొన్నారు.



ప్రజావసరాలకే లింక్ రోడ్లు

విస్తరణతోపాటు కొత్తవి నిర్మించాలి : హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై హెచ్ఐసీసీలో సీఎం రేవంత్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణ ం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో విశాల ప్రజా ప్రయోజనాలను దష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకో వాలన్నారు. ఆయా రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని అభిప్రాయ పడ్డారు. ఇందులో భాగంగా అదనపు భూసేకరణకు కొంత అధికంగా ఖర్చయి నా వెనుకాడొద్దని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిశోర్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పదేండ్లు నేనే ఉంటా..

నవతెలంగాణ-కొడంగల్

'నాకు రాష్ట్రాన్ని పాలించే శక్తినిచ్చిందే కొడంగల్ ప్రజలు. నేను మీకు ఏం చేస్తానో.. ఏం చేయనో.. నా గురించి మీ కంటే ఎక్కువగా ఎవరికీ తెలియదు.. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి.. మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదు.. చిట్టీ రాసిస్తే.. నేను కొడంగల్‌కు వచ్చి అన్నీ పూర్తి చేయిస్తా..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పదేండ్లు ముఖ్యమంత్రి కుర్చీ కొడంగల్‌కే ఉంటుందన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో సీఎం పర్యటించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, నారాయణపేట్ కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ నారాయణరెడ్డి సీఎంకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి శ్రీమహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం చేరుకున్నారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో బాజాభజంత్రీలతో సీఎంకు స్వాగతం పలికారు. 45వ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా స్వామివారికి రేవంత్‌రెడ్డి శేష వస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి, వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం కొడంగల్‌లోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు తనకు గొప్ప అవకాశం ఇచ్చారని, రాష్ట్రాన్ని పరిపాలించే శక్తినిచ్చారన్నారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందని దు:ఖం ఉండొచ్చు.. వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీకి వస్తే వినాల్సి వస్తుందని, వింటే పడాల్సి వస్తుందని కేసీఆర్ రావడం లేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను ఏం చేశానో.. చేస్తానో ఇక్కడి ప్రజలకు తెలుసునని అన్నారు. వక్ఫ్ బిల్లు అంశాన్ని అక్బరుద్దీన్ కంటే మొదటగా లేవనెత్తింది తానేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి 25 శాతం మంజూరు చేశామన్నారు ఒక్క సంతకంతో కొడంగల్‌కు ఏం కావాలన్నా చేసుకోవచ్చని.. ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని అన్నారు. చిన్న చిట్టీ రాసిస్తే.. అన్ని పనులూ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, ఈఓ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో..

కొడంగల్‌లోని తన నివాసంలో జరిగిన 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్' జిల్లా సన్నాహక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో మాట్లాడారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ప్రజలు కనిపించని దేవుడిగా అంబేద్కర్‌ను కొలుస్తున్నారన్నారు. అలాంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ప్రతీచోట సమావేశాలు నిర్వహించి అంబేద్కర్ స్ఫూర్తిని చాటుతున్నామన్నారు. పదేండ్లలో కొడంగల్‌ను గొప్పగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఇక్కడ కొంతమందిని రెచ్చగొట్టి చిచ్చుపెట్టి భూసేకరణను అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన వారికి ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో ఇంటికి రెండు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తనదన్నారు. కొడంగల్ భూముల విలువ ఎకరానికి కోటికిపైగా కావాలంటే ఇక్కడ అభివృద్ధి జరగాలన్నారు.

పారదర్శకత ఎంత?

కోవిడ్ వ్యాక్సిన్ పరిశోధనలకు ప్రజాధనం

- ప్రయివేటు ఫార్మా కంపెనీలతో ఐసీఎంఆర్, బీఐఆర్ఏసీ ఒప్పందాలు
- కంపెనీలకు అనుకూలంగా నిబంధనలు
- పేటెంట్‌ల కోసం ప్రయివేటు కంపెనీల దరఖాస్తులు
- ఇప్పటికీ అనేక సందేహాలు
- ఆర్టీఐ అప్లికేషన్ల తిరస్కరణ



భారత్‌తో పాటు ప్రపంచాన్ని 2020లో కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేసింది. పలు దేశాలు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేయటానికి పూనుకున్నాయి. భారత ప్రభుత్వం వివిధ రకాల రోగ నిర్ధారణలు, మందులు, వ్యాక్సిన్ల అభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నట్టు ప్రకటించింది. జనవరి, 2023 నాటికి ప్రభుత్వం తమ ఫండింగ్ విజయవంతమైందని ప్రకటించింది. ఫలితంగా ప్రయివేటు రంగ భాగస్వామ్యాలతో నాలుగు స్వదేశీ కోవిడ్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేయటం జరిగిందని తెలిపింది.

న్యూఢిల్లీ : ఈ నాలుగు వ్యాక్సిన్ల అభివృద్ధి విషయంలో మహమ్మారి సమయంలో భారతీయులకు అవసరమైన వ్యాక్సిన్లు, సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రయివేటు రంగానికి ప్రజా ధనాన్ని అందజేస్తూనే ప్రజా ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించిందా లేదా అన్నదానిపై లోతైన చర్చ జరగలేదని విశ్లేషకులు చెప్తున్నారు. ఒకపక్క, ప్రభుత్వ నిధులతో పరిశోధనలు జరిపిన ప్రయివేటు కంపెనీలు పేటెంట్ పొందేందుకు ప్రయత్నాలు చేయగా.. మరోపక్క, కోవిడ్ వ్యాక్సిన్లను అభివృద్ధి చేయటానికి కేంద్రం భారతీయ ఔషధ కంపెనీలకు ప్రజా ధనాన్ని అందజేసిన నిబంధనలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

కరోనా మహమ్మారి విజృంభిస్తున్న కాలంలో ఆయా దేశాలు పలు టీకాలు కనుగొన్నాయి. భారత్‌లోనూ కోవాక్జిన్, ఇంట్రానాసల్ వాక్సిన్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ అనే మూడు టీకాల అభివృద్ధి జరిగింది. వీటిలో మొదటిది కోవాక్జిన్. ఐసీఎంఆర్, భారత్ బయోటెక్ అనే ప్రయివేటు సంస్థ సంయుక్తంగా దీనిని అభివృద్ధి చేశాయి. భారత్ బయోటెక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వ్యాక్సిన్ మేధోసంపత్తిని ఐసీఎంర్, భారత్ బయోటెక్ మధ్య పంచుకోవాలన్న విషయాన్ని పార్లమెంటులో ప్రభుత్వం తెలిపింది. అయితే, 2020లోనే కోవాక్జిన్ కోసం భారత్ బయోటెక్ పేటెంట్ కోసం దరఖాస్తును చేసిందని 2023లో తెలిసింది. అయితే, ఇందులో సహ-దరఖాస్తుదారుగా ఐసీఎంఆర్‌ను, పబ్లిక్ సెక్టార్ సైంటిస్ట్‌లను ఎందుకు చేర్చలేదన్నది ఆశ్చర్యం కలిగించకమానదు. దరఖాస్తు దాఖలుచేసినపుడు ఐసీఎంఆర్‌తో తమకు ఎంఓయూ యాక్సెస్ లేదని కంపెనీ వెల్లడించటం గమనార్హం. ఆ తర్వాత కంపెనీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ(ఎన్ఐవీ)ని సహదరఖాస్తుదారుగా, ఎన్ఐవీ శాస్త్రవేత్తలను సహ-ఆవిష్కర్తలుగా చేరుస్తూ ఇండియన్ పేటెంట్ ఆఫీసు అనుబంధ పత్రాలను దాఖలు చేసింది.

కంపెనీలకు అనుకూలంగా నిబంధనలు

మరోరెండు వ్యాక్సిన్లు ఇంట్రానాసల్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌లకు బయోటెక్నాలజీ విభాగం మిషన్ కోవిడ్ సురక్షా ద్వారా నిధులు అందాయి. మిషన్ కోవిడ్ సురక్షా బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్ఏసీ) ద్వారా నిర్వహించబడుతుంది. కోవిడ్ సంబంధిత వ్యాక్సిన్లు, డయాగ్నస్టిక్స్ అభివృద్ధి కోసం ఈ కార్యక్రమానికి రూ. 900 కోట్లు కేటాయించినట్టు ప్రభుత్వం తెలిపింది. డిసెంబర్ 2020లో బీఐఆర్ఏసీ ఈ ప్రోగ్రామ్ కింద నిధుల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో నిబంధనలు వ్యాక్సిన్లు డెవలప్ చేసే కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయి. వ్యాక్సిన్లను అభివృద్ధి చేసే కంపెనీలు ప్రజా డబ్బుతో అభివృద్ధి చేసిన సాంకేతికతలకు పేటెంట్ దరఖాస్తులు దాఖలు చేయటానికి హక్కును కల్పిస్తుంది. వ్యాక్సిన్ల అభివృద్ధిలో ఐసీఎంఆర్, బీఐఆర్ఏసీ, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌లు భారత ట్యాక్స్ పేయర్ల ప్రయోజనాలను కాపాడుతూ, నిధులను ప్రయివేటు కంపెనీలకు అందజేసే నిబంధనలకు సంబంధించి పారదర్శకత చాలా ముఖ్యం.ఎందుకంటే, ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ల తయారీదారుగా ఉన్న సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా బాలీవుడ్ చిత్రాలను నిర్మించే, నష్టాల్లో ఉన్న ధర్మా ప్రొడక్షన్‌లో వాటా కొనుగోలుకు రూ.వెయ్యి కోట్లు వెచ్చించింది.అలాగే, భారత్‌లో అత్యంత లాభాల్లో నడిచే ఫార్మా కంపెనీలలో ఒకటైన అరబిందో ఫార్మా.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌లో భారీగా ఖర్చు చేసింది. అయితే, ఈ రెండు కంపెనీలకూ వ్యాక్సిన్ల అభివృద్ధిలో చెప్పుకోదగ్గ ట్రాక్ రికార్డు లేదు. కాబట్టి, వ్యాక్సిన్ల అభివృద్ధిలో భాగంగా ప్రయివేటు కంపెనీలకు ప్రజా ధనాన్ని వెచ్చించిన విషయంలో పారదర్శకత చాలా ముఖ్యమనీ, వాటిని కేటాయించిన తీరు ప్రధానమని విశ్లేషకులు చెప్తున్నారు. భారత్ బయోటెక్, జెన్నోవా బయోఫార్మాస్యూటికల్స్‌తో కుదిరిన ఫండింగ్ అగ్రిమెంట్ల గురించి సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఐసీఎంఆర్, బీఐఆర్ఏసీలను ప్రతులను అడిగితే.. మేధో సంపత్తిని కారణంగా పేర్కొంటూ దరఖాస్తులను తిరస్కరించటం గమనార్హం.







దండకారణ్యంలో నరమేధం ఆపాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మందికిపైగా మావోయిస్టు పార్టీ గెరిల్లా దళం సభ్యులు చనిపోయారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలిపింది. వరుస ఎన్‌కౌంటర్లతో దండకారణ్యంలో నరమేధం జరుగుతున్నదని విమర్శించింది. దాన్ని వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆపార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పచ్చటి అడవుల్లో నెత్తురు ఏరులై పారుతున్నదని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాల్లో భాగంగా బడా కార్పొరేట్ ంపెనీల మార్కెట్ కోసం ఆదివాసీలను, విప్లవోద్యమకారులను వేటాడి చంపుతున్నదని విమర్శించారు. నిత్యం శాంతి దూతలుగా కీర్తించుకునే రాజ్యం మరింత హింసాపూరితంగా నరమేధాన్ని కొనసాగిస్తున్నదని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఆర్థిక, రాజకీయ సమస్యగా చూడాలనీ, చర్చలు జరపాలని కోరారు. ఆదివాసీల బతుకులను కాపాడాలని సూచించారు. పౌరసమాజం స్పందించి ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండపై నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నరమేధపు హత్యాకాండను తీవ్రంగా ఖండించారు. అదానీ, అంబానీ తదితర బడా కార్పొరేట్ కంపెనీల మార్కెట్ కోసం ఆదివాసీలను నిర్మూలించే విధానాన్ని, ఆదివాసీ గిరిజన ప్రాంతాల కబ్జా కోసం జరిగే ఈ మారణకాండను ఖండిస్తున్నామని తెలిపారు.





జీపీవోలుగా మాజీ వీఆర్‌వోలు, వీఆర్ఏలు

- విధి,విధానాలు ఖరారు
- సర్కారు జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గ్రామ పరిపాలన అధికారులుగా మాజీ వీఆర్‌వోలు, వీఆర్ఏల నియామకంపై సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. విధి, విధానాలు ఖరారు చేస్తూ రెవెన్యూ శాఖ ఆదేశాలి చ్చింది.డిగ్రీ అర్హత ఉన్న మాజీ వీఆర్‌వోలు, వీఆర్ఏలను జీపీవోలుగా అవకాశం కల్పించనుంది. ఇంటర్‌తోపాటు ఐదేండ్లు వీఆర్‌వో లేదా వీఆర్ఏగా అనుభవం ఉన్నవారు దీనికి అర్హులు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ పేర ఆదేశాలు వచ్చాయి. వీరిని సీసీఎల్ఏ నియమిస్తారు. గ్రామ ఆర్థిక లెక్కలు చూడటం, ఆయా ధృవపత్రాల జారీకి విచారణ చేయడం, గ్రామపరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటం, చెరువులు, నీటివనరులు, వాటిరక్షణ బాధ్యతలు చూడటం, భూసంబంధమైన సమస్యలు విచారించడం, సర్వేయర్లకు సహకరించడం, ప్రకృతివైపరీత్యాల నిర్వహణ, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం, ఎన్నికల సంబంధమైన విధులకు సహకరించడం, ఆయా శాఖల అధకారులకు తోడ్పాటునందించడం, ఇతర ప్రభుత్వ సంబంధమైన విధులను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





క్రైస్తవ యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్రైస్తవ యువతీ, యువకులకు ఉపాధి కల్పన కోసం నైపుణ్య శిక్షణా సంస్థల నుంచి తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొంషన్ భాగస్వామ్య ఒప్పందం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ పి సబిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శిక్షణా సంస్థలు ఎన్ఎస్‌డీసీ, టీఏఎస్‌కే, ఈజీఎంఎం, ఎంఈపీఎంఏ,ఎన్ఐ-ఎంఎస్ఎంఈ, కేంద్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నమోదైన వారి భాగస్వామ్యంలో పని చేసిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన శిక్షణా సంస్థలు క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీతో 2024-25 ఏడాదికి గాను అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమీకరణ, దరఖాస్తుల తనిఖీ, ఎన్నిక బాధ్యత శిక్షణా సంస్థలదేనని పేర్కొన్నారు. విద్యార్థుల జాబితాను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిచే ధృవీకరణ తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన శిక్షణా సంస్థల నుంచి రెండు సెట్ల ప్రతిపాదనలు ఎండీ-టీజీసీఎంఎఫ్‌సీ హైదరాబాద్ కార్యాలయంలో వచ్చే నెల ఐదు సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తు చేయాలని సూచించారు.

మెహందీ ఆర్టిస్ట్ పింకీ ఆత్మహత్య

- అత్తాపూర్ పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్



ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మెహందీ ఆర్టిస్ట్ పింకీ శర్మ(32) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన పింకీశర్మ మెహందీ ఆర్టిస్టుగా పని చేస్తోంది. ఏడాది కిందట అమిష్ లోయా అనే వ్యక్తిని పెండ్లి చేసుకుంది. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం మరోమారు ఇద్దరు గొడవపడ్డారు. దాంతో భర్త పింకీని ఇంట్లో ఉంచి బయట నుంచి తాళం వేసి వెళ్లిపోయాడు. ఇంట్లో ఉన్న పింకీ తీవ్ర మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పింకీ మృతికి భర్త వేధింపులు, కుటుంబ కలహాలే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

లేఔట్‌లో రైతుబంధు.. ఉచిత కరెంట్

నాలా కన్వర్షన్ లేదంటూ పట్టాదారుల బెదిరింపులు

కోర్టుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేత

మరోవైపు అక్రమ కమర్షియల్ నిర్మాణాలు

అనుమతి పొందిన లేఔట్లలో రోడ్లు, పార్కు స్థలాల కబ్జా

హైడ్రా పరిశీలనలో సిటీ శివార్లలో వెలుగు చూస్తున్న నిజాలు

స్థానికుల ఫిర్యాదుతో ఆక్రమణలను కూల్చేస్తున్న హైడ్రా

హడలిపోతున్న రాజకీయ నేతలు, భూ యజమానులు, కబ్జాదారులు

పాత లేఔట్లకు అక్రమంగా వ్యవసాయ భూమి పట్టాలు



పట్టించుకోని మున్సిపల్, మండల అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యవసాయ భూములకు రైతుబంధు, ఉచిత కరెంట్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఇదే అదనుగా.. కొంతమంది రాజకీయనేతలు, భూ యజమానులు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గతంలో గ్రామ పంచాయతీల ద్వారా అనుమతి పొందిన లేఔట్లకు అక్రమంగా వ్యవసాయ భూమి పట్టాలు తీసుకుని, రైతుబంధు ఉచిత కరెంట్ పొందుతున్నారు. ఇప్పుడు ఆ యజమానులే నాలా కన్వర్షన్ లేదంటూ అనుమతి పొందిన లేఔట్లలో రోడ్లు, పార్కు స్థలాలను కబ్జాచేసి వాటిని వ్యవసాయ భూములుగా అక్రమంగా పట్టాలు పొందుతున్నారు.

పలుకుబడిన రాజకీయ నేతల అండదండలతో అధికారులను మ్యానేజ్ చేసి అక్రమంగా అవే నెంబర్లలో వ్యవసాయ పట్టాలుగా చూపడంతో దర్జాగా ప్రభుత్వ పథకాలను పొందుతున్నారు. మరోవైపు వ్యవసాయ భూములంటూ కమర్షియల్ నిర్మాణాలు చేపడుతూ లీజ్‌లకు ఇస్తున్నారు. వీటికి మున్సిపల్ కార్పొరేషన్, మండల అధికారుల పర్మిషన్ కూడా ఉండదు. అడిగేవారు లేకపోవడంతో దర్జాగా పని చేసుకుంటూ పోతున్నారు. చుట్టుపక్కల వారు అడిగితే బెదిరించి నోరు మూయించేస్తున్నారు. వ్యవసాయ భూములంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కోర్టుల్లో పిటీషన్‌లు వేసి కాలం గడుతుండటం గమనార్హం. ఇటీవల ఆయా కాలనీలు, సంస్థల నుంచి ఫిర్యాదులు రావడంతో హైడ్రా అధికారులు స్థానికంగా వెళ్లి పరిశీలించారు. ఇందులో అనేక విషయాలు వెలుగు చూశాయి. ఒక్కోచోట ఒక్కో చీకటి బాగోతం బయటకు వస్తున్నాయి. మీడియాలోనూ వస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదులతో హైడ్రా సిబ్బంది రంగంలోకి దిగి ఆక్రమించిన ప్రభుత్వం స్థలాలను రక్షించడంతో పాటు అనుమతి పొందిన గ్రామ పంచాయతీ లేఔట్లలో పట్టాదారులు ఆక్రమించిన రోడ్లను, పార్కు స్థలాలను రక్షించి స్థానికులకు అప్పగిస్తున్నారు. హైడ్రా అధికారుల రాకతో రాజకీయ నేతలు, భూ యజమానులు, భూ కబ్జాదారులు హడలిపోతున్నారు. తమ ఫిర్యాదులకు వెంటనే స్పందన, సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

తాజాగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో స్టేడియం నిర్మాణం, కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. వాటిని హైడ్రా అధికారులు కూల్చేశారు. ఆక్రమించిన పార్కు స్థలాలను రక్షించారు. పెట్రోల్ బంకును కూడా వ్యవసాయ భూమిలోనే అనుమతులు లేకుండా నిర్మించారని ఫిర్యాదులున్నాయి. ఇటీవల అల్మాస్‌గూడలోని నాలుగో వార్డు పరిధిలోని బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీని హైడ్రా అధికారులు తిరుమలేష్ బృందం స్థానికుల ఫిర్యాదు మేరకు సందర్శించారు.

పట్టాదారుల బాగోతాలు..

కొన్నేండ్ల కిందటే భూ యజమానులు 2008-09లో కొంత, 2014లో సర్వే నెంబర్ 39, 40, 41, 42, 44లో 5.7 కుంటల భూమిలో పాత గ్రామ పంచాయతీ లేఅవుట్ మేరకు భూయజమానులు ప్లాట్లు చేసి విక్రయించారు. లేఔట్‌లో నాలుగు రోడ్లు, పార్క్ స్థలం ఉంది. కానీ, వాటిని చూపే స్థలాలను అమ్ముకున్నారు. అప్పటికీ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడలేదు. అయితే, ఇప్పుడు అది వ్యవసాయ భూమి అని, పాసుపుస్తకాలు ఉన్నాయని భూ యజమానులు చెబుతున్నారు. లేఔట్ చేసి, సగం అమ్మాక వ్యవసాయ భూమిగా పాస్ పుస్తకాలు ఉన్నాయని చెబుతున్నారు. అంతటితో ఆగకుండా ఆ లేఔట్‌లో రోడ్డును కూడా కబ్జా చేశారు. తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు ఎన్నిసార్లు భూ యజమానులను కోరినా పట్టించుకోలేదు. "మీకు రోడ్డు ఇచ్చేది లేదు. ఆ భూమి మాది' అంటూ దబాయించారు. చివరకు కాలనీవాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఇల్లీగల్ లేఔట్ అయితే ఇన్ని సంవత్సరాలు ఏమి చేశారని, ప్లాట్ల అమ్మకాలు చేసిందెవరని హైడ్రా పట్టాదారులను ప్రశ్నించింది. వ్యవసాయ భూమి కాబట్టే తమకు ఇండ్లు కట్టుకోవడానికి అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని పట్టాదారులు చెప్పగా.. అమ్మిన ఇండ్లకు ఎవరు అనుమతులు ఇచ్చారని, కరెంట్ బిల్లులు, ఆస్తి పన్ను ఎలా వసూలు చేస్తున్నారని ప్రశ్నించడంతో కంగుతిన్నారు. ఇండ్ల నిర్మాణానికి అనుమతి లేకపోవడంతో లక్షల రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ తీసుకుని రెండు పెద్ద ఇండ్ల నిర్మాణం ఎలా చేశారని, వారికి ఎవరు అనుమతి ఇచ్చారని, ఎల్ఆర్ఎస్ ఎలా కట్టించుకున్నారని హైడ్రా ప్రశ్నల వర్షం కురిపించింది. వ్యవసాయ భూమి కావడం వల్లే రైతుబంధు తీసుకుంటున్నామని, ఉచిత కరెంటు వస్తోందని భూ యజమాని చెప్పారు. అలా అయితే, కమర్షియల్ స్టేడియం నిర్మాణం ఎలా చేపడుతున్నారని హైడ్రా అధికారి తిరుమల్ వారిని ప్రశ్నించారు. ఇటీవల పట్టాదారులు కోర్టుకు వెళ్లిన సమయంలోనూ వారి పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న అధికారి మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్ పరిధిలోని బోయపల్లి ఎంక్లేవ్ కాలనీ వాసులకు పాత లేఅవుట్ ప్రకారం రోడ్డు సౌకర్యం కల్పించాలని హైడ్రా అధికారి సూచించారు. పెడచెవిన పెట్టడంతో హైడ్రా అధికారులు ఆక్రమణలను కూల్చివేసి నాలుగు రోడ్లు, పార్కు స్థలాన్ని కాలనీవాసులు తిరిగేందుకు, ఉపయోగించేందుకు అవకాశం కల్పించారు. పదిహేనుండ్లుగా లేని వ్యవసాయ భూమి ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందని మీడియా ప్రశ్నిస్తోంది. ఇదే విషయమై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కూడా కాలనీ వాసులకు లేఔట్ ప్రకారం రోడ్లు అప్పగించాలని, పార్క్ స్థలాన్ని ఇవ్వాలని పట్టాదారులకు సూచించారు. ఆక్రమణలు కూల్చివేత సమయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది కూడా ఉన్నారు. రోజుకొకటి వెలుగుచూడటంతో ఇలాంటి ఆక్రమణలు ఎన్ని ఉన్నాయన్నది ఆలోచించాల్సిందే. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రైతుబంధు, ఉచిత కరెంట్, అనుమతులు లేకుండా కమర్షియల్ నిర్మాణాలు చేసే వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాలు కూడా ఇటువంటి కేసుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధితుల పక్షాన నిలబడాలని జనం కోరుతున్నారు.



కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. లేబర్ కోడ్‌లు రద్దయ్యేందుకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికవర్గాన్ని కోరారు. శనివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సీఐటీయూ సమ్మె సన్నాహక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను నిలిపివేయాలని, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపడుతున్న అఖిలభారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం సాధించుకున్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మిక ద్రోహానికి పాల్పడిందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రయివేటీకరణను మరింత వేగవంతం చేసిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను దూరం చేసిందన్నారు.

ఆశాలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మెడికల్ అండ్ హెల్త్, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, ఐకేపీ వీఓఏలు ఇతర రంగాల కార్మికులు దేశ వ్యాప్తంగా కనీస వేతనాల కోసం, ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాల కోసం పోరాటాల నిర్వహిస్తుంటే.. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును దూరం చేసి 12 గంటల పని దినాన్ని చట్టబద్ధం చేసి, కార్మికులను దోచుకునేందుకు చట్టాల్లో మార్పులు చేసిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, నిర్మల్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శులు నవీన్ కుమార్, డి.వెంకటమ్మ నక్క లక్ష్మణ్, నాయకులు ఆర్.సురేందర్, పండుగ పోచ్చన్న, దర్శనాల నగేష్, ఎ.సంతోష్, అశోక్, సంగీత పాల్గొన్నారు.

టన్నెల్ లోపల వేగంగా సహాయక చర్యలు

ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి అభినందన

లోకో ఇంజిన్‌ను వెలికి తీసిన సహాయక బృందాలు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల సహాయక చర్యలు రెట్టింపు వేగంగా జరుగుతున్నాయి. ప్రమాద స్థలం నుంచి లోకో ఇంజిన్‌ను బయటకు తీశారు. దీనిపై ప్రత్యేక అధికారి రెస్క్యూ బృందాలను అభినందించారు. ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, జీఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, ర్యాట్ హెూల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, అన్వి రోబోటిక్స్ ప్రతినిధులు విజయ్, అక్షయ్, జేపీ కంపెనీ ప్రతినిధులతో శనివారం టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకో ఇంజిన్‌ని వెలికితీయడంపై సహాయక బృందాలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో సహాయక చర్యలను కొనసాగించాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 సహాయక బృందాలు సమన్వయంతో పూర్తి స్థాయిలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. సహాయక బృందాలకు కావాల్సిన సామాగ్రిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని బయటకు తరలించే ప్రక్రియ, మట్టి తవ్వకాలు, స్టీలును తొలగించే ప్రక్రియ సమాంతరంగా జరుగుతున్నట్టు వివరించారు. 4 ఎస్కవేటర్లు, 2 బాబ్ క్యాట్లు నిరంతరాయంగా మట్టిని తొలగిస్తూ.. కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు చెప్పారు.

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-మంథని/రామగిరి/కమాన్‌పూర్

అధికారులంతా జవాబుదారీతనంతో పని చేయాలని ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో రూ.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన తహసీల్దార్ భవన నిర్మాణ పనులకు శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని, అధికారుల్లో జవాబుదారీతనం తీసుకుని రావడానికి చర్యలు చేపట్టామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వల్ల జరిగిన నష్టాలను భూభారతి చట్టంతో పూడ్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఉగాది నుంచి రేషన్‌కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయనున్నామన్నారు. రైతుల పంటలో గింజ కూడా తరుగు కట్ చేయకుండా మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం రామగిరి మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్‌లు కె.చక్రవర్తి, ఈఈ గిరీష్‌బాబు, డిఈ. నవీన్ కుమార్, అజ్రితి ఏరియా జీఎం నరేంద్ర సుధాకర్ రావు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, ముస్త్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గవర్నమెంటు ప్లీడర్లకు రెమ్యూనరేషన్ పెంపు

- జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

న్యాయస్థానాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ప్లీడర్లకు రెమ్యూనరేషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు ఆయా కోర్టుల్లో అధికారులు దాఖలు చేసే కంటెంప్ట్ కేసుల్లో ఇస్తున్న రెమ్యూనరేషన్ రూ. 2000 నుంచి రూ.4000 పెంచుతూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి జీవో నెంబరు 274 విడుదల చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

అంతర్జాతీయ సంఘీభావం అవసరం

- అమెరికా 'టారీఫ్ యుద్ధం'పై సామాజికవేత్తలు, విశ్లేషకులు
- ట్రంప్ వచ్చాకే కెనడా వంటి దేశాలకు సుంకాల బెదిరింపులు
- క్యూబా..వెనిజులా...పాలస్తీనా వంటి దేశాలపై ఎప్పటి నుంచో ఆంక్షలు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు.. ఇప్పటికే ఆయా దేశాలకు ఆగ్రహాన్ని తెప్పించింది. కొన్ని దేశాలు అమెరికా చర్యలకు తలొగ్గగా.. మరికొన్ని దేశాలు మాత్రం తగ్గేదే లేదంటూ ఎదురు నిలబడ్డాయి. ఈ విధంగా తన సుంకాల యుద్ధం కెనడా అమెరికా ముందు లొంగిపోయేలా ఒత్తిడి తెస్తుందని అంతా భావించారు. కానీ, కెనడా నుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. దీంతో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలిందని విశ్లేషకులు చెప్పారు.

అమెరికా చర్యలతో శ్రామిక ప్రజలలో కోపం పెరిగింది. సుంకాలు ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలోని దాదాపు ప్రతి కార్మికుడినీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఒక్క ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలలోనే కెనడాలో 43,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు ప్రమాదంలో పడటం గమనించాల్సిన అంశం.

ఈ దేశ ఎగుమతుల్లో మూడొంతుల కంటే ఎక్కువ యూఎస్‌కు వెళ్తాయి. ఇది ప్రతి నెలా దాదాపు 50 బిలియన్ డాలర్లు. కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయీస్ (సీయూపీఈ) అంచనా ప్రకారం... " దిగుమతి సుంకాలు దాదాపుగా లక్షలాది ఉద్యోగాలు కోల్పోవడానికీ, కెనడాలో మాంద్యం ఏర్పడటానికి కారణమవుతాయి. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తిరిగి రావడం ద్వారా మరింత దిగజారిపోవచ్చు" అని హెచ్చరించింది.

సుంకాలు బెదిరింపులకు గురైన వెంటనే కెనడాలోని కార్పొరేషన్లు కార్మికులపై ఆధారపడటం ప్రారంభించాయి. రైలు కార్లను ఉత్పత్తి చేసే హామిల్టన్‌లోని నేషనల్ స్టీల్ కార్, దాని 1,400 మంది కార్మికులలో 90 శాతం మందిని తొలగించింది. మాంట్రియల్కు చెందిన ప్యాంటీహౌస్ తయారీదారు షీర్టెక్స్ దాని 350 మంది కార్మికులలో 40 శాతం మందిని తొలగించింది. క్యూబెక్‌లోని సౌత్ షోర్ ఫర్నీచర్ 115 ఉద్యోగాలను తగ్గించి, 100 మందికి పైగా ఉద్యోగాలను తొలగించింది. ఆపై సుంకాల బెదిరింపుల కారణంగా దాని వ్యాపార నమూనాను పునర్నిర్మించే ప్రణాళికలను ప్రకటించింది. ప్రైస్వాటర్ హౌస్ కూపర్స్ నిర్వహించిన కెనడాలోని వ్యాపారాలపై నిర్వహించిన సర్వేలో దాదాపు ఐదు కంపెనీలలో ఒకటి వాణిజ్య యుద్ధానికి ప్రత్యక్ష ప్రతిస్పందనగా యూఎస్‌లో తమ కార్యకలాపాలలో కొంత లేదా అన్నింటినీ తీవ్రంగా పునరాలోచించుకుంటున్నట్టు తెలిపాయి.

వ్యవసాయంలో సరఫరా నిర్వహణతో సహా ప్రాంతీయ వాణిజ్య నిబంధనలపై తీవ్రమైన బెదిరింపులు ఉన్నాయి. ఇటువంటి చర్య సరిహద్దుకు ఇరువైపులా ఉన్న గుత్తాధిపత్య సంస్థలకు ఒక వరం అవుతుంది. కానీ ఇది పదివేల మంది రైతులు, ట్రక్కర్లు, రవాణా కార్మికులకు తక్షణ కష్టాలను తెస్తుంది. ఇది దేశవ్యాప్తంగా శ్రామిక ప్రజల ఖర్చు శక్తిని, ఆరోగ్యం, భద్రతను కూడా ప్రమాదంలో పడేస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు.

కెనడాలోని శ్రామిక ప్రజలు 25 శాతం మంది సుంకాల ముప్పుపై చాలా కలత చెందుతుంటే... వెనిజులా, పాలస్తీనా, క్యూబా ప్రజలు ఎదుర్కొంటున్న పూర్తి స్థాయి ఆంక్షలు, దిగ్బంధనాల ప్రభావాల నుంచి ఎంతో కొంత నేర్చుకోవాల్సిన అవసరాన్ని నిపుణులు చెప్తున్నారు.

వెనిజులాపై అమెరికా కనీసం 2014 నుంచి ఆంక్షలు కొనసాగిస్తోంది. కెనడా, ఈయూ 2017లో వాటిని విధించాయి. చమురు పరిశ్రమను లక్ష్యంగా పెట్టుకున్నాయి. మొదటి ఆంక్షలు విధించిన ఆరు సంవత్సరాలలో, వెనిజులా చమురు ఆదాయం 93 శాతం తగ్గింది. ఇదే కాలంలో, తలసరి ఆదాయం 72 శాతం పడిపోయింది. 2020 ప్రారంభంలో ఆంక్షల ఫలితంగా వెనిజులాలో 100,000 మందికి పైగా మరణాలు సంభవించాయని మాజీ యూఎన్ ప్రత్యేక నివేదకుడు ఆల్ఫ్రెడ్ డి జాయాస్ అంచనా వేశారు.1990 దశకం ప్రారంభంలో గాజాలో ఇజ్రాయెల్ కదలికలు, వస్తువులపై ఆంక్షలు విధించినప్పటి నుంచి పాలస్తీనా ఆంక్షలు, దిగ్బంధనలకు గురైంది. గాజాపై ఆర్థిక ప్రభావం దిగ్భ్రాంతికరంగా ఉన్నది. 1996లోనే ఇజ్రాయెల్ ఆంక్షలతో గాజా స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 40 శాతం ఖర్చయిందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

క్యూబా ఆరు దశాబ్దాలకు పైగా అమెరికా నుంచి దిగ్బంధనను ఎదుర్కొంటోంది. ఇది క్యూబా ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలనూ పూర్తిగా ప్రభావితం చేస్తుంది. దీనిని అమెరికా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అంతర్జాతీయాకరించింది. 2023లో, ఐక్యరాజ్యసమితి... దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి క్యూబా ఆర్థిక వ్యవస్థకు జరిగిన మొత్తం ఆర్థిక నష్టం "ట్రిలియన్ల డాలర్లు"గా అంచనా వేసింది.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత కెనడాను టార్గెట్‌గా చేసుకున్నారు. ట్రంప్ సుంకాల యుద్ధానికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు పోరాడుతున్నారు. ఇలాంటి తరుణంలో వెనిజులా, పాలస్తీనా, క్యూబా, ఇతర ప్రాంతాలలో అనుభవించిన కష్టాల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఇది చాలా సందర్భాలలో యూఎస్ ప్రభుత్వాలు విధించిన ఆంక్షల బాధలని అంటున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా సుంకాలపై ఆగ్రహం ఒక్కటే పని చేయదనీ, అంతర్జాతీయ సంఘీభావాన్ని నిర్మించుకోవాలని సామాజికవేత్తలు, అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు సూచిస్తున్నారు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పూర్తిచేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ సమీపంలోని శేషమ్మగూడెం వద్ద చేపట్టిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను ఏప్రిల్ 25 నాటికి పూర్తిచేయాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్, నల్లగొండ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ జె.శ్రీనివాస్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును తనిఖీ చేశారు. 2014లో రూ.38 కోట్లతో ఈ ప్లాంట్ మంజూరు అయిందని, ఇప్పటివరకు పనులు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. పట్టణంలో దాదాపు 80 శాతం ఇండ్లు ఎస్టీపీ కనెక్షన్లు కలిగి ఉన్నాయని, ముఖ్యంగా వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీ లాంటి కాలనీలకు ఎస్టీపీ కనెక్షన్ ఉందని, మిగతా ఇండ్లకు కూడా ఎస్టీపీ కనెక్షన్లు ఇస్తామని మంత్రి చెప్పారు. రానున్న 25, 30 రోజుల్లో ఎస్టీపీ నిర్మాణం పూర్తిచేయాలని మున్సిపల్ ఇంజజినీరింగ్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పూర్తి చేయడంతోపాటు చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, టైల్స్, పెయింటింగ్ వంటి వాటన్నింటినీ ఏర్పాటు చేయాలని చెప్పారు. నర్సప్పగూడ వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టీపీ నిర్మాణాన్ని చేపట్టనున్నామని, ఇందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి పనులనూ చేపట్టబోమని స్పష్టం చేశారు. ఎన్జీ కళాశాల మైదానంలో హరితహారం మొక్కలు నాటాలని, ఎవరూ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త వేస్తే జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో ఫ్లైఓవర్లకు పెయింటింగ్ వేయించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. అనంతరం మంత్రి ఛాయా సోమేశ్వర దేవాలయం వెనుక వైపు ఉన్న డైసింగ్ కుంట రోడ్డును, ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్డిఓ అశోక్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మంటలు చెలరేగి..
వ్యక్తి సజీవ దహనం

- అదే గ్రామంలో ఇటీవల కరెంటు షాక్‌తో అన్నదమ్ములు మృతి
- భయాందోళనలో గ్రామస్తులు



(ఫైల్)

నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని గోవింద్పూర్‌లో మరోమారు విద్యుద్ఘాతం జరిగి.. ఓ వ్యక్తి కాలి బూడిదయ్యాడు. అదే గ్రామంలో ఇటీవల అన్నదమ్ములు విద్యుద్ఘాతానికి గురై పొలం దగ్గరే ప్రాణం కోల్పోయిన విషయం విదితమే. తాజాగా మరో వ్యక్తిపై 11కేవీ విద్యుత్ వైరు తెగిపడటంతో మంటలు చెలరేగి సజీవ దహనమయ్యాడు. వరుస విద్యుత్ ప్రమాదాల వల్ల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్పూర్ గ్రామ పరిధిలోని డాక్టర్ ఉషా కిరణ్ వ్యవసాయ క్షేత్రంలో నరసింహారెడ్డి(50) పని చేస్తుండేవాడు. శనివారం పొలంలో పని చేస్తుండగా 11 కె.వి విద్యుత్ వైరు తెగి ఆయనపై పడింది. దాంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ తీగ తెగిపడిన సమయంలో అక్కడి లైన్ ట్రిప్ అయింది. అయితే, వైర్లపై పక్షులు కూర్చున్నా అలాగే అవుతుందనుకొని విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా చేశారు. అప్పటికే విద్యుద్ఘాతం జరగ్గా.. మరోమారు కరెంట్ రావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో నరసింహారెడ్డి ఆ మంటల్లోనే కాలి బూడిదయ్యాడు. పంట పొలంలో మంటలు రావడం చూసిన స్థానిక రైతులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా నరసింహారెడ్డి మృతదేహం కలిపోవడాన్ని చూశారు. దాంతో విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వడంతో వారు సరఫరా నిలిపివేశారు. బాధిత కుటుంబానికి పొలం యజమాని ఆర్థిక సాయం చేయాలని ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం వద్ద బంధువులు ఆందోళన చేపట్టారు. దాంతో పొలం యజమానితో పోలీసులు చర్చలు జరుపుతున్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, కొన్ని రోజుల కిందటే నరసింహారెడ్డి ఏకైక కూతురు అనారోగ్యంతో మృతిచెందింది. దాంతో ఆమె కుమార్తెను నరసింహారెడ్డి దంపతులే పోషిస్తున్నారు. వ్యవసాయ పొలం వద్దే ఉంటూ ఆయన పనులు చేసేవారు. నరసింహారెడ్డి మృతితో.. భార్య, మనువరాలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే..

ఇదే గ్రామంలో 15 రోజుల కిందట ఇద్దరు అన్నదమ్ములు విద్యుద్ఘాతానికి గురై మృతిచెందారు. ఆ ప్రమాదం జరిగినప్పుడే విద్యుత్ అధికారులు స్పందించి వైర్లకు మరమ్మతు చేస్తే ఈ ప్రమాదం జరిగి ఉండేదని కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే నరసింహారెడ్డి మృతిచెందాడని ఆరోపిస్తున్నారు. వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ దుబారా వ్యయంపై మస్క్ అసంతృప్తి

సమర్థత, సమగ్ర పరిశీలనకు పిలుపు



వాషింగ్టన్ : ఎలన్ మస్క్ ప్రభుత్వ కార్యకలాపాల సామర్థ్యాన్ని బహిరంగంగా విమర్శించారు. వాటిని వాణిజ్య వ్యాపారాలతో పోల్చారు. ఇక్కడ ఇలాంటి అసమర్థతలు దివాలా, చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయి. డోజ్ అభివృద్ధి చేసిన అధునాతన సాంకేతికత.. మోసాన్ని గణనీయంగా తగ్గించగలదని ఆయన సూచిస్తు న్నారు. ముఖ్యంగా సామాజిక భద్రత వంటి ప్రభుత్వ కార్యక్రమాలలో, గణనీయమైన శాతం కాల్‌లు మోసపూరితంగా ఉంటాయి. మస్క్ వ్యాఖ్యలు ప్రభుత్వ సామర్థ్యం, నియంత్రణ భారాలు, ప్రభుత్వ రంగ సవాళ్లకు ప్రయివేట్ రంగ నిర్వహణ పద్ధతుల వర్తింపుపై చర్చకు దారితీశాయి.

ప్రభుత్వ గుప్పిట్లో న్యాయ వ్యవస్థ

చట్టానికి ఇజ్రాయెల్ పార్లమెంటు ఆమోదం



టెల్‌అవీవ్ : న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వ నియంత్రణ పెంచేందుకు ఇజ్రాయెల్ పార్లమెంటు చట్టాన్ని ఆమోదించింది. దీనితో న్యాయ వ్యవస్థను ప్రభుత్వ గుప్పిట్లోకి తెచ్చుకున్నది. గతంలో ప్రధాన మంత్రి ఎదుర్కొన్న అవినీతి ఆరోపణలను అక్కడి సుప్రీంకోర్టు విచారణ జరపడం తెలిసిందే. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ ప్రజలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత తిరోగమన చర్య అని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.